స్థాపితము 1926 రిజిస్టరు నెం. ఎ.92

గోలకొండ పత్రిక

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి, ఎం.ఏ

సంపుటి: 14 సంచిక: 227 :: హైదరాబాద్, బుధవారము 30-8-1961 :: 6 పేజీలు 7 నయాపైసలు

ప్లాస్టిక్ ఇటుకలు

లండన్, ఆగస్టు 29

ఉత్తర ఇంగ్లండ్‌లోని ఒక సంస్థ ప్లాస్టిక్ ఇటుకలను వాడుకలోకి తీసుకువచ్చినది. వీటితో నిర్మించే ఇండ్లు మామూలు ఇటుకలతో నిర్మించే ఇండ్లకంటే ఎక్కువ కాలము నిలుస్తవని అంటున్నారు. నిప్పు అంటుకొనని రసాయనాలు కలిసిన ప్లాస్టిక్ పోగులతో ఈ ఇటికలను తయారు చేసినారు. ఇటుక మధ్య గట్టి ఘనపదార్థము ఉంటుంది.

ప్లాస్టిక్ ఇటుకలతో నిర్మించే ఇండ్ల ఖర్చుకూడా మామూలు ఇటుకలతో నిర్మించే ఇంటి ఖర్చింతయే ఉంటుందట.

రు. 20లు వసూలుకు 6000 మైళ్ల ప్రయాణం!

లండన్, ఆగస్టు 29 (నఫెస్)

పి. అండ్ ఓ. నౌక "ఆర్కేడియా"పై లండన్ వదిలి వెడుతున్న మొహ్రాన్ నఫా మొహమ్మద్ ఐదుగురు ప్రపంచములో రు.20లు వసూలు చేసేందుకు 6000 మైళ్ళు ప్రయాణముచేసిన ఏకైక వ్యక్తియై ఉంటాడు.

నౌక "స్ట్రాత్‌నవర్" సైద్ ఓడరేవుకు లండన్ వెడుతూ చేరినప్పుడు రు. 20 లు విలువచేసే ఏదోజ్ఞాపకార్థముగా ప్రచురింపబడ్డ వున్న కాలను ఒక సముద్ర యాత్రికుని కమ్ముజూపాడు. ఈ మొత్తము వసూలు చేసేందుకు ఓడలో పయనిస్తూ అతడు తన గిరాకీదారుణ్ణి కనుక్కొనే ముందు అతడు లండన్ చేరుకున్నాడు.

పంజాబీ సూబాకు 'సమేమిరా' అంగీకరించేదిలేదు

అన్ని పరిణామాల ఆలోచించే నిర్ణయం తీసుకోబడిందని ప్రధాని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 29

ప్రభుత్వం పంజాబీసూబా ప్రతిపాదనను తిరస్కరించిందని, తన నిర్ణయాన్ని మార్చుకొనే అవకాశం సమీప భవిష్యత్తులో లేదని నేడు లోక సభలో విస్పష్టంగా ప్రధాని నెహ్రూ ప్రకటించారు.

కాంగ్రెస్ సభ్యులు నెహ్రూ ప్రకటనకు హర్షధ్వానాలు చేశారు. పంజాబీ సూబాపై జరిగిన చర్చలో జోక్యం కల్గించుకొని ప్రధానినెహ్రూ ఈ సమస్యపై అన్ని అంశాలను ఏర్పడగల పరిణామాలను జాగ్రత్తగా పరిశీలించే ప్రభుత్వం ఇట్టి నిర్ణయానికి వచ్చిందన్నారు.

ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొనే అవకాశం తమకు కాన్పించడం లేదని సుదూర భవిష్యత్తు మాట తాము చెప్పలేమని అన్నారు శ్రీ నెహ్రూ.

రాజ్యసభ రేపు మధ్యాహ్నం పంజాబ్ పరిస్థితినిచర్చిస్తుంది. పంజాబ్ సమస్యపై నిరశనదీక్ష చేస్తున్న ముగ్గురిని దీక్షా విరమణకు ప్రధాని నెహ్రూ విజ్ఞప్తి చేశారు. ఏసమస్యా పరిష్కారానికి నిరశన దీక్షలు పరిష్కారాన్ని ఇవ్వలేవని వీనివల్ల ఏసమస్య అయినా పరిష్కారం కాగలదన్న భావం ఏర్పడితే మనదేశంలో ఏర్పడే ఇబ్బందులకు అంతు ఉండదని అన్నారు వీరు. ప్రతి సమస్యపై ఎవరో ఒకరు నిరశన దీక్షను పూనుతారని ఆంధ్ర రాష్ట్రం పొట్టి శ్రీరాములు నిరశనదీక్ష బూని మరణించడం వల్ల ఇవ్వబడలేదని ఆ రాష్ట్రాన్ని ఏర్పరచాలని అంతకు ముందే నిర్ణయం తీసుకోబడిందని వివరించారు.

ప్రభుత్వరంగంలో పెట్రోలియం పరిశ్రమాభివృద్ధి

ఇటాలియన్ ఆయిల్ ఏజన్సీతో ఒడంబడిక కుదిరిందని శ్రీ మాలవీయ ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 29

ప్రభుత్వరంగంలో పెట్రోలియం పరిశ్రమ నభివృద్ధిపరచుటకు సాంకేతిక సహాయం, పరపతి సౌకర్యాలు లభింపజేయుటకు సిద్ధముగానున్న ఇటాలియన్ ఆయిల్ ఏజన్సీ ఇ. ఎన్. ఐ తో భారత ప్రభుత్వ సంప్రదింపులు పూర్తి అయినవని, అంగీకార ప్రకారం తృతీయ ప్రణాళికా కాలంలో 100 మిలియన్ డాలర్ల ఋణాన్ని ఆ సంస్థ లభింపజేస్తుందని నేడు పార్లమెంటు ఉభయ సభల్లో శ్రీ కె.డి. మాలవీయ ప్రకటించారు.

కచ్ ప్రాంతంలో పరిశోధన జరుపు నిమిత్తం 20 మిలియన్ డాలర్ల ఋణాన్నిచ్చి సహకరిస్తామని ఏజన్సీ తెలియజేయగా భారత ప్రభుత్వము ఆ విషయాన్ని పరిశీలిస్తున్నదని శ్రీ మాలవీయ తెలిపారు. పరిశీలన పూర్తి కాగానే పరిశోధనల నారంభించుటకు చమురు, సహజవాయువు కమిషన్ కోరబడుతుందని ఆయనచెప్పారు. ప్రభుత్వ సహకారవిధానం ఇ.ఎన్.ఐ.కి ఆమోదయోగ్యం కాకున్న నూతన ప్రతిపాదనలు వచ్చే అవకాశాలెన్నో యున్నాయని మంత్రి అన్నారు.

ఇ. ఎన్. ఐ. ఇచ్చు 100మిలియన్ డాలర్ల ఋణము రెండు విధాల పెట్రోల్ ప్రాజెక్టులపై వినియోగింపబడును. తృతీయ ప్రణాళికాకాలములో ఇదివరకే కేటాయింపు చేయబడిన ప్రాజెక్టులు మొదటి రకము క్రిందికి వస్తాయి. బారౌనీనుండి ఢిల్లీ, కలకత్తాలకు పైప్ లైన్లు వేయుట, గ్యాస్ ప్రాసెస్ ప్లాంట్లు, లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ బాటలింగ్ ప్లాంట్లు మరియు మంచి కము సౌకర్యాలు, లూబ్రికేటింగ్ ఆయిల్ ప్లాంటు, క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి పరికరాల సరఫరా. పరికరాల పంపకము ఇందున్నాయి. ఈ ప్రాజెక్టుల జాబితాలో చమురు, సహజ వాయువు కమిషన్ సూచించిన యే ప్రాంతాలనైనా డ్రిల్లింగ్ చేయుటకూడ యుంది.

ప్రణాళికాసంఘము, ఇతర మంత్రిత్వాలతో ఇంకా సంప్రదించాల్సి యున్న పెట్రోకెమికల్, తదితర ప్రాజెక్టులు రెండవ రకానికి చెందినవి. ఈ విషయములో ఇ. ఎన్. ఐ. తో గూడ సంప్రదించాల్సి యుంటుంది. మొదటి వర్గములో చేరిన ప్రాజెక్టులు 3వ ప్రణాళికాకాలములోనే పూర్తి కావాలని ఆశింపబడింది.

ప్రస్తుతము కుదుర్చుకున్న ఒడంబడిక ఇటలీతో మొట్టమొదటిదని, ముందు ముందు ఇంకా అధికసహాయం రాగలదని శ్రీ మాలవీయ ఆశించారు. భారత పెట్రోలియం ఉత్పత్తుల అభివృద్ధికి ఇ. ఎన్. ఐ. సహాయపడుచున్నందుకు ప్రభుత్వ పక్షాన ఆయన ధన్యవాదాలర్పించారు.

పట్టణంగా తిరుపతి అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర దేవస్థాన బోర్డు నిర్ణయం

తిరుపతి, ఆగస్టు 29

తిరుమలై తిరుపతి దేవస్థానం ట్రస్టీలబోర్డు తిరుపతిని పట్టణంగా రూపొందించవలసినదిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుటకు తీర్మానించినది.

ఈబోర్డు తిరుమలైలో ఫల పరిశోధనా కేంద్ర స్థాపనకు ప్రభుత్వానికి ఏడు ఎకరాల స్థలాన్ని ఇచ్చుటకు ఈ కేంద్రానికై రు. 55 వేల అనావృత్త వ్యయం రు. 140226 ఆవృత్త వ్యయాన్ని ఇచ్చుటకు నిర్ణయించినది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సుప్రభాత సేవకు వయోజనునికి రూపాయి చొప్పున టికెట్ పెట్టుటకు గూడా బోర్డు నిర్ణయించినది.

జీవితభీమా సంస్థ వ్యాపారం

1960 లో రు. 498 కోట్లు

బొంబాయి, ఆగస్టు 29

1960లో భారత జీవిత భీమా సంస్థ 1.1లక్షల పాలసీల అధికంగా చేసింది. వీనివల్ల అదనముగా రు. 69కోట్ల అదనపు వ్యాపారం లభించింది. 1960 లో రు.498 కోట్లకు హామీ ఇస్తూ 1.26 మిలియన్‌ల పాలసీలను లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ చేసిందని 1959లో రు.429కోట్ల వ్యాపారానికై 1.15 మిలియన్ పాలసీలు ఇస్యూచేయబడినవని దీని చైర్‌మన్ గోపాల కృష్ణన్ తెలిపాడు.

సోషలిస్టుపార్టికి అఖిలభారతస్థాయి

ఎలక్షన్ కమీషన్‌కు పార్టి అధ్యక్షుని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 29

భారత సోషలిస్టు పార్టిని అఖిల భారత సంస్థగా ఎలక్షన్ కమీషన్ గుర్తించాలని పార్టీ అధ్యక్షులు శ్రీ రాజ్ నారాయణ్ నిన్న యిక్కడ అన్నారు. బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మణిపూర్ రాష్ట్రాలలో తను పార్టిని గుర్తించటం జరిగిందని ఆయన విలేఖరులకు తెలియచేశారు.

సోషలిస్టుపార్టి వచ్చే జనరల్ ఎన్నికలలో 155 పార్లమెంటు స్థానాలకు 12 వందలు వివిధ రాష్ట్ర శాసనసభ నియోజకవర్గాలకు అభ్యర్థులచే పోటీ చేయిస్తుందని పార్టీ అధ్యక్షులు వివరించారు.

తారాసింగ్, ఫతేసింగ్‌లపై వారంట్లు నిష్ఫలస్థితి

లోకసభలో నేడు హోంమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 29

స్వర్ణ దేవాలయములోపల ఉంటున్నందున మాస్టర్ తారాసింగ్‌ను మరి ఇద్దరు అకాలీ నాయకుల్ని అరెస్టు చేయాలని జారీ అయిన వారంటును అమృతసర్ పోలీసుఅధికారులుఅమలు పరచజాలక పోయిన అంశము నేడు లోకసభలో చర్చకు పెట్టడానికి కాంగ్రెసు సభ్యుడు శ్రీ మహావీర్ త్యాగి ప్రయత్నించారు.

ఆరాధనా స్థలాలలోకి పోలీసులు ప్రవేశించకుండా నిబంధించడాన్ని ఆయన విమర్శిస్తూ అయితే ఈ ఆరాధనా స్థలాలు నేరస్తుల తావులు కావచ్చునా అని ప్రశ్నించారు.

ప్రధాని నెహ్రూ కలిపించుకొని పవిత్రస్థలాలు నేరస్తుల స్థానాలు కావడము కూడనిమాట వాస్తవమే అయినప్పటికీ ఎప్పుడు చర్యతీసుకోవాలి ఎప్పుడు తీసుకోగూడదన్నది పరిస్థితులపై ఆధారపడిఉంటుందని అన్నారు

శ్రీ త్యాగి ఈవిషయంలో ప్రభుత్వ దృక్పథమేమిటో స్పష్టపరుపాల్సిందిగా పట్టుబట్టారు. హోం మంత్రి శ్రీ లాల్ బహాదర్ శాస్త్రి నిరేపు లోకసభలో ప్రకటన చేయాల్సిందిగా స్పీకర్ కోరారు.

విద్యుద్వాహకంగా ఉండే గాజుతయారీ

న్యూఢిల్లీ, ఆగస్టు 29

రష్యాలో విద్యుద్వాహకంగా ఉండే గాజు తయారుచేసే విధానము కనుక్కొన్నారు. ఈ విధానంలో గాజు దారపు ద్రవరూపంలోకి వచ్చే దాకా వేడిచేసి ఆస్థితిలో దానికి టిన్ క్లోరయిడు కలుపుతారు. ఇల్లా తయారయ్యే గాజు శాశ్వత విద్యుద్వాహకంగాపనిచేస్తుందని రుజువు చేశారు. ఈ రకం గాజు మోటారు కార్లలో, విమానాలతో ముందుండే అద్దాలకు బాగా ఉపయోగపడుతుందని కూడా ప్రయోగాలవల్ల తేలింది. ఈ గాజును కొద్ది విద్యుత్ప్రసారంలో వెచ్చచేసి బయిటినుంచి మంచు దానిపై ఘనీభవించకుండా చేయవచ్చును. ఇతర ప్రయోగాలవల్ల ఈ రకము గాజు విద్యుత్పరికరాలలో విద్యుత్తు ప్రసారానికి తట్టుకొని ఉండవలసిన కొన్ని భాగాలను తయారు చేయడానికి ఉపయోగించవచ్చునని తెలిసింది.

5 వేల అణ్వాయుధాలు

నాటోరాజ్యాలఉపయోగానికై

లండన్, ఆగస్టు 29

నాటోరాజ్యాలు అవసరమైతే ఉపయోగించడానికై వివిధరకాలఅణ్వాయుధాలు ఐదువేలు పశ్చిమ జర్మనీ మరియు బ్రిటన్‌లలో నిర్మింపబడినవని డైలీఎక్స్‌ప్రెస్ సైనికవిలేఖరి తెలుపుతున్నాడు.

శ్రీ వేమన ఆంధ్ర భాషా నిలయము నాంపల్లి

(స్వ. వి.)

హైదరాబాదు, ఆగస్టు 29

గత ఆదివారం (27-8-1961) సాయంత్రము 6 గంటలకు శ్రీ వేమన ఆంధ్రభాషా నిలయము నాంపల్లిలో పంచవర్ష ప్రణాళికా ప్రచారశాఖ ప్రాంతీయాధికారి శ్రీ చావలి వెంకట హనుమంతరావుగారు "జాతిఐక్యత, భావనసమైక్యతల ప్రాముఖ్యం గురించి ఉపన్యసిస్తూ మూడవ పంచవర్షప్రణాళిక యొక్క ఆదర్శములను వివరించారు. తరువాత భారత స్వాతంత్ర్యమునకయి జీవితములనర్పించిన మహామహుల ఛాయా పటములు, భారతదేశములోని వివిధ చారిత్రిక, మతస్థలములకు సంబంధించిన చలన చిత్రములు ప్రదర్శింపబడినవి.

పంచాయత్‌రాజ్ పరిశీలక బృందం

గత 26 న నల్గొండ జిల్లా సందర్శన

(మా. వి.)

నల్లగొండ, ఆగస్టు 29

పంచాయతీరాజ్య పరిశీలకబృందం (వాలెంటరీ ఏజన్సీ) నల్లగొండ జిల్లా పరిషత్‌ను సందర్శించింది ఈ బృందానికి నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ జి. యస్. రెడ్డి స్వాగతం చెప్పినారు. ఈ పరిశీలక బృందం రాజస్థాన్‌లో పంచాయతీరాజ్య నిర్వహణను తిలకించి ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలను కూడా ఈ బృందం సందర్శిస్తుంది. ఈ బృందం ఆగమన సందర్భములో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయబడినది. ఈసమావేశంలో జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీ జి.యస్.రెడ్డి ప్రసంగిస్తూ గ్రామపంచాయతీ కమిటీలు పటిష్ఠం అయి వాటి కార్యక్రమాలు నిర్ణయించుకొనిఅమలు పరచే స్థితిలోకి రానంతవరకు పంచాయతీరాజ్యం పురోగమించటానికి ప్రతిబంధకం ఏర్పడేఅవకాశంఉందన్నారు. ప్రస్తుతం మన పంచాయతీ కమిటీలు స్వయం నిర్ణయాధికారం లేక కేవలం జిల్లా పరిషత్, పంచాయతీ సమితులు నిర్ణయించి ఇచ్చే కార్యక్రమాలనుఆచరణలో పెట్టుటకు నిమిత్తమాత్రంగా పనిచేయుచున్నవన్నారు. పంచాయతీ కమిటీలకు తహశీల్ కార్యాలయంలో తగిన గౌరవం లభించుట లేదని తమ విచారాన్ని వెలిబుచ్చారు. కనీసంపంచాయతీ కమిటీలు ప్రాసే ఉత్తరాలకు సమాధానంకూడా తహశీల్ ఆఫీసులో నుంచి లభ్యమవుతాని పరిస్థితి చాలాశోచనీయం అన్నారు. అధికారులు, అనధికారులమధ్య పరస్పర సహకారభావాలు లోపించినందువలన పంచాయతీరాజ్య పురోగమనం ఆధారపడి ఉంది. అధికారులు- అనధికారుల భావాలను సమన్వయ పరచుటకు జిల్లా కలెక్టర్ నేను వివిధ పంచాయతీ సమితులలో పర్యటనచేసినవిషయం ప్రస్తావించారు. ప్రజాసౌకర్యార్థం మనజిల్లాపరిషత్‌లో కొన్ని నిర్దుష్టమైన ఆదేశాలుఇవ్వబడినవన్నారు. పరిషత్ సమావేశాలలో రూపొందింపబడే ఎజెండాలు తెలుగు భాషలో వ్రాయబడుచున్నవన్నారు. జిల్లా పరిషత్‌కు ఎవరైనా ఏవిషయములో వ్రాసినా వారికి వెంటనే విషయాన్ని తెలియచేయుటకు పరిషత్ ఉద్యోగబృందానికిఆదేశాలివ్వబడినవని తెలియచేశారు.

ఈ పంచాయతీరాజ్య నిర్వహణలో ఆర్థిక విషయాలపై కొన్ని లోపాలు కన్పట్టుచున్నవన్నారు. ప్రభుత్వము గ్రాంటులరూపకముగా కొంత ఆర్థికం ఇచ్చుటకు సంసిద్ధపడినా పనులుప్రారంభించేలోగానే గ్రాంటు (లాప్స్) అవడం జరుగుచున్నదన్నారు. జిల్లా పరిషత్ సాంఘిక సంక్షేమశాఖకు ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటు (లక్షా తొంభై వేలు రూ॥ లాప్స్ కావడం జరిగినదన్నారు. గ్రాంటులులాప్స్‌కాకుండా ప్రభుత్వం కొన్ని చర్యలు గైకొనాలని పేర్కొన్నారు.

తదుపరి ప్రతిపక్షసభ్యులు శ్రీ రావి నారాయణరెడ్డి ప్రసంగిస్తూ ప్రభుత్వం కార్యాలయాలలో లంచగొండితనం తగ్గుముఖంలో లేదన్నారు. మరియు పనులు జరుగుటలో చాలా జాప్యము కూడా జరుగుచున్నదన్నారు.

రాజధానీనగరశివార్ల సర్వే

హైదరాబాదు, ఆగస్టు 29

మాస్టర్ ప్లానుస్కీమును అనుసరించి హైదరాబాద్ నగర మున్సిపల్ ప్రాంత పరిసరాలలో కలపంపాబాద్ లింగంపల్లి మెడ్చల్ ఘట్కేశ్వర్ హయాత్ నగర్‌లను సర్వే చేయించేందుకు తగు చర్యలు తీసుకోవాలని చౌన్ ప్లానర్ హైదరాబాద్ జిల్లాపరిషత్ చైర్మన్‌ను కోరాడని తెలుస్తున్నది.

మాస్టర్ ప్లానును అనుసరించి రాజధాని నగర శివార్లుగా ఇవి అభివృద్ధి చేయబడుతవి; హిమాయత్ సాగర్ వద్ద గలరాజేంద్రనగర్ ప్రాంతానికికూడా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయబడింది.

సహకార సంఘాల రిజిస్ట్రారు

కార్యాలయ పునర్వ్యవస్థీకరణ

హైదరాబాదు, ఆగస్టు 29

సహకార సంఘాల రిజిస్ట్రార్ కార్యాలయాన్ని యితర డైరెక్టరేట్ల స్థాయికి తెచ్చేందుకయి ఎకానమీ కమిటీ చేసిన సిఫారసులకనుగుణముగా కొన్ని ఉద్యోగాలను రద్దుచేసి మొత్తం 28 సెక్షన్లతో యీ కార్యాలయాన్ని త్వరలో పునర్వ్యవస్థీకరించడానికి ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి సెక్షన్‌కు ఒక సూపరింటెండెంటు, యిద్దరు క్లర్కులు, జూనియర్ ఇన్స్పెక్టరు, క్లర్కులు లేక వీలయితే ఇద్దరు యల్. డి. సి. లు వుంటారు. యీ కార్యాలయంలో గల ఫొటోగ్రాఫర్ ఉద్యోగాన్ని రద్దు చేస్తూ ప్రచార కార్యక్రమాన్ని సమాచార పౌరసంబంధములశాఖకు మార్చాల్సిందిగా కూడా ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది.

గంగానది వరదలు

పాట్నా, ఆగస్టు 29

రెండవ మారు వచ్చిన గంగానది వరదలవల్ల పాట్నా మాంఘీర్ షాహాబాద్ పూర్ణియాభాగల్‌పూర్ సంతాలేపరగణాలుముజఫర్ పూర్ జిల్లాలలోని 12 వందల చదరపుమైళ్ళ ప్రాంతంలో వెయ్యి గ్రామాలు దెబ్బతిన్నాయి.

ప్రభుత్వం ధరల అదుపులో పెట్టాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 29

నేడు రాజ్యసభ మూడవ ప్రణాళిక పయిచర్చను కొనసాగించినప్పుడు అన్ని పక్షాల సభ్యులు ధరల అదుపులో పెట్టాలని లేనిచో ప్రణాళిక మూలాశయాలే దెబ్బతినగలవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గయజిల్లాలో కలరా

గయ, ఆగస్టు 29

గడచిన మూడు నెలల్లో గయ జిల్లాలో 1167 మంది కలరావల్ల చనిపోయారు.

నారగాజుతో బస్సుబాడీ నిర్మాణం

న్యూఢిల్లీ, ఆగస్టు 29

ఇంగ్లండులోని లోవెస్టాఫ్టులో ఒక కోచీ ఫ్యాక్టరీలో బస్సు బాడీ నిర్మాణానికి నారగాజు ఉపయోగించేందుకై ప్రయోగము చేశారు. బాడీఅడుగు, తలుపు దగ్గరఉండే మెట్లుతప్ప మిగతాబాడీఅంతా పాలిఎస్టర్ లెజిన్‌తో కలిపిన నారగాజుతో ఒక అంతస్తు బస్సు నిర్మించారు. బాడీ నిర్మాణంలో నారగాజు ఉపయోగిస్తే బస్సునిర్మాణం, నిర్వహణ మొదలైన వాటిల్లో ఖర్చు కలిసి వస్తుందో లేదో చూచేందుకే ఈ ప్రయోగము చేశారు.

ధ్వనికి ఎక్కువగా కంపించక పోవడంవల్ల, వేడిని ఎక్కువగా ప్రసారం చేయకపోవడంవల్ల అల్యూమినియము, ఇతర లోహాలతో తయారయ్యే బస్సులలో కంటె అన్ని కాలాలలోఎక్కువ సుఖంగా ప్రయాణించడానికి ఈకొత్తరకం బస్సులు ఎక్కువ వీలు కల్పిస్తాయి.

అటవీసంపద వినియోగ సలహా సంఘం

హైదరాబాద్, ఆగస్టు 29

అటవీ సంపద వినియోగ సలహా సంఘం అధికార సభ్యుడు శ్రీ జె. జెనర్జీ ఉద్యోగ విరమణ చేసినందువల్ల ఆయిన స్థానంలో అటవీశాఖ డిప్యూటీ ఫీఫ్ కన్సర్ వేటర్ శ్రీ వి. యస్. రావును బోర్డు అధికార సభ్యునిగా ప్రభుత్వం నామినేటు చేసింది.

మానుకోట ఎస్. ఐ. కి సంజాయిషీ నోటీసు

మున్సిఫ్ మేజిస్ట్రేట్ చే

(మా. వి.)

మానుకోట, ఆగస్టు 29

కంచాలపల్లి గ్రామానికి చెందిన మాంచాల పుల్లయ్య దాఖల్ చేసిన ఫిర్యాదు పిటిషన్‌ను విచారిస్తున్న మానుకోట మున్సిఫ్ మేజిస్ట్రేటు యీనెల 24న యిక్కడి పోలీసు సబ్ యిన్స్పెక్టరుకు కోర్టు ధిక్కార నేరం క్రింద యెందుకు చర్య తీసుకోనకూడదో తెలుపవలసిందని ఆదేశిస్తూ నోటీస్‌ను జారీ చేయవలసిందని ఉత్తరువు యిచ్చారు. ఈ ఫిర్యాదు విచారణను వచ్చే నెల 2వ తేదికి ఆయన వాయిదా వేశారు.

ఈఫిర్యాదు విచారణ సందర్భంలో కోర్టుకు వచ్చి దీనికి సంబంధించిన భోగట్టా తెలుపవలసిందని ఆదేశిస్తూ మేజిస్ట్రేటు లోగడ జారీ చేయించిన సమన్లను సబ్ యిన్స్పెక్టర్ భాతరు చేయనందున ఆయన చివరకీచర్య తీసుకొన్నారని తెలుస్తున్నది.

మాంచాల పుల్లయ్య ఫిర్యాదులో తన పొలములో 5గురు అక్రమముగా ప్రవేశించి పంటలకు హాని చేశారని ఆరోపించగా వీనికి సంబంధించిన భోగట్టా అందచేయవలసినదని మానుకోటలోని పోలీసు సబ్ ఇన్స్పెక్టరుకు సమన్లను మేజిస్ట్రేట్ జారీచేశారు. వాటిని ఇన్స్పెక్టరు మన్నించనందున చివరకీచర్య తీసుకోబడినదని తెలుస్తున్నది.

కాచీగూడస్టేషను సబ్‌పోస్టాఫీసు

హైదరాబాద్, ఆగస్టు 29

ఉత్తరాలుమొదలయినవి వాటిచిరునామాదార్లకు శీఘ్రంగా బట్వాడా కావడానికి వీలుగా కాచీగూడ సబ్ పోస్టాఫీసును 1961 సెప్టెంబరు 1వ తేదీ నుంచి బట్వాడాఆఫీసుగా మార్చడానికి నిశ్చయించారు. కొత్తఆఫీసుకు "హైదరాబాదు - 27" అనే తపాలా బట్వాడా జోనల్ నెంబరు ఇవ్వబడినది. దీనిక్రిందికి యీదిగువప్రాంతాలు వస్తాయి:-

బడీచావుడీ, ఇసామియా బజారు, మెమటు బస్తీ, ఆజంగల్లీ, కుత్బీగూడ, ప్రభాత్‌టాకీసు, చప్పల్ బజారు, బర్కత్‌పూర (పోర్టు) కాచీగూడ రైల్వే క్వార్టర్లు, ఆజంజాహీరోడ్డు, లింగంపల్లి, యూనివర్సిటీరోడ్డు. రెసిడెన్సీ రాంకోట్ కొత్త భవనాలు.

నగర మేయర్ ఉపవాస వ్రతం

గాయపడిన నగల వ్యాపారస్తులకు సానుభూతి సూచన

హైదరాబాద్, ఆగస్టు 29

చార్‌కమాన్ ప్రాంతంలో నగల వ్యాపారస్తులు అక్రమంగా నిర్మించిన వానిని నిన్న మున్సిపల్ ఉద్యోగులు కూలగొట్టగా ఆ ఘర్షణలో గాయపడిన వ్యాపారస్తులకు సానుభూతి సూచనగా మేయర్ రామమూర్తి నాయుడు నేడు 24 గంటల నిరశనదీక్ష బూనారు.

పోలీసులు జోక్యం కలిగించుకొని నిన్న మున్సిపల్ ఇంజనీరు ఆతనివెంట గల మున్సిపల్ ఉద్యోగి బృందాన్ని కాపాడారు. పోలీసులు లాఠీచార్జి చేశారన్నవార్త సరికాదని చెప్పబడుతున్నది. చార్‌కమాన్ నగలవ్యాపారస్తులు నిన్న ప్రారంభించిన హర్తాలాన్ని కొనసాగిస్తున్నారు.

నిరశనదీక్షపై విమర్శ

మున్సిపల్ ఉద్యోగులు తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించగా వారిపైనగలవ్యాపారస్తుల అనుయాయులు దాడికి దిగగా పోలీసులు జోక్యం కల్పించుకున్నారనిఇట్టిస్థితిలో మేయర్ వ్యాపారస్తులకు సానుభూతి సూచనగా నిరశనదీక్ష సాగించడం విచిత్రంగా ఉన్నదని అఖిలభారత మోమిన్ కాన్ఫరెన్స్ ప్రాంతీయప్రతినిధి శ్రీ అన్వారీ విమర్శించారు.

శ్రీ నాయుడు మేయర్‌గా అధికారాన్ని స్వీకరించినతర్వాత అక్రమ నిర్మాణాల కూలగొట్టడంవల్ల నగర ప్రజలలో సదభిప్రాయం ఏర్పడగా దానిని నిరశనదీక్ష సాగించి వక్రింపచేయడం శోచనీయమని అన్నారు వీరు.

అధికారోత్పత్తి పథకం

హైదరాబాదు ఆగస్టు 29

అధికారోత్పత్తి పథకం (కింద 1971 వ ఫసలీ (1962 జూన్ 30 వ తేదీ వరకూ) లో కూడా యీ క్రింది రాయితీలు లభింపజేయాలని ప్రభుత్వము ఆదేశించింది.

సంస్థలఆవరణలలో సాగుబడి, ఇంటి పెరడుల సాగుబడి, గ్రామం లేక పట్టణాల ఖాళీస్థలాల సాగుబడి, సముద్ర తీర భూముల సాగుబడి, సాంకేతిక కారణాల దృష్ట్యా నీటిపారుదల నిబంధనావళిని ఉల్లంఘించినందుకు విధించబడిన జరిమానాల రద్దు, గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాలలోని కోస్తా ప్రాంతాల భూముల నేర్పాటు.

తారాసింగ్ పరిస్థితి

అమృతసర్, ఆగస్టు 29

మాస్టర్ తారాసింగ్ నిరశనదీక్ష బూని నేటికి 15 రోజులు. తారాసింగ్ బరువులో ఇంకా తగ్గకున్నా ఆతని స్థితి అతిబలహీనముగా ఉన్నది.

తెలంగాణాప్రాంతఉద్యోగాల్లో ఆంధ్ర ప్రాంతీయుల భర్తీ

తగిన అర్హతలు గలవారు లభించనందున జరిగిందని వివరణ

హైదరాబాద్, ఆగస్టు 29

తెలంగాణేతరులతో నింపబడిన ఈప్రాంతపు 12 వందల ఉద్యోగాలలో ఇప్పుడు సగానికిపైగా తెలంగాణా వాసులకు సంక్రమింపచేయబడినాయని నేడు ఒక ప్రభుత్వ ప్రతినిధి తెలిపాడు.

ప్రభుత్వం తెలంగాణాప్రాంత ఉద్యోగాలను భర్తీచేయడంలో ముల్కీ నిబంధనల ఉల్లంఘించి ఆంధ్ర ప్రాంతీయుల నియమిస్తున్నదని 'తెలంగాణా అభివృద్ధిపై ప్రభుత్వ శ్వేతపత్రం' మీద ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు శ్రీ కె. అచ్యుతరెడ్డి, ఉపసంఘప్రతినిధిడాక్టర్ ఎమ్. చెన్నారెడ్డి చేసిన సంయుక్త ప్రకటనను ప్రస్తావిస్తూ ప్రభుత్వ ప్రతినిధి పై విషయాన్ని తెలియచేశాడు.

మొత్తం 15 వందల ఉద్యోగాలు తెలంగాణా ప్రాంతంలో ఉండగా ఇందు 12 వందలు నింపబడినవనిఇంకా 300 ఉద్యోగాలు భర్తీ చేయవలసిఉన్నవని ఈతను అన్నాడు. తెలంగాణా ప్రాంతీయులలో యోగ్యులయినవారు దొరుకకపోబట్టే ఆంధ్ర ప్రాంతీయులు నియమించడము జరిగిందని ప్రభుత్వ వ్యవహారాలు సాఫీగానడువడానికి పని పేరుకొనిపోకుండాఉండటానికై ఇలా చేయవలసివచ్చిందనిఉద్యోగాలభర్తీలో యోగ్యతకలవారు దొరకనిచో ఉన్న నియమాల సవరించడము తక్కువ యోగ్యతలు కలవారిని నియమించడము సరియైన చర్య కాజాలదని ఈతను వివరించాడు. తెలంగాణా ఆఫీసర్ల క్రిందగల కార్యాలయాలలో గూడా ఆంధ్రప్రాంతీయులు నియమింపబడినారంటే దానికి కారణము ఇదేనని కొనకు ఆంధ్రసూపరింటెండెంట్లకు గూడా తెలంగాణా అధికారులు భయపడుతున్నారన్న ఆరోపణలు సరికావన్నాడు ఇతను. తెలంగాణా అధికార్లు సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నాడు.

జర్మనీ స్త్రీలలో 3 వంతు ఉద్యోగినులు

కొలోన్, ఆగస్టు 29

(నఫెస్)-జర్మన్ ఐక్య ప్రజాప్రభుత్వం లోని స్త్రీలలో 3 వంతు పరిశ్రమల్లో, వాణిజ్యములో ఉద్యోగాలున్నవారు 1959లో 39 శాతం 1957 లో 34 శాతం స్త్రీలల్లో ఉద్యోగినులైనట్లు జర్మనీ పారిశ్రామిక సంస్థ అంటున్నది.

రాష్ట్ర ప్రభుత్వానికి 50 వేలు కర్నూలు మున్సిపాల్టీ ఋణం

కర్నూలు, ఆగస్టు 29

కర్నూలు పురపాలక సంఘ అత్యవసర సమావేశము అధ్యక్షులు శ్రీ మహబూబ్ అలిఖాన్ అధ్యక్షతన సమావేశమైనది. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాల సహాయార్థమై రు. 50 వేల ఋణాన్ని యిచ్చుటకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశానికి 32 మందికిగాను 14 మంది హాజరైనారు. (మా.వి.)

ఆదాయం పన్ను సవరణ బిల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 29

ఇన్‌కమ్‌టాక్స్, సూపర్‌టాక్సుకు సంబంధించినశాసనము లసవరించేందుకు సంఘటితపరచేందుకు తోడ్పడే ఆదాయపు పన్ను సవరణ బిల్లును నేడు లోకసభ ఆమోదించింది.

1961-62 సప్లిమెంటరీ డిమాండ్లపై ఈ రోజు అసంపూర్తి చర్చ జరిగింది.

1960లో ఇండియాలో బ్యాంకులు

రిజర్వు బ్యాంకుచే పుస్తకం ప్రచురణ

న్యూఢిల్లీ, ఆగస్టు 29

1960 లో భారతదేశంలో బ్యాంకింగు వ్యవస్థను గురించిరిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ఒకపుస్తకం ప్రచురించినన్న వెలువరించింది. ఈ పుస్తకంలోరెండుభాగాలున్నాయి. మొదటి భాగంలో భారత బ్యాంకింగు వ్యవస్థలోవివిధఅంగాలు అంటే షెడ్యూల్డు బ్యాంకులు, నాన్ షెడ్యూల్డు బ్యాంకులూ, సహకార బ్యాంకులూ వీటిని గురించిన గణాంక సమాచారంపొందుపరచబడింది. 1959 డిసెంబరు 31, 1960 డిసెంబరు 31నాటి ఆయవ్యయ పట్టికలు ఆధారంగా ఆ బ్యాంకుల ఆస్తులూ, అప్పులూ, 1959,1960 సంవత్సరాలలోవాటిలాభనష్టపట్టికలూసమగ్రంగా రెండవ భాగంలోఉన్నాయి.

1960 జూలై నుంచి నెలకు రూ. 12 కోట్ల చొప్పున పి ఎల్ 480 నిధులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రిజర్వుబ్యాంక్ఆఫ్ ఇండియాకు బదిలీచేసినప్పటికీ, 1960లో షెడ్యూల్డు బ్యాంకుల డిపాజిట్లలోపెరుగుదల1959 లోకన్న తక్కువగానేవుంది. అయితే, బ్యాంకులు కల్పించిన పరపతి మొత్తం 1959 లోకన్న చాలా ఎక్కువ.

ఎడ్వాన్సులు ఎక్కువగా యివ్వడమువల్ల అయితేనేమి, వడ్డీరేట్లు పెంచడంవల్ల అయితేనేమి బ్యాంకుల ఆదాయాలు 1959 లోకన్న 1960లో చాలా హెచ్చాయి. అప్పులూ,అడ్వాన్సులమూలముగా,భారత షెడ్యూల్డు బ్యాంకుల ఆదాయాలు 1959లో రూ. 39.9 కోట్లుగాకా, 1960 లో అవి రూ. 45.9 కోట్లకు అంటే రూ. 6 కోట్లు పెరిగాయి, అయితే పెట్టుబడుల మూలముగావచ్చినఆదాయాలు మాత్రం స్థిరంగా ఉన్నాయి.

భారతయూనియన్‌లో షెడ్యూల్డు బ్యాంకుల సంఖ్య 1960లో 228 పెరిగింది. వాటి మొత్తం సంఖ్య 4149, 1958లో ఆ పెరుగుదల 866 అయితే, 1959లో 297. నాన్ షెడ్యూల్డు బ్యాంకుల కార్యాలయాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాల మొత్తం పెరుగుదల 1960లో 78. 1958లో ఆ పెరుగుదల 90,1959లో 111.

ఈ పుస్తకాన్ని "ఎడ్మిన్‌స్ట్రేటివ్ ఆఫీసర్, ఎకనామిక్ డిపార్టుమెంట్, రిజర్వు బ్యాంక్ ఆఫ్ఇండియా, పోస్టు బాక్స్ నెంబరు 1036,బొంబాయి-1" అనే చిరునామాకుగానీ, దగ్గరలో వున్న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం మేనేజరుకుగానీవ్రాసి తెప్పించుకోవచ్చును. వెల 8 రూ. లు. అనుబంధాలు మాత్రమేవున్న సంక్షిప్త ప్రచురణ 1961 సెప్టెంబరు నెల మధ్యలో వెలువడుతుంది. దాని వెల రూ. 2-50 న.పైసలు.

ఎల్లప్పటి తలనొప్పి

తాత్కాలికంగా ఉపశమనకు ఉపయోగించు మందులవల్ల తప్పు కాదు. దీనికొరకై ఎవరైన మంచి అనుభవముగల నేత్రపరీక్షకుని సలహా పొందడం అత్యవసరం.

నేత్రపరీక్ష కంటి అద్దముల ఎన్నికకై ఎల్లప్పుడు.

డాక్టర్ లుఖ్మాన్

(నేత్రపరీక్షా నిపుణుని)

పగలు 3 గంటల నుండి 9 గంటల రాత్రి వరకు

ఈ క్రింది అడ్రసు వారి సలహా పొందండి.

"జనతా ఆప్టీషియన్"

నిజాంషాహి.రోడ్.

ఫోన్ నెం: 5141

మహిళల కొరకు ప్రత్యేక పర్దా ఏర్పాట్లు కలవు.

ప్లవ సం॥ శ్రావణ బ॥ పంచమి
సా. 6-0 అశ్విని సా. 5-35
వ. వ. 1-46 మొ: 3-17 వరకు
రా. వ. 3-0 మొ: 4-34 వరకు
పు॥ శ్రీ కా॥ తె
(శాలివాహన శకము; 8-6-1883)
30-8-1961 బుధవారము

"ఈ సర్వము దేహత్వా
భాసిత మిది దేహియైన
పరమాత్ముని నిన్యాస
ము సకుఁ గా నొదవి
యుపాసించుం గరణ
రూపమై యాకర్తన్."

— భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 35280

30 ఆగస్టు 1961

బుధవారము

రచయితలు-ప్రచురణలు

మనదేశంలో రచన ఒకవృత్తిగా స్వీకరించి గౌరవ ప్రదమైన బ్రతుకును సాగించుకొనే పరిస్థితులు లేవు. రచయితలు తాము వ్రాసిన గ్రంథాల్ని ప్రచురించుకొని వాటి ద్వారా ఆదాయం పొందేందుకు జరుగుతున్న ప్రయత్నాలు అంతగా ఫలిస్తున్నట్లుకూడా తోచదు. గ్రంథాన్ని సొంతంగా ప్రచురించుకున్న రచయితకు అగ్రంథం పంపిణీ, ఆదాయార్జన-అవన్నీ సమస్యలుగా తయారవుతాయి. కాని ఈ మధ్య ప్రచురణ కావింపబడిన గ్రంథాలను వ్యాప్తికితెచ్చి పంపిణీ చేయించడానికి కొన్ని సంస్థలు కృషి చేస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ బుక్‌డిస్ట్రిబ్యూటర్స్, విశాలాంధ్ర ప్రచురణాలయంవంటి సంస్థలు గ్రంథాల పంపిణీలో పబ్లిషర్లకు అండగానే వుంటున్నాయి.

అయితే పబ్లిషర్లకు రచయితలకు మధ్య సంబంధాలు ఎంత వరకూ రచయితలకు ప్రయోజనకరంగా వుంటున్నాయన్నది కొంత ఆలోచించవలసిన విషయం. హైద్రాబాదు నగరం మంత్రుల నివాసకేంద్రం కావడంతో సాహిత్య ప్రచార కేంద్రంగాకూడా రూపొందుచున్నదిగాని సరైన ప్రమాణాలు గల ప్రచురణ కేంద్రముగా తయారు కాలేదు. గ్రంథ ప్రచురణవ్యాపారం విజయవాడ, రాజమండ్రి మున్నగు కొన్ని చోట్లపెరిగినట్లు హైద్రాబాదులో పెరుగలేదు. హైద్రాబాదులోని పబ్లిషర్ల దృష్టి పాఠ్యగ్రంథాల ప్రచురణ వ్యాపారంమీద కేంద్రీకృతమై ఉన్నంతగా సాహిత్య గ్రంథాల ప్రచురణ వ్యాపారం మీదికి మొగ్గలేదనిపిస్తున్నది. ప్రచురణ వ్యాపారం పెరిగిన కేంద్రాల్లో రచయితల యిబ్బందుల్ని అవకాశంగా తీసుకొని పలువురు ప్రచురణ కర్తలు రచయితలకు ప్రతిఫలాలు ముట్టచెప్పడంలో సౌమనస్యంచూపడం లేదని ఒక వదంతికూడా ఉంది. ఇది ఎంతవరకు నిజమో తెలియదు.

ప్రచురణకర్తలనుండి సరైన ప్రోత్సాహం రచయితలకు అందడంలేదనీ సరైన ప్రతిఫలం లభించడంలేదనీ అభిప్రాయం ప్రబలినందువల్లనే రచయితల సహకారసంఘం నిర్వహించడం అవసరమన్న ఒకదృక్పథం కూడాప్రబలింది. అయితేఆవిషయమైకొన్ని తీర్మానాలు, పెద్దల సూచనలు, కేరళ దృష్టాంతము ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో తగిన కృషి జరుగలేదు. ఈవరకే అన్నిభాషల రచయితలకు అనువుగా ఒక రచయితల సహకారసంఘం హైద్రాబాదులో ఏర్పాటైకూడా సరిగా నడవడంలేదని తెలుస్తున్నది. రచయితల్లోఉండే స్వోత్కర్షా దృష్టి, వ్యష్టిప్రయత్న భావము యీ పరిణామానికి దారితీసిఉండవచ్చును.

ఇటీవలగాకూడా రచయితల సహకార సంఘస్థాపనకు జరుగుతున్నకృషిఎట్టిదోతెలియరావడం లేదు. కాని అనేక ప్రచురణ సంస్థలు, పుస్తక పంపిణీసంస్థలు, గ్రంథ పఠనాదోహదకారి వ్యవస్థలూస్థాపింపబడుతున్నాయి. ఇన్నిటివల్ల ఎక్కువగా రచయితలు తమగ్రంథాలను తెలుగులోకి తెచ్చుకోడానికి అవకాశం లభిస్తున్నదేమోగాని రచయితలకు లభించే ప్రతిఫలం పెరుగుతున్నధోరణి కనిపించదు. ప్రచురణ కర్తలుకూడా వ్యక్తులను బట్టి రచయితలపట్ల వ్యవహరించడంకూడాకద్దు. పేరు మోసిన రచయితవ్రాస్తే సాధారణగ్రంథమైనా శిరోధార్య మౌచున్నది, సాధారణ రచయిత వ్రాసే ఉత్తమగ్రంథమైనా గణింపు నకు రావడం జరుగకపోవచ్చు. రచయితలకు లభించే ప్రతిఫలాల ధోరణి కూడా ఇదేతీరున ఉంటున్నట్లు వినికిడి. కొంతమంది ఉత్సాహపరులైన యువకులు రచయితలకు మేలుచేకూర్చాలనీ, ఉత్తమ గ్రంథాలు ప్రచురించాలనీ ప్రచురణకర్తలుగా రంగంలోకి ప్రవేశించివ్యాపారస్థిరులైన ప్రచురణ కర్తల పరపతిపోటీలకు తట్టుకోలేక ఆర్థికస్తోమత సమకూర్చుకోలేక నీరుకారిపోవడం కూడా సంభవిస్తున్నది.

ఈపరిస్థితులదృష్ట్యా ప్రచురణ కర్తలు వ్యక్తులనుబట్టి వ్యాపారం చేస్తూ రచయితల్లో సరైనవిశ్వాసము కల్పించగల స్థితిని, భారీ ప్రచురణ కర్తముందు ఆశయాలతో నిలబడదలిచిన లఘుప్రచురణకర్త క్రిందైపోకుండా నిలబడగల స్థితిని మనం సమకూర్చుకోడం అవసరం.

ఇందుకై ప్రచురణకర్తల సహకారసంఘం ఏర్పాటు అవకాశాన్ని విజ్ఞులు పరిశీలించగలరని ఒకసూచన. రచయితలకిచ్చే ప్రతిఫలం గౌరవప్రదమైన స్థాయిలో నిర్ధారించి దేశానికి అవసరమైన అన్నివిధాల గ్రంథాలనూ ప్రోత్సహిస్తూ సహకారాత్మక వ్యాపారాన్ని ప్రచురణ కర్తలు నిర్వహించేట్లయితే రచయితల సమస్యలతోపాటు ప్రచురణ వ్యాపారంలోని లగువు బిగువులుకూడా సడలిపోగల వనిపిస్తున్నది. సాధారణంగా గ్రంథప్రచురణమే వ్యాపారంగా ఉన్నవారు దేశావసరమైన సాంకేతిక శాస్త్రీయ చారిత్రిక గ్రంథాలను చిన్నచూపు చూస్తారనీ వాటి ప్రచురణపట్ల ప్రత్యేకశ్రద్ధ కలవారు మరో ప్రచురణ సంస్థ పెట్టుకోవలసి వస్తుందనీ అలాగే భిన్నభిన్న ఆశయాలతో భిన్నభిన్న ప్రచురణ సంస్థలేర్పడి తగిన స్తోమత కుదుర్చుకోలేక వసివాడిపోవడం జరుగుతున్నదనీ ఈ పరిస్థితులవల్ల కొందరు వ్యక్తులు చివరకు రచయితలు నష్టపోతున్నారనీ అనుభవజ్ఞులకు తెలియనిదికాదు.

రచయితలకు గౌరవప్రదమైన ప్రతిఫలం ముట్టజెప్పడానికి రచయితల మధ్య వివక్షతలు చూపకుండా వ్యాపారం నిర్వహించడానికిగాను ముందుగా రచయితల నివ్వవలసినపేజీరేటు నిర్ణయింపబడాలి. తరువాత విభిన్న ఆశయాలతో గ్రంథ ప్రచురణలకు పూనుకొనే వారందరికీ సహకార సంఘంలో స్థానం కల్పిస్తూ దేశావసర సాహిత్య ప్రచురణకు సహాయ సంపత్తులుకలిపించాలి. ఈరెండు లక్ష్యాలతో ప్రచురణ కర్తల సహకార సంఘం ఏర్పాటైతే ఎలాగూ ప్రచురణ కర్తలకు సహజంగా ఉండే వ్యాపార దృష్టివల్ల సంస్థ పటిష్ఠంగానూ నడ గలుగుతుంది, రచయితలకూపమేలుచేకూరుతుంది,ఉత్తమ సాహిత్యమూ అందుతుంది.

నెహ్రూ ప్రతిపాదనకు తారా సింగ్ వ్యతిరేకత

పంజాబీసూబా యేర్పాటయ్యే వరకు దీక్షను విరమించేది లేదని స్పష్టీకరణ

అమృత్‌సర్, ఆగస్టు 29

సిక్కుల పట్ల పక్షపాత వైఖరితో ప్రవర్తించారన్న ఆరోపణలను విచారించుటకు ఉన్నతాధికార సంఘాన్ని నియమించేందుకై నెహ్రూ చేసిన ప్రతిపాదనను మాస్టర్ తారాసింగ్ వ్యతిరేకించారు. పంజాబీసూబా నిర్మాణానికి హామీ యివ్వనంత వరకు నిరాహార దీక్షను విరమించేది లేదని ఆయన ప్రకటించారు.

ఇతర రాష్ట్రాలన్నిటిలో అమలు పరచిన భాషా సూత్రాన్ని అమలు పరచకుండుటే సిక్కులను భేదముగా చూచుట అని తారాసింగ్ నిన్న విలేఖరులతో చెప్పారు.

ప్రాంతీయసంఘాలనుతిరిగి పనిచేయునట్లు చేయుటకు ప్రధానిచేసిన సూచనను ప్రస్తావించి నేను కోరే దానికి, నెహ్రూ సూచన కేమాత్రము సంబంధము లేదన్నారు.

అవమాన జీవితాన్ని గడిపే కన్నా గౌరవముగా మరణించుట నాకిష్టం అన్నారు మాస్టర్ జీ. హిందూ-సిక్కు ఐక్యతను ప్రస్తావించి రాష్ట్ర నిర్మాణానికి కేంద్రము ఒప్పుకున్న తర్వాత కూడ యెంతో ఐక్యంగా యుండాల్సిన అవసరముందన్నారు. పంజాబీసూబా పేరుతో రాష్ట్ర మేర్పాటు కావాలని తాను కోరుటలేదని, ఇంకే పేరుతో నయినా సరే తన కోరిక నామోదించిన సంతోషమేనని, పంజాబుకు ఏకభాషా సూత్రము వర్తింపజేసిన సరిహద్దుల నిర్ణయం తరువాత తేల్చవచ్చని మాస్టర్ జీఅన్నారు.

పంజాబ్ రాష్ట్ర నిర్మాణానికి హిందూ-సిక్కులు ఒడంబడిక చేసుకోకుండా రాష్ట్రప్రభుత్వము అవాంతరము కలిగిస్తున్నదని, గవర్నర్ పాలనను అమలుపరచి ప్రశాంత వాతావరణ మేర్పడగలదని ఆయన అభిప్రాయము వెలిబుచ్చారు. భాషా సిద్ధాంతాన్ని అంగీకరించనంత వరకు గవర్నర్ పాలన నమలు పరచినా దీక్షను విరమించేది లేదని ఆయన తెలిపారు.

దీక్షను విరమించాలని 20 మంది ఎమ్. పి. ల విజ్ఞప్తి

మాస్టర్ తారాసింగ్, రామేశ్వరానంద్, యోగిరాజ్ సూర్యదేవులు నిరాహార దీక్షను విరమించాలని 20 మంది ఎమ్. పి. లు నిన్న ఒక విజ్ఞప్తి చేశారు. ఉపవాసాలు, ప్రత్యుపవాసాలు దేశానికి క్షేమకరము కాదని వారు ప్రకటించారు.

మాస్టర్ తారాసింగ్ దీక్షను విరమింపజేయుటకు యేదో ఒక మార్గం ఆలోచించాలని శ్రీ కె. ఎమ్. మున్షీ ఢిల్లీకి బయలుదేరుటకు పూర్వం అభిప్రాయపడ్డారు. శ్రీ శాలి నాయకుడు పట్టనపట్టు విడుచుట లేదనీ కూడ ఆయన వ్యక్తపరచారు. ఉపవాస దీక్షలకు శాంతి వ్యతిరేకిస్తే, అయినా మాస్టర్ తారాసింగ్‌కు అది మంచిదని తోచింది కనుక ఆయనకు అలాచేయు హక్కు యున్నదని శ్రీ మున్షీ అన్నారు. మున్షీ, దిగ్విజయనాథ్‌గారలు తారాసింగ్‌ను దీక్షను విరమించాల్సిందిగా కోరారు. దీక్షను విరమించి హిందూ సిక్కు నాయకులు పరస్పర చర్చలు జరిపి ఒక నిర్ణయానికి రావచ్చని వారు తెలిపారు.

పంజాబ్ సమస్యా పరిష్కారానికి శ్రీయుతులు మౌల్‌చంద్రశర్మ, కె. ఎమ్. మున్షీ మహంత్ దిగ్విజయ, చౌధరికర్తార్ సింగ్, మాస్టర్ తారాసింగ్, యోగిరాజ్ సూర్యదేవ్‌తో చర్చలు జరిపారు. యీ నలుగురు ప్రధానికి ఒక విజ్ఞప్తిని అందజేస్తారు.

కిన్నెరసాని ప్రాజెక్టు ఆమోదం

హైద్రాబాదు, ఆగస్టు 29

గోదావరికి ఉపనదియైన కిన్నెరటానికడ్డంగా ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి ఖర్చు రు. 40,000,000లు ఇదికొత్త గూడెంలో నిర్మింపనున్న ఎరువుల కర్మాగారానికి నీటిని ఒనగూరుస్తూ, సింగరేణి బొగ్గుగనులకు నీటినిస్తూ, దానిఎడమ కాల్వ ప్రదేశంలో 30,000 ఎకరాలకు నీటినిస్తుంది. (నెఫెన్)

గ్రంథ ప్రచురణలకు పూనుకొనే వారందరికీ సహకార సంఘంలో స్థానం కల్పిస్తూ దేశావసర సాహిత్య ప్రచురణకు సహాయ సంపత్తులుకలిపించాలి. ఈరెండు లక్ష్యాలతో ప్రచురణ కర్తల సహకార సంఘం ఏర్పాటైతే ఎలాగూ ప్రచురణ కర్తలకు సహజంగా ఉండే వ్యాపార దృష్టివల్ల సంస్థ పటిష్ఠంగానూ నడ గలుగుతుంది, రచయితలకూపమేలుచేకూరుతుంది,ఉత్తమ సాహిత్యమూ అందుతుంది.



ఆటోమేటిక్ యంత్రముతో నాట్లు వేసే దృశ్యము

హంగరీ ఆహ్వానానికి భారత ప్రధాని ఆమోదం

హంగరీ- భారత ప్రధానుల సంయుక్త ప్రకటన అంశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 29

హంగరీ ప్రజారిపబ్లిక్ ప్రధానమంత్రి డాక్టర్ ఫెరాండ్ ఫెరెంక్ మ్యూనిచ్, భారత ప్రధాని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ నిన్నచేసిన సంయుక్త ప్రకటనలో ఇలా ఉంది.

"భారత హంగరీ దేశాల ప్రధాన మంత్రులు తమ ఉభయదేశాల క్షేమానికి సంబంధించిన విషయాలపైనా, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితి, జర్మన్ శాంతిసంధికి సంబంధించిన సమస్యఅన్ని రకాల అణుశక్తి ఆయుధాలపైనా నిషేధం, కట్టుదిట్టమైన అంతర్జాతీయ పర్యవేక్షణ క్రింద పూర్తి నిరాయుధీకరణవంటి విషయాలపైనాచర్చించుకొన్నారు. ప్రధాన మంత్రులు ఉభయులు కూడా వలసవిధానాన్ని, జాతి విచక్షణను అంతమొందించడానికి, వెనుకబడినప్రాంతాలకు అవిశ్వేచ్ఛగా ఆర్థిక,సాంఘిక రంగాలలో పురోగమించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని అంగీకరించారు. తమ ఉభయదేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక వ్యవహారాలలో సహకారం పెంపొందుతున్నందుకు ఉభయ ప్రధానులు సంతృప్తిని ప్రకటించారు. త్వరలో ఉభయదేశాల మధ్య సాంస్కృతిక ఒడంబడిక జరుగనున్నదన్న విషయం వారు ఈ సందర్భంలో గమనించారు.

తమకు అనుకూలముగాఉండే సమయములో హంగరీ సందర్శించడానికి రావలసిందిగా హంగరీ ప్రధానమంత్రి భారత ప్రధానిని ఆహ్వానించారు. భారత ప్రధాని ఈ ఆహ్వానాన్ని సంతోషపూర్వకంగా స్వీకరించారు."

మరో పదేండ్ల పాటు విదేశీ సాయమవసరం

భారత రిజర్వుబ్యాంకు గవర్నర్ ప్రకటన

లండన్, ఆగస్టు 29

భారతదేశానికి కనీసము మరో 10 యేండ్లపాటు విదేశాలనుంచి సహాయము తీసుకోవలసిన అవసరమున్నదని భారత రిజర్వుబ్యాంకు గవర్నర్ శ్రీ హెచ్. వి. ఆర్. అయ్యంగార్ నిన్న యిక్కడ వెల్లడించారు. విదేశీ సహాయము లేకుండా మేము మా దేశాన్ని అభివృద్ధి చేసుకొనే స్థితిలో లేమని నిన్న గ్రేట్ బ్రిటన్‌లోని భారత వాణిజ్య మండలి చేసిన విందులో ఆయన చేసిన ప్రసంగములో పేర్కొన్నారు

చైనా విమానాలచే భారత వాయు పరిధి ఉల్లంఘన

ఇండియా ఆక్షేపణపై చైనా నిరాకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 29

గత ఆరు మాసాల్లో ఐదుసార్లు భారత వాయుపరిధిని చైనా విమానాలు ఉల్లఘించిన సంఘటనలపై భారత ప్రభుత్వము చైనా ప్రభుత్వానికి ఆక్షేపణ తెలిపింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వకముగా జవాబిస్తూ రక్షణ మంత్రి శ్రీ కృష్ణమేనన్ యీ విషయము తెలిపారు.

అయితే తాము భారత వాయు పరిధిని ఉల్లంఘించనే లేదని చైనా జవాబిచ్చిందట.

15 ఉచిత విద్యార్థి వేతనాలు

అస్సాంకు మంజూరీ

షిల్లాంగ్, ఆగస్టు 25

అస్సాం రాష్ట్రానికి కేంద్రప్రభుత్వ యోగ్యతా విద్యార్థి ఉచిత వేతనాల పథకంక్రింద 15 ఉచిత విద్యార్థి వేతనాలను ప్రాథమిక మాధ్యమిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు మంజూరు చేసినట్లు తెలియవచ్చింది. (నెఫెన్)

సర్దార్ వల్లభాయిపటేల్ జీవిత చరిత్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 29

రేడియో సమాచార మంత్రి డాక్టర్ బి. వి. కేస్కర్ లోకసభలో శ్రీ భక్తదర్శన్ అడిగిన ప్రశ్నకు లిఖితముగా జవాబిస్తూ, సర్దార్ వల్లభాయిపటేల్ జీవితచరిత్రను రచించే బాధ్యత ఒక సమర్థుడయిన రచయితకు అప్పగించబడినదనీ, సాధ్యమయినంత త్వరలో ఈ పుస్తకాన్ని ప్రచురించడానికి కృషి జరుగుతుందనీ. అయితే సరిగా ఏ తేదీ నాటికి ఈపుస్తకం విడుదలఅవుతుందో ఇప్పుడే చెప్పడం కష్టమనీ, తెలియజేశారు.

లాకర్ల మార్పిడి

భారత- పాకిస్తాను దేశాల మధ్య లాకర్లూ, బ్యాంకు కాతాలూ, నిధులూ-వీటి మార్పిడి 1961 సెప్టెంబరు 30 న జరుగుతుంది.

లోకసభలో శ్రీ పి. సి. దేబ్, మరో ఆరుగురు అడిగిన ప్రశ్నకు కేంద్ర పునరావాసకల్పన మంత్రి, శ్రీ మెహర్‌చంద్ ఖన్నా సమాధానము చెబుతూ పై విషయం తెలియజేశారు.

మెట్రిక్ తూనికల వాడకం

వ్యాపారులకు హెచ్చరిక

హైద్రాబాదు, ఆగస్టు 29

మెట్రిక్ తూనికలు ఉపయోగించుటలో వ్యాపారస్తులఅనుచితలాభాలు తీస్తున్నారనీ, ముఖ్యంగా 200,100,50,10 గ్రాముల తూనికలను వరుసగా పావుసేరు,అర్థపావు,చటాకు ఒక తులం బాట్లకు సమానముగా చెప్పుతున్నారని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు 1958 ఆంధ్రప్రదేశ్ తూనికలు, కొలమానముల (అమలు) చట్టం క్రిందఇదినేరంగాపరిగణించబడుతుంది. పై చట్టంలోని 33వ సెక్షన్‌ప్రకారము నేరస్థులు శిక్షించబడతారని తూనికలు కొలమానముల శాఖవారు హెచ్చరిస్తున్నారు.

.....

రైలుపట్టాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధత

మరో మూడేళ్ళలో సాధ్యపడగలదట

న్యూఢిల్లీ, ఆగస్టు 29

రైలుపట్టాల ఉత్పత్తిలో భారతదేశము 1963-64 నుండి స్వయం సమృద్ధ స్థితికి చేరుకోగలదని లోకసభలో నేడు రైల్వేల ఉపమంత్రి షానవాజ్‌ఖాన్ తెలిపారు. ప్రస్తుతం భారతదేశము పోలెండు, జెకోస్లొవేకియాల నుండి 6.37 కోట్ల విలువగల రైలు పట్టాలు దిగుమతి చేసుకుంటున్నదట.

వాలీబాల్ టోర్నమెంటు

ఎంట్రీల గడువు

హైద్రాబాదు, ఆగస్టు 29

వెంకట రామా రెడ్డి కప్, డా॥ నందన్ సింగ్ కప్ జూనియర్, సీనియర్ యువ సంక్షేమ సమాఖ్య (యూత్ వెల్ఫేర్ ఫెడరేషన్) వాలీబాల్ టోర్నమెంటుకు ఆగస్టు 31 లోగా ఎంట్రీలను పంపాలి. హైద్రాబాద్ సెంట్రల్ వాలీబాల్ అసోసియేషన్‌తో అనుబంధంగాఉన్న ప్రయివేటు క్లబ్బులకు ఎంట్రెన్స్‌ఫీజులేదు. వివరాలను శ్రీ ఎల్. వెంకట్రామా రెడ్డి కేరాఫ్ హైద్రాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ బారుక్షఫా, హైద్రాబాదుకు వ్రాసి పొందవచ్చును.

అకాలీ నిర్బంధితుల సంఖ్య పెరుగుదల

చండీగఢ్, ఆగస్టు 29

గతజూన్ 8న పంజాబ్ రాష్ట్రంలో 196 నుండిని అరెస్టుచేయడంతో అకాలీల నిర్బంధితుల సంఖ్య యిప్పటికి 250 కి పెరిగిందని అధికార రీత్యా తెలుస్తున్నది.

శ్రీ కరంజియాకు లోకసభ మందలింపు

భారత పార్లమెంటు చరిత్రలో తొలి సంఘటన: కమ్యూనిస్టు సభ్యుల గైరుహాజరు

న్యూఢిల్లీ, ఆగస్టు 29

భారత పార్లమెంటు చరిత్రలో మొట్టమొదటి పర్యాయముగా ఒక పత్రికా సంపాదకుడు- బ్లిట్జు పత్రికా సంపాదకుడు శ్రీ ఆర్. కె. కరంజియా- సభాహక్కులను భంగపరచిన నేరానికి గాను లోకసభకు పిలిపించబడి బోనులోఎక్కించబడి మందలింపును స్వీకరించారు.

శ్రీ కరంజియా బోనెక్కినపిమ్మట లోకసభ స్పీకర్ శ్రీ అనంతశయనమయ్యంగార్ మందలింపు ప్రకటనను చదివారు.

ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు కమ్యూనిస్టుసభ్యులు హాజరుకాలేదు.

శ్రీ కరంజియా నిలువబడినబోను స్పీకర్ వేదికకు ఎదురుగా 60 అడుగుల దూరాన లోకసభా ప్రవేశద్వారంవద్ద ఏర్పాటు చేయబడింది. వాచ్ అండ్ వార్డు సిబ్బంది శ్రీ కరంజియాకు కాపలాఉండి బోను ఎక్కించారు. ఈమందలింపు కార్యక్రమము 5 నిమిషాలుంది.

నేడులోకసభగ్యాలరీలన్నీక్రిక్కిరిసిపోయాయి. స్పీకర్ మందలింపుప్రకటనను చదివినప్పుడుసభ అంతానిశ్శబ్దతను పాటించింది. ఇప్పుడు సభ లోకసభ హైకోర్టుగా వ్యవహరిస్తున్నది కాబట్టి పార్లమెంటు అధికారాన్నాయికీ సర్వసంహాధికారానికీ ఈ తరుణం నిదర్శనము కాబట్టి సభా గౌరవం హుందాతనం ప్రస్ఫుటమవుతూ పూర్తి నిశ్శబ్దం పాటించబడాలని స్పీకర్ ఆదేశించారు

నేటిమధ్యాహ్నం 12-15 కాగానే స్పీకర్ వాచ్ అండ్ వార్డు అధికారి హాజరుగాఉన్నారాఅని ప్రశ్నించారు. ఆ అధికారి తాను సిద్ధంగా ఉన్నానని జవాబివ్వగానే శ్రీ కరంజియా వచ్చారా అన్నారు. వచ్చారని జవాబివ్వబడగానే ఆయన్ని ప్రవేశపెట్టాల్సిందిగా స్పీకర్ ఆదేశించారు.

పిమ్మట శ్రీ కరంజియా సభలో ప్రవేశించి వినయ పూర్వకంగా తలవంచారు. అనంతరం స్పీకర్ మందలింపు ప్రకటన చదివారు.

తన ప్రకటన పఠనం పూర్తి అయిన వెంటనే సభవిడిచి వెళ్ళిపోవాల్సిందిగా స్పీకర్ శ్రీ కరంజియాను ఆదేశించారు. పనముగ్రిడై శ్రీ కరంజియా బోనుదిగి సభవిడిచి వెళ్ళారు.

బెర్లిన్ సమస్యపై రష్యాతో సంప్రతింపులు

ఖాయమేనని డీన్‌రస్క్ ప్రకటన

న్యూయార్క్, ఆగస్టు 29

బెర్లిన్ సమస్యపై రష్యాతో సంప్రతింపులు జరుగుటఖాయమేనని అయితే యెప్పుడు, యెక్కడ, యెట్టి పరిస్థితులలో జంగేది అనుమానముగా ఉందని అమెరికా విదేశాంగ కార్యదర్శి డీన్ రస్క్ నిన్న స్పష్టీకరించారు.

సమితి ప్రధాన కార్యదర్శితో కలిసిన తరువాత రస్క్ ఒకప్రకటనచేస్తూ బెర్లిన్ సమస్య సమితికి నివేదించబడుఅవకాశముందనికూడా తెలియజేశారు సమితికి నివేదించుటకుపూర్వం తూర్పు పశ్చిమ దేశాలు చర్చలు జరుపగలవు.

బెర్లిన్ పరిస్థితి తీవ్రముగా ఉంది. పశ్చిమ రాజ్యాల ప్రయోజనాలను రక్షించాలి. జాగ్రత్తగా ప్రవర్తించకున్న పరిస్థితి యింకా విషమిస్తుంది. వివాదం తీవ్రరూపం దాల్చి ప్రపంచ శాంతికి ప్రమాదకారిగామారిన సమితి పరిశీలించుట అవసరమవుతుంది. కనుక బెర్లిన్ సమస్యపై సంప్రతింపులు జరిపి పరిష్కారం చసుకోవాలని తాను ఆశిస్తున్నట్లు రస్క్ ప్రకటించారు.

యుద్ధమే వస్తే ఉభయ దేశాలూ ధ్వంసమే

కాశ్మీర్ సమస్యపై పాక్ అధ్యక్షుని ప్రసంగం

కరాచీ, ఆగస్టు 29

కాశ్మీర్ వివాదకారణంగా భారత పాకిస్తాన్ దేశాలమధ్య యుద్ధమనేది జరిగితే దానివలన ఉభయ దేశాలూ నాశనమవుతాయన్న అభిప్రాయాన్ని పాక్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ నిన్న వ్యక్తంచేశారు.

పాక్ అధ్యక్షుడు అయూబ్ నిన్న సాయంత్రం లాహోర్‌లో జరిగిన పెద్ద బహిరంగ సభలో ఉపన్యసిస్తూ భారతదేశం, తాను పాకిస్తాన్‌తో స్నేహసంబంధాలను పెంపొందించుకొనుట వలన తనబలాన్ని ఇనుమడింపచేసుకొనుటకు యెక్కువ అవకాశం ఉంటుందన్న విషయాన్ని గుర్తించటం లేదన్నారు.

కాశ్మీర్ సమస్యను పరిష్కరించుటకై తనచే ప్రయత్నాలను పాకిస్తాన్ సడలించే ఉద్దేశంలోలేదని ఆయన పునరుద్ఘాటించారు.

ఇండో-పాక్ స్నేహ సంబంధాలు సక్రమముగా లేకపోవడానికి కాశ్మీర్ సమస్య ఒక కారణమయినదనీ, గత రెండున్నర సంవత్సరాలలో శాంతియుతంగా ఈ అవరోధాన్ని తొలగించుటకు తానుచేసిన ప్రయత్నం విఫలమయినదని దానికంతకూ భారతదేశమే కారణమనీ అయూబ్ ఆరోపించాడు. అనవసరంగా కాశ్మీర్ విషయముల

మూడవ ప్రణాళికలో సమాజాభివృద్ధి

శ్రీ పిడతల రంగారెడ్డి

(ప్రణాళికా సమాచారశాఖల మంత్రి, ఆంధ్రప్రదేశ్)

దేశవ్యాప్తంగా యిప్పుడు సమాజాభివృద్ధి ఉద్యమం 3,70,000 గ్రామాలలో సాగిపోతున్నది. ఈ ఉద్యమం నడవడంల్లో ముఖ్య కేంద్రాలుగా ఉన్న బ్లాకులనేవి యిప్పుడు దేశంలో 3,100 ఉన్నవి. వీటిలో 880 బ్లాకులు ఐదేండ్లకంటె యెక్కువగా పనిజేస్తున్నవి. కాబట్టి ప్రథమ స్థాయి దాటి యీ కార్యక్రమంలో ద్వితీయస్థాయి నందుకున్నవి. ఇంకా రెండేండ్లలో, అంటె 1963 అక్టోబరు నెల వరకల్లా దేశంలోని గ్రామీణ ప్రాంతాలన్నిటికీ యీ ఉద్యమం వ్యాపిస్తుంది. జరిగిపోయిన రెండు పంచవర్ష ప్రణాళికల కాలములో సమాజాభివృద్ధి కోసం 240కోట్ల రూపాయలు ఖర్చయినవి. మూడో ప్రణాళికలలో దీనికి కేటాయింపు రు. 294 కోట్లు. ఇదిగాక పంచాయతీల కోసం ఇంకా రు. 28 కోట్ల ఖర్చు చేయదలచుకున్నారు.

కడచిన రెండవ ప్రణాళికా కాలములో మూడు ముఖ్యమైన మార్పులు జరిగినవి. మొదటిది యీ ఉద్యమము జరిగే పద్ధతిలో మొదట్లో ప్రతి బ్లాకూ జాతీయ విస్తరణ కేంద్రంగా బయలుదేరింది. దానికి కేటాయింపు నాలుగున్నర లక్షల రూపాయలు. ఒకటి రెండేండ్లు గడిచిన తరువాత యీ విస్తరణ కేంద్రాలలో కొన్నింటిని సమాజ వికాస కేంద్రాలుగా మార్చి ఒక్కొక్కదానికి రు. 15లక్షలు కేటాయించేవారు. 1957 లో జరిగిన పరిశీలన ఫలితంగా యీ పద్ధతి మార్చబడింది. అంతా ఒకటే సమాజాభివృద్ధి పద్ధతిమీద రెండు స్థాయిల్లో యేర్పరచి మొదటి ఐదేండ్లకు 12 లక్షల రూపాయలు, రెండో అయిదు యేండ్లకు 5 లక్షల రూపాయలు కేటాయించారు.

రెండో పెద్ద మార్పు పంచాయతీ రాజ్యం. గ్రామ పునరుజ్జీవనమే ప్రధానోద్దేశంగా గల సమాజాభివృద్ధి కార్యక్రమం నిజంగా ఫలవంతము కావాలంటే గ్రామీణ ప్రజలు హృదయపూర్వక సహకారం ఇయ్యటమే కాకుండా బాధ్యతగూడా చాలా వరకు తమ మీదే వేసుకోవలసి వుంటుంది. అందువల్ల గ్రామాలలో పంచాయతీలతోపాటు బ్లాకులలోనూ, జిల్లాలలోనూ కొత్త ప్రజాసంస్థల నేర్పరిచి వారికి పరిపాలనా బాధ్యత ఇయ్యవలెనని చాలా కాలంనుంచి అనుకుంటున్న సంగతే. బలవంతరాయ్ మెహతా సంఘంవారు యీ విషయమై ప్రజాస్వామిక వికేంద్రీకరణ మనే శీర్షికలో ఒక పద్ధతి సూచించారు. జాతీయాభివృద్ధి సంఘంవారు యీ సూచనను 1958 జనవరిలో పరిశీలించి ప్రతి రాష్ట్రం తన పరిస్థితుల కనుగుణంగా యీ విషయమై చర్య తీసుకోవచ్చునని నిర్ణయించారు కిందటి మూడేండ్లల్లో యీ పంచాయతీ రాజ్యస్థాపనకై యేడు రాష్ట్రాలలో శాసనాలేర్పడ్డవి. దీంట్లో ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. మధ్యప్రదేశ్‌లో, ఉత్తర ప్రదేశ్‌లో గూడా శాసనసభల నిర్ణయం పూర్తి అయింది. బీహారులో శాసనం పరిశీలనలో ఉంది. మహారాష్ట్ర, గుజరాత్‌లలో కమిటీ నివేదికలు తయారైనవి. ఈ విధంగా పంచాయతీ రాజ్య విస్తరణ దేశంలో అన్ని గ్రామీణ ప్రాంతాలకు త్వరలోనే వస్తుంది.

మూడవ విశేషం, జిల్లా పథకాలతోపాటు బ్లాకులకూడా ప్రత్యేక పథకాలు తయారు చేసి వాటిని రాష్ట్ర పథకంతో సమన్వయించటం. ఒక బ్లాకు ప్రాంతంలో జరుగవలసిన సాంఘిక, ఆర్థిక కార్యక్రమం బ్లాకు పథకంలో ఇమిడి వుండాలి. బ్లాకు స్థాయిలోను, గ్రామ స్థాయిలోను నిర్ణయించబడే పనులు, బ్లాకులో నడిచే కార్యక్రమాన్ని గూర్చి వివిధ శాఖలవారు వేసుకున్న పథకాల సమన్వయం యీ బ్లాకు పథకము క్రిందికి వస్తుంది. ఈ పథకాలు తయారు చేయటంలోను, వాటి ఆచరణలోను బ్లాకులోని విస్తరణాధికారులు, ప్రజా నాయకులు సహకరించి పని చేయవలసివుంటుంది. కొత్తగా యేర్పడ్డ పంచాయతీ సమితుల ముఖ్య కర్తవ్యం యీ బ్లాకు పథకాలను సక్రమంగా అమలు పెట్టటమే. ఇందుకై విస్తరణ శాఖాధికారులు తమలో తాము కలిసిమెలిసి పనిచేస్తూ అధికార సంస్థలకు కావలసిన సలహాలు, సహాయం అందజేయాలి. ప్రజా నాయకులు కూడా తమ వంతుగా చేయవలసిన పనులు చాలా వున్నవి. తయారైన పథకాలను గూర్చి ప్రజలకు నచ్చజెప్పి వారి సహకారం పూర్తిగా లభించేట్టు చేయటం. గ్రామీణ పంచాయతీలకు సహకార, సంఘాలకు కావలసిన సహాయం చేయటము, గ్రామీణ కార్యకర్తలను తర్ఫీదు చేయటంలో తోడ్పడటం, తమ తమ గ్రామాలలోవున్న కార్మిక బలాన్ని అంతా చేకూర్చటం, ప్రజలలో వెనుకబడివున్నవారికి తగు సహాయము చేయటం వారి వంతు.

సమాజాభివృద్ధి కార్యక్రమంలో అత్యంత ముఖ్యమైనది వ్యవసాయం, పశుపోషణ, సహకారం, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి. మూడవ ప్రణాళికలో వ్యవసాయ, సహకార రంగాలలో కావలసిన ప్రగతికి ప్రథమ స్థానం ఇవ్వబడ్డది. వ్యవసాయ రంగములో ఉత్పత్తి నూటికి 30 వంతులు పెంచవలసివుంది. దీనికై చిన్న నీటి వనరులు, ఎరువుల పంపకం, భూ సంరక్షణ మొదలైన కార్యక్రమం బ్లాకులలో విస్తారంగా కొనసాగించవలసివున్నది. ఈ పరపతి భూమి నుండి ఉత్పత్తికేగాక, ఆ ఉత్పన్నమైన పదార్థాలను వరసగా విక్రయించటానికి గూడా తోడ్పడవలసి వుంది. గ్రామాలలోని ప్రతి కుటుంబాన్ని యీ పరపతి సంఘాలలోకి తీసుకురావలసిన అగత్యంవుంది. ఈ ప్రయత్నంలో సంపూర్ణ విజయం చేకూరాలంటే ప్రజా సాయకులూ, విస్తరణాధికారులూ అన్యోన్య సహకారంతో పాటుపడాలి.

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 445 బ్లాకులు యేర్పాటు చేయవలెనని నిర్ణయం జరిగింది. వీటిలో ద్వితీయ ప్రణాళికాంతాన్ని 253 బ్లాకులలో పని జరుగుతున్నది. ప్రజా బాహుళ్యంలో ఉన్న ఉత్సాహాన్ని సహకార బుద్ధిని, సంపూర్ణంగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో 1959 నవంబరు మొదటి తేదీ నుండి పంచాయతీ సమితుల స్థాపన శీఘ్రంగా జరుగుతున్నది. గిరిజన ప్రాంతాలలో తప్ప తక్కిన ప్రథమ, ద్వితీయ స్థాయిలలోని బ్లాకుల కన్నిటికీ యీ పంచాయతీ సమితులేర్పరచున్నవి. అన్ని జిల్లాలలోను జిల్లా పరిషత్తులు పనిచేస్తున్నవి. కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన కార్య ప్రణాళిక ప్రకారం 1963 అక్టోబరు నాటికి సమాజాభివృద్ధి బ్లాకులు మన రాష్ట్రమంతటా ఏర్పడవలసివున్నది. మూడవ ప్రణాళికా కాలంలో ప్రారంభమయ్యే బ్లాకులు 162. రు. 25.50 కోట్లు యీ ఉద్యమానికి మూడవ ప్రణాళికలో కేటాయించబడ్డది. ఇందులో యీ సంవత్సరము, అంటే 1961-62 లో రు. 447.43 లక్షలు ఖర్చు కావలసి ఉన్నది. ఈ సంవత్సరం ప్రారంభింపబడే బ్లాకుల సంఖ్య 46.

సమాజాభివృద్ధి ఒక్క ఆర్థిక బలం సమకూర్చటంతోనే అయిపోదు. అనేక రూపాలలో ఆ అభివృద్ధి జరగవలసివుంది. కాని యిప్పటి మన గ్రామాల పరిస్థితినిబట్టి గ్రామ ప్రజల పేదరికం చూస్తే, అన్నిటికంటె ముందు వారి ఆర్థిక స్తోమత పెంపొందించడంమీద సర్వ శక్తులూ కేంద్రీకరించవలెనని తోస్తుంది. వారికి సరైన జీవన స్థాయి కుదర్చటం ప్రభుత్వ కర్తవ్యం. కాని అది ముఖ్యంగా వారి ప్రయత్నంమీదే రావలసిన ఫలితం. వారి సమస్యలేవో విడదీసి చెప్పి, వాటిని యెదుర్కొని జయించే మార్గాలు చూపించటమే నిపుణులూ, నాయకులూ అయినవారి పని.

అయిదు మాసాల్లో 10,000 గృహాలు

బుఖారెస్టు, ఆగస్టు 29

ఈ ఏడాది తొలి అయిదు మాసాలలో చాలా రుమేనియన్ నగరాల్లో నిర్మించబడుతున్న గృహసముదాయాలలో శ్రామిక ప్రజలకు 10200వాటాలు యివ్వబడ్డాయి. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం 1961లో 1,100,000చదరపు మీటర్ల నివాస స్థలంలో ఇళ్ళు నిర్మించబడతాయి. ఇక్కడ 37,000 గృహాలు (ఫ్లాట్సు) నిర్మించబడతాయి. ఇవి 1960లో జరిగిన గృహ నిర్మాణంకంటె 20 శాతం ఎక్కువ.

గోలకొండ గ్రంథాలయము

ప్రహ్లాదుడు:

రచయిత శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, ప్రకాశకులు శ్రీ గోదా గ్రంథమాల. ఇది బాలసాహితి చతుర్థ రత్నము. పేజీలు 21, వెల: 40 నయా పైసలు. ప్రాప్తిస్థానము: కొండూరి లక్ష్మీనరసమ్మ (వ్యవస్థాపకురాలు) గోదా గ్రంథమాల శ్రీమన్నారాయణపురము, ఉల్లిపాలెము పోస్టు దివి తాలూకా కృష్ణాజిల్లా.

రచయిత శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య జగమెరిగిన బ్రాహ్మణుడు అనగా జాతీయోద్యమ వీరుడుగా పేరెన్నికగన్నవారు.

మన సాహిత్యములో బాల విభాగమునకు చెందిన గ్రంథములు బహు స్వల్పము. ఆ శాఖను పరిపుష్టముచేయవలసిన ఆవశ్యకత యెంతైనా కలదు. మనకు ప్రకృతమైన ప్రహ్లాదుడు అను ఈ చిన్ని పొత్తము నేటి నాస్తిక వాతావరణములో బాలురకు అవశ్య పఠనీయము. కథాకథన వైఖరి సరళముగాను, సుందరముగాను, సుబోధముగాను నడచినది. బాలుర లేత హృదయములకు హత్తుకొనునట్లుగా రచన సాగినది. ప్రతి బాలుడు, బాలికయు తప్పక చదువవలసిన గ్రంథమిది.

భక్తులు ముత్తెరగుల నుందురు. సాధకుడు సిద్ధుడు, అతీతుడు. ఒకరికంటె నొకరు పైమెట్టువారు. జపతపములచే క్లేశముపొంది భగవత్సాక్షాత్కారమునందగలవాడు సాధకుడు. శ్రీ హరికృపకుపాత్రుడై బాల్యమునందే భగవత్సాక్షాత్కారమునందగలవాడు సిద్ధుడు. ప్రహ్లాదుడు ఈ తరగతికి చెందినవాడు. భగవంతుని నిర్హేతుక జాయమాన కటాక్షమునకు గురియైనవాడు అతీతుడు. నారదుడు ఈ తరగతికి చెందినవాడు.

విద్యాశాఖవారు ప్రహ్లాదుడు అను ఈ చిన్ని పొత్తమును ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపవాచకముగా నియమించుట సమంజసముగా నుండగలదు.

మహాత్ముడు:

రచయిత డాక్టర్ శంకర శ్రీ రామారావు. ప్రకాశకులు శ్రీ గోదా గ్రంథమాల. ఇది బాల సాహితి: పంచమ రత్నము. పేజీలు 64 వెల: రూపాయి ప్రతులకు రచయిత పేర ఏలూరుకు వాసి తెప్పించుకొనవచ్చును.

గాంధీ మహాత్మునికథ ప్రాథమిక పాఠశాలా విద్యార్థుల వాచకములలో అనేక విధములుగా ప్రచురితమయ్యే యున్నది. కాని కథా కథనవైఖరి యందేమి, సమయస్ఫూర్తితో వెగటు కలుగకుండునట్లు నీతులు బోధించుటయందేమి, బాలురకు పఠనాసక్తి కలిగించుటయందేమి ఈ గ్రంథమున కిదియే సాటి.

ఇట్టి రత్నములను నేకరించుటయందు శ్రీ గోదా గ్రంథమాల వారి కృషి యెంతేనియు కొనియాడదగినది. విద్యాశాఖవారు ఇట్టిరచనలకు ప్రోత్సాహము ఇవ్వదగును.

ఆకాశవాణి:

"ఆకాశవాణి" రచయిత శ్రీ గుమ్మిడిదల వెంకట సుబ్బారావు వెల రూ. 1-40 ప్రాప్తి స్థానం గోష్ఠిప్రచురణాలయం అమలాపురం.

ఆకాశవాణి యతిప్రాసలకు అతీతంగా కనపడే గీతికల సంపుటి యని రచయితయే పేర్కొన్నారు. పాఠకులకిది చాటువులుగా గోచరించకమానదు. శ్రీ సుబ్బారావు యీ చాటువులలో నాటి రాజకీయ వ్యవహారాలలో తమకువుండే నిశ్చితాభిప్రాయాలను పేర్కొన్నారు. కనుక ఈ కవితను సాహిత్య దృష్టితో పరిశీలించకుండా కేవలం కవి హృదయాన్ని సూక్ష్మంగా గ్రహించుటకు ఒక అద్దంలా ఉపయోగించుట మంచిదని తోస్తున్నది. యిదం బ్రాహ్మణ్యం యిదం క్షాత్రం అనే మాదిరిగా తమ భావ ప్రకటనను విమర్శల పరంపరను గద్య పద్య రీతులలో ఒక మాదిరిగా కలాన్ని నడిపించుటలో కవి సిద్ధహస్తులని ఈపొత్తము పరిశీలించిన పాఠకుల కనుభవైకవేద్యము కాగలదనుటలో సందేహం లేదు. ఆయన రచనలలో ఉపన్యాస ధోరణి ప్రతి వాక్యంలోను జ్యోతకమవుతుందనటంలో అతిశయోక్తి యేమీలేదు.

"ఆకాశవాణి" పేరును ఆపొత్తములోని చాటురూపంలో వున్న గీతాలనుగురించి శ్రీసుబ్బారావుగారే నిర్వచనము చేసివున్నారు. కాబట్టి యీ అంశాలపై వ్యాఖ్య చేయుట మనవ సరమనే చెప్పాలి. యువతరానికి చెందిన రాజకీయవాదు లొకసారి చూడ తగిన పుస్తకమిది. పాతకాలపు ముచ్చట్లు గుర్తుకు రావడానికిది సాయపడుతుంది.

నవభారతం:

"నవభారతం" మొదటిభాగం- (వివిధకళా రూపాలు.)

రచయిత శ్రీ టి. నరసయ్య గుప్త. వెల రూ 2/- లు ప్రతులకు శ్రీ టి. నర్సయ్య రిటైర్డు ఉపాధ్యాయుడు చందుపట్ల పోస్టు, నల్లగొండ జిల్లా.

నవభారతం మొదటి భాగంలో పేర్కొనబడ్డ వివిధ కళా రూపాలలో గేయ కవిత ద్వారా రచయిత తన లేఖనిచే చిందులు త్రొక్కించాడు. పల్లెసీమకు చెందిన పాటకవుజనము పని పాటల సమయాలలో పాడుకొనే పాటల రీతులలో కవిత చెప్పారు. శ్రీ నర్సయ్య గుప్త దీనిలో ప్రస్తావించని అంశము లేదనుటలో అతిశయోక్తి యేమీలేదు. ఈ గ్రంథానికి పరిచయం వ్రాసిన శ్రీ త్రిపురనేని గోపీచంద్ యీకవిని గురించి చెప్పిన అభిప్రాయంతో దీనిని చదివిన ప్రతి పాఠకుడు యేకీభవించక తప్పదు. ప్రతి వారికికూడ తెలికగా ఇందలి పాటలు అర్థమవటమేకాక ఒక అనందాన్ని చేకూరుస్తాయి. ఇంతేకాక తగినంత మోతాదులో హాస్యము, వ్యంగ్యము గోచరిస్తాయి. కంఠస్థం చేయతలచు వారికివి సులభంగా నోటికి వస్తాయి. శ్రీ గుప్తగారు ప్రచార సాహిత్యము కనువైన ఫక్కీలో వాడుక భాషలో యీ గ్రంథమును రూపొందించుట ముదావహము. ప్రణాళికా ప్రచారానికై దేశాభ్యుదయాది కార్యక్రమాలను గురించి, పామరులకు తెలియచెప్పడానికై "నవభారతం" లోని పాటలు ఉపయోగ పడతాయి.

సత్యదృష్టి:

"సత్యదృష్టి" రచయిత శ్రీ ఆలపాటి సూర్యనారాయణ వెల రూ. 1-50 న. పైసలు. ప్రాప్తి స్థానం "దేవసదన్" గోవాడ గుంటూరుజిల్లా.

"సత్యదృష్టి" విమర్శతో కూడిన పరిశోధక రచన. దీనిలో ఆధ్యాత్మిక విషయాలను కేవలం భౌతిక దృష్టితో రచయిత తమ వాదాన్ని సమర్థించుకొన్నాడు. ఆయన దృష్టిలో పాఠకులు దీనిని యెంతవరకు స్వీకరిస్తారన్నప్రశ్న చదివినకొలదీ బలపడుతున్నది. జ్ఞానసంపన్నులు కనపడేది మిథ్య అన్న భావంతో వుంటారు కనుక యీ గ్రంథంలో పేర్కొన్న అంశాలను పరిశీలించినమీదట వాటిని ఒకవేళ అంగీకరించినా సంఘంలో గడుపుతున్నంత వరకు వారు కూడ బాహాటంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేరు. సంఘంలో జీవిస్తున్నంత వరకు ఆయా పరిమితులలో దానికిలోబడి స్వతంత్ర వాయువులను పీల్చవలసి వున్నది. రచయిత అభిమతానుసారం యే వ్యక్తి అయినా కట్టుబాట్లను, ఆచారాలను కాదని ఆధ్యాత్మిక విషయాలను లైంగిక వ్యవహారాలుగా పరిగణించిన మీదట అతడు తన నైతిక విలువల నెంతవరకు పరిరక్షించుకో గలడన్న అనుమానం యేర్పడుతుంది. ఇక పామరుల విషయం చెప్పవలసిన పనిలేదు. యీ రచనను తార్కిక దృష్టిగల తత్వవేత్తలకు (జితేంద్రియులకు)లభించేప్రచురణగా రూపొందించుట మవసరం. అందరూ శ్రీ రామకృష్ణ పరమహంస జగద్గురు ఆది శంకరాచార్య కోవకు యీతరంవారు చెంది వుండలేదన్నది భారత దేశము కర్మభూమిఅన్న అంశము మన సాంప్రదాయాలను రచయిత కు తెలియనివి కావు. కనుక ఆయన యీ సూచనను గమనిస్తారని ఆశిస్తాను.

బొంబాయి మూల స్థానమునగా పర్థిల్లిన వాణిజ్య సామ్రాజ్యం

శ్రీ నార్మన్ హిల్సను

ఇటీవల 80 యేండ్ల వయస్సులో మరణించిన ప్రఖ్యాత క్రీడా సమర్థుడు సర్ విక్టర్ శసూన్ ప్రాక్పశ్చిమ దేశాలనతికి సంబంధ బాంధవ్యవ్యాలేర్పరచిన యొక గొప్ప కులానికి అధిపతి ఇతడు శసూన్ ప్రభువుల్లో మూడవవాడు. ఇతనికి వారసులు లేరు. మొదటి ప్రభువునకు వారసులుండబట్టి శసూన్ వంశమొక అంతర్జాతీయ సంస్థగా నిలువగలిగింది.

ప్రాచీన బాగ్దాద్ పాలకుడు నగరంలో అందరికన్న ఉన్నత స్థితిలో ఉన్న యూదుని (జ్యూ) ఆర్థిక విషయాలను పర్యవేక్షణ చేయడానికి నియమించడం ఒక ఆచారం. బాగ్దాద్‌లోని కలీఫా (మహమ్మదీయ మతపరిపాలకు) లకు యూదులోని సలహాదారులపై ఎక్కువ నమ్మకం ఉండెది. ఈ మహా విశ్వాసం వారి తరువాత వారిలోకూడా ఆటొమన్ పరిపాలన వచ్చేంతవరకు ఉండినది.

18 వ శతాబ్ద చివరి భాగంలో బాగ్దాద్ పరిపాలకునికి శసన్ అనే యూదుల యునరాజు ఉండేవాడు. ఈ శసన్‌కి డేవిడ్ ఖాన్ శసన్ అనే కుమారుడుండేవాడు. ఇతనికి పరిహేనో యేటనే అబ్దుల్లాతోసెన్ కూతురైన హన్నాతో పెళ్ళిఅయి యిద్దరు కుమార్తెలు, ఇద్దరు కూతుళ్ళు కలిగారు. మరొక వివాహంతో యితనికి మరి యెనిమిది మంది పిల్లలు పుట్టారు. అప్పటి బాగ్దాద్ పరిపాలకుడు యూదులను హింసింపడం మొదలెట్టేసరికి యువకుడైన డేవిడ్ 80 యేళ్ళ వయస్సులో ఉన్న తన తండ్రితోకూడా నగరం నుండి బ్రతికి బయలుబడి చివరికి తప్పించుకొనివచ్చి బస్రా చేరుకున్నాడు. శసూన్ వంశ చరిత్రలో యిది మొదటి అధ్యాయం.

1829 లో ముసలిశసన్ చనిపోగా, 86 యేండ్ల యువకుడు డేవిడ్ కుటుంబ యాజమాన్యం వహించాడు. అతడు పురోగమనాభిలాషి, ఉత్సాహవంతుడూ, ఆలోచనా శక్తిగల సమర్థుడు. తన వంశాన్ని ఎలాగైనా మళ్ళీ మహోన్నతస్థితికి తీసుకరావాలని స్థిరనిశ్చయు డయ్యాడు. బస్రాలో ఏదో చిన్న వ్యాపారం మొదలెట్టాడు. మూడేళ్ళలోగా పర్షియా సింధు శాఖలో అతి లాభదాయకమైన వ్యాపారాన్ని ఏర్పరచుకొని 1832లో మొదటి మారు బొంబాయి పట్టణానికి చేరుకున్నాడు.

డేవిడ్ ఖాన్ శసన్ త్వరలోనే 200 000 మంది నివాసం చేస్తున్న ఈ భారతదేశపు ప్రముఖపట్టణం వాణిజ్య కేంద్రంగా ఎలాంటి సదవకాశాలను కల్పించగలదో అర్థం చేసుకున్నాడు. టామరిండ్ సందులో ఒకచిన్న యిల్లు పుచ్చుకొని స్థిరనివాసం యేర్పరచుకొని తన యిద్దరు కొడుకులైన అబ్దుల్లా, ఈలియస్ అనే వాళ్ళను వాణిజ్య సహాయకులుగా చేసికొని ఆంగ్లేయ వస్త్రాలను భారతీయ వస్తువులతో మారకంచేస్తూ వ్యాపారం సాగించాడు. వారు మెసొపొటేమియా, ఇరాన్, చైనా దేశాలకు గూడా వెళ్ళారు. 1841 నాటికి దేశబహిష్కృతుడైన డేవిడ్ శసూన్ ప్రభువు అనేపేరు సంపాయించుకొని అరబ్బీ-యూదుల వాణిజ్య సమాజం ముఖ్యంగా బొంబాయిలోని వారిలో ఒక గొప్పవ్యక్తిగా రూపొందారు. 1854 నాటికి అతడొక లక్షాధికారి.

డేవిడ్ శసూన్ చెప్పుకోదగ్గ వ్యక్తి సాంప్రదాయసిద్ధమైన వస్త్రాల్ని ధరించేవాడు. ఆచారం ప్రకారం పొడవాటి తెల్లని గడ్డం ఉండేదతనికి. అతి సనాతన యూదుడుగా ఉండి ఎన్నో పాశ్చాత్య భాషల్ని నేర్చుకున్నా ఆంగ్ల భాషను మాత్రం నేర్చుకోలేదు. వాణిజ్యసంస్థలో తన మతావలంబులకే స్థానం యిచ్చాడు. బొంబాయి ప్రాచ్య దేశాల్లోకంతా అతి ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా గుర్తించాడు.

1830 లోని అమెరికా అంతర్యుద్ధం ఇతనికి వాణిజ్యరంగంలో ఒక సదవకాశాన్ని కల్పించింది. అతనునుక అమెరికా నుండి యింగ్లండులోని లోక్‌పైర్ బట్టలమిల్లుల కెగుమతి యౌతున్న ప్రతి అంతటతో ఆగిపోయింది. ఆంగ్లేయుల కెలాగైనా ఏ ధరకైనా ప్రత్తి కొనే ఆవశ్యకత యేర్పడ్డది. అప్పుడు ప్రత్తిని అందించేందుకు శసూన్ సంస్థ సిద్ధంగా ఉండినది. అదృష్టంకలిసివచ్చి కొన్ని యేండ్లలోనే అతడు పొడ్లు 1,000,000 ల విలువైన ప్రత్తిని అమ్మకం చేశాడు. అతడలాగే తన వాణిజ్య గౌరవాన్ని నిలుపుకో గలిగాడు.

డేవిడ్ 1864 లో 71 యేండ్ల వయస్సులో పూనాలోమరణించాడు. పెద్ద కొడుకు అబ్దుల్లా ఆర్థర్టు అనే పేరుతో శసూన్ వంశాన్ని మరింత గొప్పదానిగా చేశాడు. తండ్రికి అమెరికా అంతర్యుద్ధం ఎలా సహాయపడిందో యితనికి సూయెజు కాల్వ 1869 తో ప్రారంభింపబడడం అలా దోహదమిచ్చింది. ఇంగ్లండు నుండి యంత్రాల్ని దిగుమతి చేసికొని సొంతంగా అతడు కర్మాగారములను నెలకొల్పాడు. బొంబాయిలో పారిశ్రామిక మార్గదర్శకుడుగా ప్రఖ్యాతి చెందాడు. ఆల్బర్టు తండ్రివలె సనాతనుడైన యూదుడైనప్పటికీ యితలోక వాంఛలను వీడలేదు. యితడు భోగలాలసుడు. పూనాలో మహాబలేశ్వర్‌లో మహా ప్రాసాదాలను నిర్మించుకున్నాడు. లండన్ నగర ప్రముఖుల్లో ఒకడుగా అయ్యాడుకూడా.

అసూయవలనైతేయేమి, ఉద్రేకపూరితుడవడంవల్లనైతేనేమి అతని సోదరుడు ఈలియస్ డేవిడ్ విడిపోయి తనంతటతాను ప్రత్యేకంగా వ్యాపారం చేయడం మొదలెట్టాడు. తన కొడుకు డేకబ్‌తో కలిసి అన్నతో పోటీగా బొంబాయిలో కర్మాగారాల్ని నెలకొల్పాడు. ఒకప్పుడతడు 15,000 మంది పనివాళ్ళకు పనికల్పించాడు. కాని యీదులకు మాత్రమే ఎక్కువ ఉద్యోగాలు దొరికేవి. ఇతడు ధనాన్ని దుర్వినియోగం చేసేవాడు. దుబారుగా ఖర్చుపెట్టేవాడు. ఆంగ్ల నాగరికతా వ్యామోహంలోపడ్డాడు. ఇతని కుమారులు రూబెన్ ఆర్థర్ అనేవాడు ఏడవ ఎడ్వర్డుకు సన్నిహితులయ్యారు. కానివారి సనాతన ధర్మాలను వారు వీడలేదు. చివరకు వీరు ఇంగ్లండు దేశంలో స్థిరపడినారు. శాసన సభలో సభ్యుడైన ఫిలిప్ మరణంతో శసూన్ ప్రభువుల మంచిరోజులంతరించాయి.....నెఫెన్...

బల్గేరియన్ కథానిక:

ఉత్తమ విద్యార్థిని

ఎస్. టి. దాస్కలోవ్

యుద్ధంలో భర్తపోయాక విచ్కా సమిష్టి క్షేత్రంలో పందులపట్ల ఎక్కువ శ్రద్ధతీసుకుంటూంది. తన పిల్లలపట్ల కూడా అంత శ్రద్ధతీసుకోలేక పోతూంది. పిల్లలకిది సరదాయే. వాళ్లు గబ గబ నాలుగు మెతుకులు తిని ఆడుకోడానికి పొలంలోకి పరుగెత్తేవారు. వారు మైదానాలలో పరుగెత్తేవారు. నీటి మడుగులలో ఆడేవారు. పిల్లలుంటే యింట్లో పని జరగదు కాబట్టి విచ్కాకు యిదంతా బాగానే వుంది. ఆఖరి పిల్ల మిచ్కా మాత్రం ఎక్కడికీ వెళ్ళేదికాదు. తల్లితోబాటే వుండేది.

"అమ్మా, మా మాస్టరుగారు యివాళ నిన్ను స్కూలుకి రమ్మన్నాడే, మాకు పరీక్షలవుతాయి. నువ్వు రాకపోతే నేను ప్యాసవను" అన్నాది పిల్ల, తల్లి తన కూతుర్ని చూసి నవ్వింది.

"నేనివ్వాడు రాలేననుమా" అంది ఆమె.

తన తల్లి పనిచేసుకుంటూ వుండడం చూసి మిచ్కా అక్కడనుండి వెళ్ళిపోయింది. ఈ ఏడాది తన మాస్టర్లను కలుసుకోడానికి తన తల్లి మాత్రమే రాలేదు. మాస్టర్ల ఆహ్వానాలు పంపినా ఆమె వెళ్ళలేదు. వెళ్తే పందులను చూసేవాళ్ళెవరు? అదీగాక తన కూతురు పేదపిల్ల-అలాంటప్పుడు ఉపాధ్యాయులనూ తల్లితండ్రులనూ కలుసుకోడానికి మొహమాటంగా వుంటుంది. తండ్రిలేని పిల్లలు పేదవాళ్లుకాక ఏమవుతారు?

"తండ్రిలేని పిల్లలు వీధులలోనే వుంటారు" అనుకున్నది ఆమె. అవును మరి తన కూతురు బడినుంచి రాగానే పుస్తకాల సంచీ నేల విసిరేసి తల్లితో పందుల దొడ్డికి వెళ్తుంది. ఎప్పుడూ ఒక గంట పుస్తకం పట్టుకోవడం తాను చూడలేదు. అడ్డ దిడ్డంగా కత్తిరించిన జుత్తు నుదుటిమీద పడుతూ, పాలిపోయిన మొహం, సన్నని కళ్లూ అదీ జపానుదేశపు పిల్లలా వుంటుంది.

పిల్ల ఎంత చెప్పినా వినలేదు విచ్కా. కాని పరీక్షలనాడు స్కూలు వుద్యోగివచ్చి ఆమె స్కూలుకు వస్తానన్నవరకూ వదలలేదు.

"నువ్వు ఎందుకు రానంటావో అర్థంకాదు" అన్నాడతను.

"నన్ను ఇలా వుండనీ, అంతే- నేను పందులను చూసుకోవాలి. నా పని నేను సరిగ్గా చేసుకోవాలి. అన్నట్టు యిప్పుడు వేళెంతయింది?" అంటూ విచ్కా సూర్యునివేపు చూసి "పందులకు తిండిపెట్టే వేళయింది. ఇంకా నీళ్ళు తెచ్చుకోవాలి. పిల్లలకి ఏదేనావండి పెట్టాలిగదా-లేకపోతే మధ్యాహ్నం ఏం తింటారు, మట్టి గడ్డలు తినాలి" అంది.

"ఇవాళ మధ్యాహ్నం! భోజనం మీరు వండుకోనక్కరలేదు. మీ అమ్మాయి చెప్పలేదా?" అంటూ అతను పురపాలక సంఘం ఇవాళ తల్లితండ్రులకూ ఉపాధ్యాయులకూ, పిల్లలకూ భోజనాలేర్పాటు చేసిందని చెప్పేడు.

"ఇవాళ మేము పది పోతులను చంపేము. మంచి విందు జరుగుతుంది, మిచ్కా పరీక్షల రోజు మీకు జ్ఞాపకముండిపోతుంది".

తల్లి పందులకు తిండిపెట్టింది, నీళ్ళు పెట్టింది. నల్లపంది కానుపురోజులు, జాగ్రత్తగా చూడమని కావలవాడికి చెప్పి, తానువెళ్ళి దుస్తులు మార్చుకుంది. ఆమె స్కూలుకు వెళ్ళేసరికి బాగా ఎండ ఎక్కింది. ఆడవాళ్లూ మొగాళ్ళు పిల్లలూ స్కూలు ఆవరణలో కూర్చుని, ఎదురుగావున్న వేదిక వేపు చూస్తున్నారు. విచ్కాను ముందు వరసలోనే కూర్చోబెట్టారు. తన బట్టలు బాగులేకపోవడం, ఆడవాళ్ళంతా తనవేపు చూడడం, యిదంతా తనకు సిగ్గుగావుంది. అంతే కాకుండా తాను యిక్కడికి రావడం యిదే తొలిసారి. తన పెద్ద కుమార్తె లిద్దరూ తాను రాకుండానే పరీక్షలు వ్రాసేయారు. ఇప్పుడు బలవంతం చేయడంవల్ల రాకతప్పలేదు.

చివరికి హెడ్మాస్టరు వేదికమీదికి వచ్చి ఒక చిన్న వుపన్యాసమిచ్చాడు. తరువాత పిల్లలు ఒకరి తరువాత ఒకరు వచ్చారు. కొందరు ధైర్యంగా వున్నారు. కొందరు భయపడిపోయి ఏడుస్తూ పారిపోయారు. ప్రేక్షకులంతా నవ్వుతున్నారు. "మా పిల్ల ఏం చేస్తుందో చూదాం" అంటూ వాళ్ళకోసంనిరీక్షిస్తున్నారు. విచ్కాకు గాభరాగా వుంది. తన మిచ్కాను కూడా వేదికమీదకు తీసుకు వస్తారా ఏమిటి? తన పిల్ల ఒక్కమాటైనా ఆడలేక తికమక పడితే చూసి తాను సిగ్గుతో తలవంచుకోవాలనే తనను యిక్కడికి తీసువచ్చారా ఏమిటి? అలా అనుకుంటూవుంటే హఠాత్తుగా తన కుమార్తె వేదికమీదికి వచ్చింది. ఆమె జుత్తు అదీ అసహ్యంగా వుంది.

"ఇప్పుడేమిటిదారి? ఇక్కడనుండి బయటపడడమెలాగ?" అనుకుంది విచ్కా. తను లేవబోయింది. కాని మిచ్కా తనవేపు చూసి చిరునవ్వు నవ్వింది. ఏం జరుగుతుందో చూదామని కూర్చుందామె.

"ఇది పందులు కాయడానికితప్ప ఎందుకూ పనికిరాదుకదా దీనినెందుకిక్కడికి తీసుకొచ్చాడు. దీనికూడా నాలాగే సిగ్గు" అంటూ నిట్టూర్చింది తల్లి, "ఏం మొదలు పెట్టవేం" అని కేకవేదామనుకుంది.

తల పైకెత్తి కూతురువేపు చూసి "ప్రారంభించు" అనట్టుగా సౌంజ్ఞ చేసింది తల్లి. మిచ్

శ్రీనాథ భారతము

శివరాత్రి మాహాత్మ్యము (4)

శివరాత్రి వ్రత విధానము - వ్రత మాహాత్మ్యములవలన
సుకుమారుడు కైలాసమున కేగుట

ఈ గ్రంథమున శ్రీనాథుడు శివరాత్రి వ్రతవిధానమును మాహేశ్వరునిచే బ్రహ్మాదులకు చెప్పించెను. శివరాత్రి పుణ్యదినమున జనులు బ్రాహ్మీముహూర్తమున మేలుకొని కాలకృత్యములు దీర్చుకొని గురునకు అభివాదము చేసి పూజోపకరణ ద్రవ్యములు సమకూర్చుకొనవలయునని తెలిపెను. అటు పిమ్మట నదీ స్నానమాచరించి, సంధ్యావందనము గావించి, అలంకృతుడయి గృహమునందలి దేవతల నర్చించి, ముఖమున విభూతి నద్దిగి కంఠమున రుద్రాక్షమాల ధరించి దేవాలయ ప్రవేశము చేయవలయును. శివభక్తుల రావించి, గురువు చెప్పిన క్రమవిధానమున ఆసనమిచ్చి అర్ఘ్య పాద్యాదుల మధువర్కములనిచ్చి పంచవదనములు, పంచామృతములతో నభిషేకించి, వస్త్రము మొదలగునవి యిచ్చి స్తోత్రము గావించి, గంధపుష్ప నైవేద్య నీరాజనములు గావించి, ధూపము మొదలగు షోడశోపచారములను మాహేశ్వరునకు గావించి నాలుగు జాములు జాగరము చేయవలయునని శివరాత్రి వ్రతవిధానమును శ్రీనాథుడు వ్రాసెను.

శివరాత్రి పుణ్యకాలమున జాగరణము చేయుటవలన యీ ప్రబంధ వాయకుడగు సుకుమారుడు తన దుర్వృత్తిని మానెనని గలదు. శివరాత్రి వ్రత విధానమును తిలకించిన యతడు-

"అర్ధరాత్రంబు దాఁక నయ్యధమ వృత్తి
శివునిశా వైభవంబు వీక్షించి చనియెఁ
దానకమునకు నదియాదిగా నతండు
విడిచెఁ దొల్లిటి నీచపు వృత్తి బుద్ధి."

కొంతకాలమున కాతడు మరణించి అలవోకగా శివరాత్రి పూజా విధానమును తిలకించిన కారణమునను, జాగరణము చేయుట వలనను, పతితుడైనను, కైలాసమున కేగెనని "దౌదవ్వుల గాంచె గైలాస"మని "తరుణేందు (కళా)ధరుని నివాసమ"ని "దశ హరిస్థాన స్థపుటిత ధవళచ్ఛాయాచ్ఛేద విలాస"మును "కాంచన నవరత్న కందరము"లను కల్పవాటికా సహస్రంబులను, "ప్రబల చింతామణి స్పర్శవేదులను, చివరకు తనివిదీర ఆర్ధేందుమౌళి" శివునిగాంచి ముక్తుడైనట్లును తెలియుచున్నది-

టి. విజయలక్ష్మి

"బ్రహ్మ హత్యాయుతము సురాపానశతము
వీరహత్య గోహత్యలు వేనవేలు
శిశువధంబులు జంగమ (శ్రీవినాశ)
మాదియగు పాపములఁ దోలు నభవురాత్రి."

ఇట్లు శివరాత్రి వ్రత విధానమువలన జనులు సకలపాప విముక్తులయి మోక్షము బొందుదురని తెలియుచున్నది.

శ్రీనాథుడు తాను రచింపదలచిన ప్రబంధమున నే విషయమును గూర్చి వ్రాయదలపెట్టెనో యా విషయమును సూచన చేయును. తాను వ్రాసిన గ్రంథమున రసమేదియనును ప్రధానఫలము శాస్త్రసమ్మతము, ధర్మప్రతిపాదనమును గలిగియుండును. అస్పష్టదశ వర్ణనాత్మకమై, ఈగ్రంథము ఆశ్చర్యకరమై యుండునని పలికెను. ఆట్లే పట్టణ వర్ణనములో ప్రారంభించి సుకుమార చరిత్రమున సకల వర్ణనములు సమకూరునట్లు వర్ణించెను. ఈ కథా విధానము "సకల పౌరహితమై, సర్వలక్షణ సమన్వితమై, సకలాగమ రహస్య వేది సంస్తుతమై, ఉత్తమోత్తమ ధర్మోత్కృష్టమై, పరమేశ్వర ప్రీతిపాత్రమై పార్వతీమనోహరమై విష్ణుసంవేదితమై" శోభిల్లునెను. కవి ఈ గ్రంథమున తన శృంగార ప్రియత్వమును వ్యక్తముచేయుటకుగాక, పరమేశ్వరుని మాహాత్మ్యమును వర్ణించుటకే సుకుమారుని పతితునిగా వర్ణించెనని తెలియుచున్నది. శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడు. ఇతడు తన గ్రంథములన్నిట సత్యమునే బలికెను. "ఇష్టుణ్య చారిత్రంబును బోలినట్టి ధర్మ క్షేత్రంబును, మహాతీర్థంబునైన గంగా యమునా సంగమంబని"దెలుపుటలో వింతలేదని పండితుల యభిప్రాయము.

సుకుమారుడు - చండాలకన్య వర్ణన, పాత్రపోషణ

ఈ శివరాత్రి మాహాత్మ్య ప్రతిపాదనమునకు కవి సుకుమారుని చరిత్రమును వ్రాసెను. కవి సుకుమారుని పతితునిగా చేయదలచి ఆతనియందు ఉద్రేకమును చిత్రించుటకు ప్రయత్నించినట్లు తెలియుచున్నది. మొదట సుకుమారుడు వేదవిద్యలయందు ఆసక్తి లేని వాడుగా తెలియుచున్నది. సుకుమారుని పౌరదార్యమునకు అతని రూపము ఆగర్భశ్రీమంతత్వము, సాహసము కారణములైనవి. సుకుమారుడు ఆజానుబాహుడు, ఆకర్ణాంత విశాల నేత్రుడు, సంపెంగ పూవువంటి శరీర కాంతి గలిగి వలరాజువలె నున్నాడని కవి వర్ణించెను. ఇట్టి సుకుమారుని విలక్షణ రూపమునకు ఫలము అవినీతి వర్ణనము, తన్మూలముగా దేశబహిష్కృతి యేర్పడినది. శ్రీనాథుడు సుకుమారుని మూర్తి చిత్రణమూలనే చండాలకన్య సౌందర్యము సయితము దీని కీడుబోవని విధమున రచించెను. చండాలకన్య "ఆయ్యగారికి నమస్కారంబని అధర కిసలయంబునకు దశనరత్నాంకుర జ్యోత్స్న కుసుమ స్తబకంబుగా కోలాహల కరంభిత పంచమరాగ ప్రపంచంబునకు మించుజాపు కంఠస్వరంబున" బలికెనట. ఈమె క్షీరాబ్ధి మధ్యనుండి యావిర్భవించిన ఆదిలక్ష్మియో యనునట్లు భూదేవుని క్షేత్రములకు మహోత్సవ రూపమై కనుపట్టినదట. పసిండి డాలు కనుపట్టంగ పసుపుపూసుకొనుట, లక్ష్మీ సముద్భవమునకు సాధనమై ఔచితి వహించినది. ఈమెచేయు సంభాషణము లందెలేడల కుత్తమ ప్రకృతి కాంతకుండు వినయ వివేకాది సద్భావములనుకూర్చి, యీమె జాతిచే నంత్యయైనను శీలముచే నగజాతికి చెందనట్లు కవి వర్ణించెను. శృంగార రస నిర్వహణమున భక్తి వినయములను ప్రదర్శించుచుండు శ్రీనాథుడు పాటించెడి సంయమనము యిందు ప్రతిఫలించినది.

తృ 55 "కమలినీ పత్ర పుటములఁ కాసారోదకముఁ
దెచ్చి పాదపద్మములు గడుగఁ
జిలుక మూటని ఫలంబులు గోసికొనివచ్చి
పరికించి యారగింపఁగఁ బెట్ట
గాంతార కర్పూర కదళికా దళముల
సరసరీతులను వీజన మొనర్ప
నగ్ర్య శేషము వోవ హస్తద్వయంబున
నూరు కాండములొత్తి యుపచరింప
వేడ్క యుయ్యెలు విప్ర కుంబు విస్తరిల్ల
భక్షణోద్యమఁగఁ బ్రమోదంబు పారమేసు
నీరు పిపాసాయుతుని నీ తనువులంగుఁ
దన్ను గుర్తాతి యని నన్నుఁ బ్రేమ దేఁగాని."

శ్రీనాథుడు సంస్కృతి పదముల కూర్పులో కాక తెలుగు నుడికారపు నడకలో సమతేము నాటి సౌష్ఠవమును గోచరింపజేయును. శ్రీనాథుని దృష్టిలో సహగమనము చేయుట యుత్తమ సతీలక్షణము. ఇట్టి లక్షణమును అల్పు ఛాదనములను నీ చండాల కన్యచే బలికించి యామె శీలము అత్యుదాత్తముగా చిత్రించెను. ఈమె అంత్యజాతికి చెందినను, ఉత్తమ నాయికగా నిట చిత్రితమైనది. ఇట నాయికను సుకుమారునిచే సమ్మతింపజేయుటకు యాసరోవర సన్నిహితమైన రమణీయ వస్తుజాతమునే సాక్షులుగాజేసి పల్కినట్లుగల పద్యము నిరుపమానము. సరోవర సంపదయైన వెలయు జలపక్షి విరావము, లతామండప నట ద్భంభరములకల మధుర గానము నిచట జతగూర్చి సరోవరమును, లతామండపమును, సాక్షులుగా నొనర్చుటలోని ఔచిత్యము అనిర్వచనీయము. శశికాంతమణి శిలాస్థలమును, వనస్థలిని సాక్షులుగా జేయుటలో నేతల రమణీయ సామగ్రిని గూర్చెను. ఈ పద్యమునగల శ్రీనాథుని భావనా నైపుణి చదువరులకు ఆశ్చర్యము గొల్పును. ఈ భావములుగల పద్యములు చదివినంతనే మాధుర్యానుభూతిచే స్పందించని సహృదయ హృదయముండబోదని పండితుల విమర్శ. ఈవిధముగా చిత్రించిన ప్రకృతి రామణీయక మహాహితము. శృంగార రసపోషణమునకై కూర్చిన పద్యము లలిత మధుర పద సంయోజనము గావించిన శ్రీనాథుని ప్రతిభ యద్వితీయమైనది. శ్రీనాథుని కవితాపాటవమున కివర్ణనము తార్కాణము.

హేమంత-శిశిర-వసంత ఋతువుల వర్ణన

శ్రీనాథుని కవితా శిల్పమున నొక ప్రత్యేకత గలదు. అతడేవస్తువును వర్ణించినను, తన్మూర్తిని పాఠకులకు భావనచే సాక్షాత్కరింపజేయును. ఇట్టి మూర్తి సాక్షాత్కారముచేసి వర్ణించిన ఘట్టములు శివరాత్రి మాహాత్మ్యమున పెక్కుగలవు. శ్రీ మహావిష్ణువు క్రోడావతారమెత్తి భూమిని ఉద్ధరించినట్లు వర్ణించిన ఘట్టము పేర్కొనదగినది. కవి యిందు పాటించిన కల్పనా చమత్కారము హృద్యమైనది. కవి యిందు అష్టాదశ వర్ణనముల సమన్వితము చేసెదనని ప్రతిజ్ఞ చేసెను. ఆ వర్ణనములలో శివరాత్రి మాహాత్మ్య ప్రతిపాదనమున కుపష్టంభకముగ హేమంత, శిశిర, వసంత ఋతువులను కడుమనోహరముగ చిత్రించెను. ఇందు ఏ భావమును చిత్రించినను ఔచిత్య భంగము లేకుండ రచన సాగించెను. మధుర ఉదాత్తములైన భావముల సమ్మేళనము ఈ ప్రబంధమున గోచరించును. పూర్వకవుల కావ్యవర్గములకు సంస్కృత కవుల కావ్య ప్రకృతి వర్ణనములే మూలములైనవి. కావునే ఆ కావ్యములలోని కల్పనా పాటవము, అలంకార పరిపుష్టితో పాటు కవుల యూహకందిన ప్రకృతి దృశ్యములు ప్రబంధ ముఖమున సాక్షాత్కార మొందుచువచ్చినవి. శ్రీనాథుని రచనలో మాత్రము కవితాస్రవంతి సంస్కృత ఛాయలో జాలువారినను, తెలుగు దనము తరిగిపోక, స్వాభావికత సడలిపోక తెలుగు దేశమున కనవచ్చు వివిధ దృశ్యములు ఋతు వర్ణన మూలమున వెలువడినవి. ఇతర కావ్యములం చేకవియు చేపట్టని హేమంత-శిశిర-ఋతువులను, గైకొని వింతహోయలతో చిత్రించెను. ఈ వర్ణనా విధానమే విలక్షణమైనది.

క॥ "హేమంతము శరదాగమ
సామంతము తుహినకర విసంజ్జిత శబరీ
సీమంతము మదనబల
శ్రీమంతము డాసె భువన సీమంతంబై"

ఇందు చక్కని చలుకుబడితో, హేమంత సమయమును, శరత్సమయమునకు సామంతమును, మదనబల శ్రీమంతమునుజేసి లోకమునందంతట నవతరింపజేసెను. ఇక యిప్పటి ప్రకృతి వైభవ చిత్రణ, సహజ దృశ్య సమన్వితమై వర్ణితమైనది. ఈ కాలమున బలునుతుప్పలుపండియుండుట, యొక ప్రేక్షణీయమయిన దృశ్యము. ఇవి హేమంత ఋతువులోనే పండునని తెలియుచున్నది. ఈ పండ్లు పండినప్పుడు చెట్లయందు ఆకులు నిలువక రాలిపోవును. తుప్పలన్నియు పచ్చని పండ్లతో నిండి చూడముచ్చట గొల్పుచుండును. ఆ సమయమందే పెద్ద పరిచేలు పండబాటి యెర్రని కొనలలోగూడిన గింజలు కలిగియుండును. ఇక నా సమయమందు ఉత్తర దిశనుండి కొండగాలులు వీచును. శ్రీనాథుడు సాధారణముగా నెట్టి వాయువునైనను గంధవాహము చేయదలచి వానిని పోకచెట్ల గుత్తులలోని పరిమళమును గోలిసట్లు చేయును. పోకచెట్ల పూవులలో సౌరభము మిక్కుటము. ప్రేంకణపు దీవల గుత్తులపై తుమ్మెదలు మూగినవట. ఇక రాత్రివేళ పైనుండి రాలెడు మంచు బిందువులు రాత్రి యనెడు ఆడ ఏనుగు పూత్కారము చేయగా రాలిపడెడి నీటి బిందువులట్లుండెనట. ఇందు సహజ విషయముతో బాటు ఉత్ప్రేక్షా సమన్వయమును గూడినది. శ్రీనాథునకు వరియన్నము, పరిచేలు అన్నప్రీతి మెండు. ఇప్పుడు పండిన పరిచేల పొరనొక వింత యొయ్యారముతో తీర్చిదిద్దెను. నీటి పొరుదలగల పరిచేల ప్రదేశములలో భూమి చలిచే గగుర్పాటునందె నోమాంచిత దేహమైనట్లుండెనట. కల్పనా చమత్కారము, కావ్యాంగములలో నొకటి. శ్రీనాథుడు దానిని పోషించుటలో సిద్ధహస్తుడయ్యెను.

క॥ "కలవింక కల కలాపుల
వలభీగర్భములు సౌధవాటములు పురం
బుల యందుఁ దుహినవేళలఁ
జలి గుల గుల ఁగూయునట్టి చందంబొందెన్"

పట్టణపు మేడలమీద భాగముల యిండ్ల కప్పులు పిచ్చుకల కలకలారవములతో నిండియుండగా, నవిచలిచే గుల గుల కూయుచున్నటులుండెనట. ఇంతేగాక వనదేవత మిక్కుటమైన చలిచే వణుకుచు, దంతవీణ వాయించెనోయనునట్లున్నదట. ఈ హేమంతఋతు సమయమున కొండగాలి ఆలకాపురమున మొదలుపెట్టి, రాధాపురమువరకు నడమగల పర్వదేశములందు వింతలు గాన్పింపజేయుచు, ఆడవులమీదుగా కళింగాంధ్ర దేశముల సరణిబట్టుచు సపాదలక్ష శైలములను చలుకరించుచు వచ్చుట కవి చిత్రముగ చిత్రించెను. ఈ వాయు ప్రసారమందుగొన్ని వింత విట చేష్టితములను కల్పింపజేసెను. సపాదలక్షశైల ప్రదేశములతో బంధుత్వము నెరపింపజేసెను. చిరుగుటాకులతో కుసుమ రజములతో, జలతరంగ క్రీడలతో అంతః పురాంతః ప్రదేశములతో సంపెంగ వనములతో సంబంధమును గల్పించి శ్రీ శబ్దం సంయోజనమున వింతవిట చేష్టితముల కల్పింపజేసెను. హేమంత ఋతు వర్ణనము గావున చలిప్రవేశ నిర్గమములను దెలిపెను.

గీ॥ "చలి ప్రవేశించు నాగుల చవితినాడు
మెఱయు పేసవి రథ సప్తమీ దినమున
నచ్చసీతు ప్రవేశించఁ బెచ్చుపెరిఁగి
మార్గశిర పౌష మాసాల మధ్యవేళ"

శరదృతువులో చైత్ర యాత్రకు దరలిన రథములు యీ ఋతువున మరలునని జనశ్రుతి. ఇట్లు తెలుగు పరిపాటుల నిందు నూహించెను. కవి హేమంతము పిమ్మట శిశిర ఋతువునకు ప్రస్తావన గావించి మకర సంక్రాంతి పుణ్యకాల ప్రసంగమును గొనితెచ్చెను. మహా శివరాత్రి పర్వసమన్వితము గావున పుణ్య క్రియలతో ఆరంభించి, యీ ఋతు వైభవమును పుణ్యతరము గావించెను.

గీ॥ "కాశాంశోజ్జ్వల పుష్కరిణి రుష్కర శుష్క
గహనావళీ దావ దహనజిహ్వా
గుప్తేశ్వర వరసుండి పీఠపురీయం
హస్తమస్కాండ చండాంశుదీప్తి
దక్షవాటంబు సప్త క్షిగోదావరి
కలిదోష పాషాణ కులిశధార
గౌతమీతటిని మార్కండేయు పురిమోల
దురితాహి సంఘాత గరుడమూర్తి"

నిన్నిటను దీర్థమాడంగ నేగుదెంతు
రఖిలమునులుఁ బ్రభాత సంధ్యాగమముల
గ్రహగణేశుండు కోదండ రాశిఁబాసి
మకరమునకేగు టేరంగ మాఘవేళ"

ఇది శ్రీనాథుని ఆంధ్ర తీర్థక్షేత్రాభిమానమును వ్యక్తము చేయుచున్నది. కాశిలో చక్ర పుష్కరిణియందు, పీఠికాపురమున కుక్కుటేశ్వర కుండమునందు, ద్రాక్షారామమునందలి సప్త గోదావరి తీరమున, రాజమహేంద్రవరమున మార్కండేయ శంకరునెడుట, గౌతమీనదియందును, తీర్థమాడుటకై అఖిలమునులు వచ్చెదరట. ఈ ఋతుద్వయ వైభవమును ఇంత యుదాత్తముగా, సుకుమారముగ చిత్రించిన విధానము తదితర కావ్యములలో అంతగా కానరాదని యూహింపవచ్చును. శ్రీనాథుని సృష్టి సౌందర్యా విష్కరణమున యీతని దృష్టి యెంత నిశితముగ ప్రసరించునో యీ వర్ణనములు తెలుపుచున్నవి.

కవి వసంత ఋతువును వర్ణించుచు, ఆరామభూమిలో కామినీ గండూష మద్యముచే వకుళ వృక్షమును వికసింపజేసెను. వసంతోదయమైనంతనే గోయిల చిరుగుటాకు రుచిమాచి, చలిచూల యెలుగెత్తుటలో పంచమ స్వరము మధురముగా వినిపించుచున్నదట. గోరంట పువ్వుల పరిమళము అతి విస్తృతము. పండిన మామిడిపండ్ల రసమును మెసవినంతనే చిలుకలు చదువ మొదలుపెట్టినవట. మధుర చూతఫల రసాస్వాదనముచేసిన చిలుకలచే జదివించుట యనునది యొక సుకుమారతరమైన ప్రయోగముగా దెలియుచున్నది. ఇట్లే ఋతు వర్ణనమున ఔచిత్య భంగములేక లలిత మధుర సుకుమార భావ సంయోజనమే యెల్లెడల జాలువారుచున్నది.

శ్రీనాథుని భక్తి భావము

ఈ ప్రబంధమున హర్యజు లురులింగ రూపమున ఆ విర్భవించి శివుని స్తుతించు ఘట్టము, శివరాత్రివ్రత విధానము, శివునినోట వివరించు పద సంయోగము శ్రీనాథుని శివభక్తి భావమును వెల్లడించుచున్నది. శివరాత్రి వ్రత విధానము శివునినోటనిట వివరించుట, శివగంగాతీరమున, శివరాత్రినాడు విప్రులచే నా వ్రతము కావింపజేయుటలో శ్రీనాథున కావ్రతము పట్లగల శ్రద్ధాసక్తులు విదితమగుచున్నవి. వింధ్యారణ్యమున నర్మదా దీతీరమున పటవృక్షము క్రిందగల ఓంకార శంకరుని చిత్రించినతీరు పరమేశ్వరుని యందేగాక, పరమేశ్వరియందును దేశీయులకుగల భక్తి, భావమును గోచరింపజేసెను. చండాలాంగనచే పతితుడైనను సుకుమారునిచే భద్రకాళికి మొక్కింపజేసెను. పతితునిచే చేయించిన పూజయందు సంతసము నిష్ఠగాన్పింపజేసెను. ఇందు శ్రీనాథుని భక్తి భావము మిక్కుటమై ప్రతిఫలించినది. అతని హృదయము పరమేశ్వరమూర్తి పూజా దర్శనమువలన పులకించినట్లు సుకుమారుని భక్తిభావమున గోచరింపజేసెను.

ఆచార వ్యవహారములు

ఈ ప్రబంధము పెక్కు విషయములకు మార్గదర్శకముగా గోచరించుచున్నది. కవిత్వమునందును, ఈ గ్రంథము మిక్కిలి ప్రాభవము గలిగియున్నది. సుశీల సంతాన ప్రాప్తికై బుణ్యోపవాస వ్రత దానధర్మ దేవతారాధనముల నిందు వర్ణించెను. వీటివలన ఆకాలమున స్త్రీలదైవభక్తి దేవతారాధన ప్రీతి దెలియుచున్నది. శుభసమయముల నాట్యముచేయుట పాటలుపాడుటయందు వేశ్యలు పాల్గొనుచుండినట్లు దెలియుచున్నది. తూర్పు కనుమల కావలనుండెడి కర్ణాటవేశ్యలు యీ శుభసమయములందు పాల్గొని నృత్యము చేయుచు కోకిల స్వరముతో గొంతెత్తి పాడుచుండెడివారని గలదు. సీమంతమునకు మంగళోపకరణములు గూర్చుట, మంగళవేదికి నలుమూలల పూజ్యకుండములు పెట్టుట, నవధాన్యములుంచుట పాళికలందు సర్వౌషధములునింపి నీరు చల్లుట మొదలగు వైదికాచారములతో బాటు, రాజోపచారములను వర్ణించెను. పుట్టినింటివారు తగవులిచ్చుట ఆనాటి తెలుగునాట పరిపాటిగా దెలియుచున్నది. ఉప్పు, వేపచిగుళ్లతో గూర్చి దిగదుడుపు దీయుట మొదలగునవి తెలుగుజాతను పాటింపబడెడి పరిపాటులుగా దెలియుచున్నది. శివరాత్రి మాహాత్మ్య ప్రతిపాదనకై యీ గ్రంథము రచించెనాన ఆకాలమున బ్రాహ్మణోత్తములు పాటించెడి నియమములను వ్రాసెను. వీరు శివరాత్రి దినమున పుణ్యతీర్థములందు స్నానముచేయుట పితృతర్పణము సెఱపుట, సంధ్యావందనము, సూర్యోపాస్తి దేవతార్చన అభ్యాగతుల పూజించుట మొదలగునవి ఆచరించుచుండినట్లు గలదు. వీరికి శివరాత్రినాడు జాగరముచేయుట పరిపాటిగా దెలియుచున్నది. నేటికిని శివరాత్రి నాటి జాగరము మహా పుణ్యప్రదమని భారతీయులలో దృఢముగ నాటుకొనియున్న భావము. ఈ విధముగ ఆంధ్ర దేశమందు పాటింపబడు పరిపాటులు, ఆచారవ్యవహారములు ఈ ప్రబంధమునందు వర్ణితములైనవి.

రస నిర్వహణము

ఈ గ్రంథము శివరాత్రి మాహాత్మ్య ప్రతిపాదక ప్రబంధమగుటచే శాంతరసము ప్రధానముగా గలది. ఇది వీర శృంగారాది రసభావ పరిపుష్టమై అద్భుత పద్యవసాయిగా నిర్వహింప బడినది. పద్యజులు పరమేశ్వరుని మాయవలన ఆజ్ఞానముతో నెరపిన ధిక్కార సంభాషణము రౌద్రభావమును ఆవిష్కరించు చున్నది. క్రమముగా నిదియే బీభత్సరసభావ సంవర్ధకమై పాశుపతాస్త్ర ప్రయోగములకు దారి దీసినది. బ్రహ్మగాండీవమును యెక్కుపెట్టి శర ప్రయోగము చేయుటతో వీర రసము గోచరించుచున్నది. బ్రహ్మ, విష్ణువులు ముక్తకంఠమున శంకర శరణాగతి పొందుట వలన శాంత రసము గోచరించుచున్నది. సుశీల సంతానము లేక విచారించుటలో నిర్వేదము గోచరించినది. సుకుమార జననము మొదలుగా శృంగారము పరిపోషక వస్తు సమన్వితమై చండాలాంగనచే పరాకాష్ఠమునంది సుకుమారుడు పతితుడగుటకు కారణమైనది. పతితుడైన సుకుమారుడు అలవోకగా నాగేశ్వర పూజా దర్శనము చేయుట యితని నిర్వేదమునకు మూలమైనది. ఇది శాంత రసమునకు పోషకమై సుకుమారుని మోక్ష ప్రాప్తికి సాధనమై అద్భుత రసావిర్భూతికి మూలమైనది. ఇట్లే రస సామగ్రి యంతయు సముచిత వస్తువులతో ఔచిత్యముతో కొనసాగినది. ఈ గ్రంథము శాంత రసప్రధానముగా గల ప్రబంధముగా దెలియుచున్నది.

నీత్యుపదేశము

ఉత్తమ కావ్యమునకు ప్రధాన లక్ష్యము కాంతా సమ్మితముగ నీతిని ఉపదేశించుట. అట్టి ఉపదేశ మీ ప్రబంధమున అత్యుదాత్తముగా కొనసాగినది. ఈ ఉపదేశమునకు కాదంబరి శుకనాసోపదేశము మూలమైనను తెలుగు చలుకు బడులతో మధురముగా సాగెను. మరణ ధర్మముగల మానవులు మరణము లేని దేవతల మనుకొనుట నెట్లితనమని కవి యిందు పేర్కొనెను. సుకుమారుని తండ్రి కుమారునకు బోధించిన ఉపదేశమున నీతి ఉదాత్తమైనది. ఇందెన్నియో ఉదాత్త భావములు గలవు. శివరాత్రి వ్రత మాహాత్మ్యమును చెప్పి యిందు మూలముగ సకల జనులు భక్తి తత్పరులై ఉండునట్లుగా నీతిని ఉపదేశించెను.

కవి యిందు ఉరులింగోద్భవంబును వర్ణించి, నాగేశ్వరాలయమున శివరాత్రి వ్రత విధానమును రచించి, పతితుడైన సుకుమారుడు శివసాన్నిధ్యము బడసినట్లు చిత్రించి ఆద్యంతముల రెండింటిని శివరాత్రి మాహాత్మ్యముతో సంబద్ధము గావించెను. ఈ గ్రంథము శ్రీనాథుని భక్తి తత్పరతను, సత్యధర్మ పరతను, ఆత్మవిశ్వాసమును ప్రకటించుచున్నది.

"బ్రాహ్మీదత్త వరప్రసాదుఁడ పురుప్రజ్ఞా విశేషోదయా
జిహ్మస్వాంతుఁడ, వీశ్వరార్చన కళాశీలుండ, వధ్యర్థిత
బ్రహ్మాండాది మహాపురాణచయ తాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞాన కళానిధానమవు, నీ భాగ్యంబు సామాన్యమే".

(ఇంకా ఉంది)

చిత్రసీమ

పర్వతారోహణ ఆధారంగా చలనచిత్రం

జనసమూహం ఎన్నో రోజులుగా చూచిచూచి వినుగెత్తిపోతున్న ప్రేమ గాథల్నే నిర్మింపబడకుండా భారతీయ చలన చిత్రకారులు క్రొత్త పంథాలో చిత్రనిర్మాణాన్ని సాగిస్తున్నట్లు కనిపిస్తుంది. ఒక యువకుడు నూతన చిత్ర నిర్మాత దర్శకుడు పర్వతారోహణ నాధారంగాచేసి ఆ సాహస దృశ్యాలను ప్రదర్శిస్తూ ప్రపథమంగా చిత్రాన్ని ప్రజలకందజేయబోతున్నారు.

ఆ చిత్రంపేరు "ఎక్ లడ్కీ ఏక్ దివానా" దాని నిర్మాత దర్శకుడు అయిన శ్రీ భప్పిసోని, యీ చిత్రం పర్వతాలెక్కేవారి జీవితాల్లోని గరుకుతనాన్ని, ప్రేమ జీవితాన్ని ఆందలి సౌకుమార్యాన్నీ మిళితంచేసి చూపిస్తుందని అన్నారు. కథ వ్రాసిన వారు శ్రీ ఓంకార్ సాహెబ్ గారు. ఈ చిత్రంలో లలితాపవర్, రాజేంద్రనాథ్, క్రిష్ణధవాన్, రచనా, జేలా బోస్, రాధిక, ముంతాజ్ బేగం, తున్‌తున్, మోహన్ చోటి మొదలైన వారితోపాటు రాజేంద్రకుమార్, మాలాసిన్హా ముఖ్యపాత్రలు వహిస్తారు. దీన్ని రంగుల చిత్రంగా నిర్మించేందుకూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి ఈ చిత్రనిర్మాణంలో లెఫ్టినెంట్ ఎం. ఎస్. కొహ్లీ సహకరిస్తారు.

ప్రకృతితో ఏకీభవించిపోవాలనే అభ్యాసానికి, నాగరిక జీవితంలో అభిరుచి కలిగిన అమ్మాయిమధ్య జరిగే కథకు పాటలుహస్‌రత్ జైపురి మరియు శైలేంద్ర వ్రాస్తారు. సంగీతం శంకర్ జైకిషన్ కూరుస్తారు. ఛాయాగ్రహణం తారాదత్ నిర్వహిస్తారు. ఈ చిత్రానికి బొంబాయిలోని రూప్ తారా స్టూడియోస్‌లో గత ఆదివారంనాడు ప్రఖ్యాత చలనచిత్రనటుడు శ్రీ పృథ్వీరాజ్ కపూర్ ప్రారంభోత్సవం చేశారు. (సెఫెన్)

"తాజ్‌మహల్" చిత్రానికి నూతన దర్శకుడు

బొంబాయి, ఆగస్టు 29

కీర్తిశేషులైన నంద్‌లాల్ జస్వంత్ లాల్ స్థానంలో ఎ. ఎ. నడియడ్‌వాలా ఈస్టుమన్ రంగుచిత్రంగా రూపొందిస్తున్న "తాజ్‌మహల్"కు దర్శకత్వం వహించనున్నారు శ్రీ ఎం. సాదిక్ గారు.

శ్రీ సాదిక్ గారు కథ, సంభాషణలన్ని పరిశీలిస్తున్నారు త్వరలోనే సెప్టెంబర్‌లో షూటింగ్ ప్రారంభింపబాలని ఆశిస్తున్నారు.

బీనారాయ్ ముంతాజ్ మహల్‌గా ప్రదీప్‌కుమార్ షాజహాన్‌గా, వీణా నూర్జహాన్‌గా నిర్మాణం అవుతున్న యీ చిత్రానికి కీర్తిశేషులు నంద్‌లాల్ జస్వంత్‌లాల్ షూటింగ్ ఎనిమిది రోజులపాటు జరిపారు. (సెఫెన్)

భారతీయ వార్తాచిత్రం

భారతదేశ 14వ స్వాతంత్ర్య వార్షికోత్సవాల సందర్భంలో ఢిల్లీ, కాశ్మీరు, హైదరాబాదు, మద్రాసు నగరాలలో జరిగిన వేడుకల దృశ్యాలు ఈనెల 25న విడుదల అయిన భారతీయ వార్తా చిత్రంలో పొందుపరచబడ్డాయి. భారత యూనియనులో దాదానగర్ హవేలీల సంలీనం జాతిసమైక్యతగురించి ఢిల్లీలో జరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రుల సమావేశం దృశ్యాలుకూడా చేర్చబడ్డాయి.

విదేశ వార్తావిశేషాలలో ఇంగ్లండు ఆస్ట్రేలియాలమధ్య జరిగిన వాల్డన్ క్రికెట్ టెస్టు పోటీ దృశ్యాలుకూడా వున్నాయి.

"అదృశ్యమవుతున్న జాతి" నీలగిరి తోడాలను గురించిన డాక్యుమెంటరీ

నీలగిరిలో నివసించే తోడాలను గురించిన రెండు రీళ్ళ రంగుల డాక్యుమెంటరీ చిత్రాన్ని ఫిల్మ్ సర్జాఖ యీ వారాంతంలో విడుదల చేస్తోంది.

భారతదేశంలో తొలినివాసమేర్పరుచుకున్న జాతులలో తోడా జాతి ఒకటి. వారి సంఖ్య 600 కంటె తక్కువ.

తోడాల ఆటపాటలూ, వినోదాలూ తమ సాలుసరి వలసలనుగురించి చర్చించేందుకు పర్వత శిఖరాగ్రంపై పెద్దల సమితి సమావేశాలూ, వారి ఆచార క్రియాలూ యివన్నీ యీ చిత్రంలో వివరింపబడ్డాయి.

ప్రీమియర్ కార్ల కంపెనీ

అమెరికా ఋణ సహాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 29

ప్రీమియర్ ఆటోమొబైల్సు కంపెనీకి 72 లక్షలు డాలర్లు (3 కోట్ల 40 లక్షల రూపాయలు) అమెరికన్ అభివృద్ధి పరపతి నిధి ఋణాన్ని ఇచ్చే ఒక ఒడంబడిక మీద అమెరికా రాయబారి జాన్ కెనెత్ గాల్‌బ్రైత్, ప్రీమియర్ ఆటోమొబైల్సు లిమిటెడ్ చైర్మన్ సేఠ్ లాల్‌చంద్ హీరాచంద్ సంతకాలు చేశారు.

ఇక్కడ అమెరికా రాయబారి కార్యాలయంలో జరిగిన ఈసంతకాల ఉత్సవానికి భారత ప్రభుత్వాధికారులు ప్రీమియర్ ఆటోమొబైల్సు కంపెనీ అధికారులు హాజరైనారు.

ఈ సందర్భంలో రాయబారి గాల్‌బ్రైత్ చేసిన క్లుప్త ప్రసంగంలో "నేను రాయబారిగా ఈ దేశం వచ్చిన నాటి నుంచి ప్రయివేటు రంగానికి అప్పిచ్చే ఒడంబడికపై సంతకం చేయటం ఇదే ప్రథమం కాబట్టిఇదినాకుప్రత్యేకంగా సంతోషాన్ని కలిగిస్తుంది" అన్నారు.

"మూడవ పంచవర్ష ప్రణాళికలో రవాణా-ముఖ్యంగా రోడ్డు రవాణా అభివృద్ధి కంటే ప్రాముఖ్యం గల అంశం మరొకటిలేదు. దీని అభివృద్ధికి మీరు ముఖ్యమైన కీలకమైన భూమిక నిర్వహిస్తున్నారని నేను ప్రత్యేకించి చెప్ప పనిలేదు...ప్రీమియర్ ఆటోమొబైల్సు సంస్థ పట్ల మాకు గొప్ప విశ్వాసం ఉన్నది. మంచి బండ్లను తయారు చేయటం, చౌక ధరలకు వాటిని సకాలానికి అందివ్వటం వంటి సత్కార్యాలు నిర్వహించటంలో మీరు నిరంతరం పాటు పడగలరని మా నమ్మకం. ఇదే మీ లక్ష్యమని తెలుసుకోవటం సంతోషదాయకం. మీ కృషి విజయవంతం కావాలని నా ఆకాంక్ష"అన్నారు; శ్రీ గాల్‌బ్రైత్.

సేఠ్ లాల్‌చంద్ హీరాచంద్ మాటాడుతూ "ప్రీమియర్ ఆటోమొబైల్సు చరిత్రలో ఈ ఒప్పందం మరపురాని సంఘటన" అన్నారు, "ప్రజలకు సాంకేతికులకు, కార్మికులకు అవకాశాలు కల్పించటం ద్వారా, దేశ పరిస్థితులను మెరుగు పరచాలన్న లక్ష్యంతో" ఈ సంస్థ స్థాపించబడిందని చెప్పారాయన.

"ప్రాథమిక విజయం సాధించామని చెప్పటానికి ఎంతో సంతోషంగా ఉన్నది. తొలిరెండు ప్రణాళికలలో మా మేము మంచి అభివృద్ధి సాధించాము. భారత ప్రభుత్వం ఆశించి కృషి చేస్తున్న లక్ష్యాలవైపు, నాణిజ్య పారిశ్రామిక రంగాలలోని వారు ప్రభుత్వంతో సహకరించి సాధించగోరుతున్న ఆశయ

వాణిజ్య వ్యాపారాలు

మెసర్స్ కల్వ సూర్యనారాయణ
ఉస్మాన్‌గంజ్ కమిషన్ ఏజంటు
ఫోన్ నెం. 4412

హైదరాబాద్, ఆగస్టు 29
(క్వింటల్ ధరలు)

క్వింటల్ అంటే 100 కిలో గ్రాములు	
పాలకుర్కులు బియ్యం	56-55 61-00
తుల్జులు	61-00 69-00
కె 19 నెంబర్లు	56-00 58-00
దొడ్డు బియ్యం	56-00 57-00
గర్కులు	62-00 68-00
వానకరాంలు	61-00 68-00
బంగారుతీగెలు	66-00 65-50
గొట్టెబియ్యం	52-00 54-00
24 నెంబర్లు	64-00 66-00
ఎస్.కె.కె. బియ్యం	64-00 65-00
కొత్తసాంబర్లు	65-00 72-00
పాతసాంబర్లు	68-00 78-00
కుసుమబియ్యం	61-00 78-00
పచ్చజొన్నలు	82-87 88-87
చట్టిజొన్నలు	88-00 94-87
తెల్లజొన్నలు	94-75 97-00
పసుపు	116-00 120-00
కందులు పెద్దవి	43-00 44-00
కందులు చిన్నవి	85-00 86-00
మినుములు	47-00 51-00
పెసగలు	44-50 47-00
పెసలు	86-00 88-1
పులవలు	94-00 95-00
తెల్లం	28-00 88-50

నేడు 4వ రోజు వేలం

ఉ॥ 10-00 గంటలకు

కీర్తిశేషులైన నవాబ్ సాలార్ జంగ్ బహదూర్‌చే సేకరించబడిన అమూల్యమైన వస్తువులను 1961 ఆగస్టు 30 తేది. బుధవారమున దివాన్‌దేవిడి సిటీ ప్యాలెస్‌నందు వేలం వేయబడును.

జె. మూసా అండ్ సన్స్,
ప్రఖ్యాత ప్రభుత్వ పబ్లిక్ ఆక్షనీర్స్
దివాన్‌దేవిడి, ఫోన్: 5111.

నగర వార్తలు

భజరంగ్ వ్యాయామశాల

భజరంగ్ వ్యాయామశాల కార్యవర్గ సమావేశము శ్రీ ఆర్తాల్ బాలయ్య దుకాణంలో 27న జరిగినది. నూతన ఎన్నికలు జరుపబడినవి. ఈ క్రిందివారిని కార్యవర్గమునకు ఏకగ్రీవముగా ఎన్నుకొన్నారు.

శ్రీ అన్నం రామలింగంగారు అధ్యక్షుడు, శ్రీ నార్ల సోమయ్య గారు ఉపాధ్యక్షులు, శ్రీ నాగంబాబు రావు గారు ప్రధాన కార్యదర్శి, శ్రీ అల్లాడి నాగయ్యగారు కోశాధిపతి మరి 35 మంది సభ్యులు.

మిరపకాయలు	85-00 125-00
చింతపండు	70-00 85-00
వుల్లిగడ్డ	80-00 85-25
యెల్లిగడ్డ	75-00 85-00
తెల్ల నువ్వులు	110-00 120-00
ఆముదాలు	62-00 64-00
ధనియాలు	70-00 75-00
కుసుమలు	49-00 50-00
యిలాతిపల్కు పెద్దది	118-00 120-00
యిలాతికాయ సం॥కి	84-00 88-00
బన్సి గోధుమలు	50-00 58-00
శర్బతి గోధుమలు	48-00 54-00
పత్తిగింజలు	84-00 87-00
కందిపప్పు పెద్దది	57-00 60-00
కందిపప్పు చిన్నది	51-00 54-00
పెసరపప్పు	53-00 55-00
మినుపపప్పు	70-00 79-00
పెసరపప్పు	56-00 57-00
పల్కునూనె 10 కిలో	21-87 21-50
ధకల్ని పిండి	42-00 24-12
అనుములు	41-00 47-00

ఈప్రకారము యీరోజు అయిన ధరలువ్రాయించినాము. గిట్టినవరకులు పంపవచ్చును తెప్పించుకోవచ్చును.

పెండి బంగారు ధరలు

సముద్రాల రాఘులుగారి
చంద్రయ్య సిద్దంబర్ బజారు
ఫోన్ నెం. 4890.

హైద్రాబాదు, ఆగస్టు 29

బంగారము	144-50
అశోక్ చీపులు	144-75
సవరన్	95-00
పెండి 100 తు.	237-00
చిల్లర	2-40

ఏడు కొత్త తపాలా బిళ్ళలు

నడుస్తున్న సంవత్సరంలో జారీ

న్యూఢిల్లీ, ఆగస్టు 29

నడుస్తున్న సంవత్సరంలో మరో 7 ప్రత్యేక తపాలా బిళ్ళలు జారీచేయబడతాయి.

సెప్టెంబరు 1వ తేదీన సుప్రసిద్ధ సంగీత శాస్త్రవేత్త కీర్తిశేషులు పండిట్ విష్ణునారాయణ్ భట్‌ఖండే 101వ జయంత్యుత్సవ సందర్భంగా ఆయన బొమ్మతో ఒక 15 నయాపైసల తపాలాబిళ్ళ జారీ చేయబడుతుంది.

ఆ తర్వాత నవంబరు 14వ తేదీన వార్షిక శిశుదినోత్సవ సందర్భంగా ఒకటి, భారతీయ పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభోత్సవ స్మారకార్థం ఒకటి-రెండుతపాలాబిళ్ళలు, జారీచేయబడతాయి. ఇవి రెండూ కూడా 15 నయాపైసల తపాలా బిళ్లలే. నవంబరు 18వ తేదీన భారత దేశంలో శాస్త్రీయ అటవీపోషణశతాబ్ద్యుత్సవ సందర్భంగా 15 నయాపైసల ప్రత్యేక తపాలాబిళ్ళ ఒకటి జారీచేస్తారు. పురావస్తు శాస్త్ర సర్వేశాఖ శతాబ్ద్యుత్సవ సందర్భంగా డిసెంబరు 14 వ తేదీన 15 నయాపైసలు, 90 నయాపైసల తపాలాబిళ్ళలు రెండు వెలువడతాయి. కీర్తిశేషులు పండిట్ మదన్ మోహన్ మాలవీయ శతజయంత్యుత్సవ సందర్భంగా, డిసెంబరు 25న 15 నయాపైసల తపాలాబిళ్ల జారీచేస్తారు.

కాంగ్రెస్ యువక సమితిచే ఎన్నికల్లో సహాయం

రాజకోట, ఆగస్టు 29

అఖిల భారత కాంగ్రెస్ సంఘం శాఖ యువక కాంగ్రెస్ కొత్తగా 100,000 మంది కాంగ్రెస్ యువకుల్ని సభ్యులుగా చేర్చుకొన నెంచింది వీళ్ళు దేశమంతటా కాంగ్రెస్ తరపున యెన్నికల్లో ప్రచారం చెయ్యాలని వాళ్ల ఉద్దేశ్యం.

(నెహెన్)

శ్రీ పొట్టి శ్రీరాములు మెమోరియల్ పాఠశాల

ప్రస్తుతము ధూల్‌పేటలో నడుచుచున్న పొట్టి శ్రీరాములు స్మారక పాఠశాలలో గత సంవత్సరము 104 మంది విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణులైనారు. ఇప్పుడు 110 మంది విద్యార్థులు గలరు. కాని పాఠశాల మందిరము కూలిపోయిన సందర్భమున గత మాసము నుండి బడి మూయబడినది. తుదకు ప్రధానోపాధ్యాయుడు, కోశాధికారి కార్యదర్శి పాఠశాలను వేరే చోట నియమించుటకు జిల్లా విద్యాశాఖాధికారిని కోరినారు. పర్మిషను రాగానే బాబురకు తగిన స్థలమున పాఠశాలను నియమించుటకు నిశ్చయము చేయబడినది.

మహారాణాప్రతాప్ యువజన సంఘం

శ్రీమహారాణాప్రతాప్ యువజన సంఘము (మహంకాళి దేవాలయము రాంకోట్) ఎన్నికలు 27 వ తేదీ ఆదివారము జరుపబడినవి.

శ్రీ లాల్‌చంద్ జైను అధ్యక్షులుగా, శ్రీ యం. దశరథ్ ఉపాధ్యక్షులుగా, శ్రీ పి. నరసింహ గౌరవ కార్యదర్శిగా, శ్రీ కె.యస్. నిత్యానందరావు సహాయ కార్యదర్శిగా, శ్రీ పి. సత్యనారాయణరావు గ్రంథాలయ కార్యదర్శిగా, శ్రీ యం. యాదగిరిగౌడ్ కోశాధిపతిగా ఎన్నికైనారు.

గాంధీనగర్ యువజనుల సమావేశం

గాంధి నగర్ యువజన సంఘసర్వ సభ్య సమావేశం శ్రీ కృపారావు అధ్యక్షతన ఈ మాసం 27న జరిగింది. గాంధీనగర్‌లో వెనుకబడినతనంచాలా యున్నదని, దానినిర్మూలనకు యత్నం జరుగాలని శ్రీ కృపారావ్ కోరారు. కార్పొరేటర్ శ్రీ నరసింహాచారి కూడ ఈ సందర్భమున ప్రసంగించారు.

మాధ్యమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీ

హైదరీ సర్క్యులేటింగ్ గ్రంథాలయాధ్వర్యమున దాదాభాయి నౌరోజీ స్మారక వక్తృత్వ పోటీలు సెప్టెంబర్ 2న నిర్వహింపబడును. పోటీలో మాధ్యమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనుటకు అర్హులు. విజేతలకు సెప్టెంబర్ 4న బహుమతులందజేయబడతాయి.

ప్రాగాటూల్సు కార్మికుల తీర్మానం

ప్రాగాటూల్స్ కార్మికులసర్వసభ్య సమావేశం శ్రీ ఎన్. సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన ఆగస్టు 27న సమావేశమైంది. సంఘ నిర్వహణ కార్యదర్శి శ్రీ ఎస్.ఎమ్. పట్నాయక్, తదితరులను ఉద్యోగం నుండి తొలగించినందుకు తీవ్రనిరసన తెలుపుతూ యీ సమావేశంలో తీర్మానించబడింది. తొలగించబడిన వారందరినీ తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని తీర్మానంలో కోరబడింది.

ఫీలుఖానాలో సంగీత విద్యాలయం

శాసనమండలి అధ్యక్షులు శ్రీ కూడపాటి హనుమంతరావు ప్రారంభోత్సవం

(మా. వి)

హైదరాబాదు, ఆగస్టు 29

నాదబ్రహ్మోపాసనకు ప్రాతిపదిక పాద్యమైన తాంబూరాకృతి మీటడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి అధ్యక్షులు శ్రీ కూడపాటి హనుమంతరావు నిన్న సాయంత్రము ఫీలుఖానాలో విజ్ఞాన కళాకేంద్రము నిర్వహించ పూనుకున్న సంగీత విద్యాలయానికి ప్రారంభోత్సవము జరిపారు.

ఆంధ్రసరస్వతీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించబడే ఈవిద్యాలయ ప్రారంభోత్సవ సమావేశానికి స్థానిక సంస్థల మంత్రి శ్రీ మందుముల నరసింగరావు అధ్యక్షత వహించారు.

తమిళ దేశములో వ్యాప్తముగా ఉన్నంతగా సంగీతశాస్త్రము ఆంధ్రదేశములో వ్యాప్తము కాలేదనీ ఆ శాస్త్రము పట్ల ఆదరము కూడా ఆంధ్రుల్లో తక్కువగా కన్పిస్తున్నదనీ అందువల్లనే సంగీత విద్యాలయాలు చాల సక్రమంగా పనిచేస్తున్నాయనీ ఐహికాముష్మిక ఫలప్రదము ఆనంద ప్రదమూఅయినసంగీతశాస్త్రాభ్యాసానికి ప్రజల ఆదరాభిమానాలు అవసరమనీ శ్రీ హనుమంతరావు, శ్రీ నరసింగరావు అన్నారు. విజ్ఞాన కళాకేంద్రము ఉపాధ్యక్షులుగా ఉండి కళాకేంద్రము ఆశయాల్లో ఒకటిగా సంగీత విద్యాలయ నిర్వహణకు ఉపక్రమించిన శ్రీ కల్వ సూర్యనారాయణను, శ్రీ కె. పరమయ్యను వారు అభినందించారు. గట్టి పట్టుదలతో విద్యాలయ నిర్వహణను విజయవంతము చేయాలని ఇరువురూ కోరారు.

ప్రముఖ వేణుగాన విద్వాంసుడు శ్రీ పోలవరపు రామచంద్రరావు ప్రసంగిస్తూ కర్ణాటక సంగీతానికి ప్రాచుర్యం తెచ్చిన 72గురు సంగీతకారుల్లో 69 మంది తెలుగువారే అయినప్పటికీ తెలుగుదేశములో సంగీతశాస్త్రం పట్ల అభిమానము కానరాకపోవడము విచారకరమన్నారు. 34748 రకాల రాగాలున్నాయంటారు. వందతామర రేకుల్ని సూదితో గ్రుచ్చితే ఒక్క తామరరేకు తూటు పడేందుకు పట్టే కాలమెంతో అది ఒక క్షణముగా పేర్కొని అది ప్రాతిపదికగా సంగీత శాస్త్రము బీజప్రాయమైన నాదం మీద ఆధారపడి మహా గహనమైన శాస్త్రముగా విస్తరించినదనీ దీన్ని ప్రజాభిరుచికి దగ్గర పరచడానికి విద్వాంసులచే సంగీత సభలు తరచు జరిపించాలనీ ఆయన సూచించారు. తెలుగు పండితులకు, సంగీత విద్వాంసులకు ఆకర్షకమైన వేతనాలివ్వడానికి పూనుకొని విద్యాసంస్థలు యూనివర్సిటీల తక్కువ్వాన్ని ఆయన విమర్శించారు.

విజ్ఞాన కళాకేంద్ర ఉపాధ్యక్షుడు శ్రీ కల్వసూర్యనారాయణ, రాజేంద్రనగర్ పంచాయతి సమితి అధ్యక్షుడు శ్రీ కె. పరమయ్య యీ సంగీత విద్యాలయానికి ప్రజల పోత్సాహాన్ని అభ్యర్థించారు.

కళాకేంద్రము కార్యదర్శి శ్రీ ఎం. వి. సుబ్బారావు సంగీత విద్యాలయాశయాల్ని దాని స్థాపనలో తమ ఉద్దేశాన్ని వివరించారు. శ్రీ కళా నివేదిత తరపున శ్రీ రామచంద్రరావు కూడా ప్రసంగించి విద్యాలయానికి రు. 16 విరాళాన్ని ప్రకటించారు.

కృతజ్ఞతాభి వందనాలతో సమావేశము ముగిసింది.

మద్య నిషేధ సమస్యపై ఎన్నికలో పాల్గొనుటకు శ్రీ గౌతు లచ్చన్న సంసిద్ధత

హైదరాబాద్, ఆగస్టు 29

మద్యనిషేధ సమస్యపై ఎన్నికల్లో పాల్గొనుటకు ఆంధ్ర ప్రదేశ్ లెజిస్లేచర్ స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ గౌతు లచ్చన్న సన్నద్ధతను ప్రకటించారు.

తెలంగాణలో మద్య నిషేధాన్ని అమలుపరచుటకు సుముఖులుగానున్న వారికే కాంగ్రెస్ సిఫార్సు చేస్తుందని ఉపముఖ్య మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి వెలిబుచ్చిన అభిప్రాయాన్ని విమర్శిస్తూ శ్రీ లచ్చన్న పై విధంగా అన్నారు.

"రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కే విజయం అభిస్తుందని ఉపముఖ్య మంత్రికి నమ్మకముంది. మద్య నిషేధాన్ని ప్రవేశపెట్టు సమస్యపై నేను యెన్నికలలో పాల్గొనుటకు సిద్ధంగా యున్నాను. ఉపముఖ్య మంత్రి కూడ అందుకు సుముఖతను వెలిబుచ్చాలి" అన్నారు శ్రీలచ్చన్న.

...—

స్వస్తి శ్రీ ప్లవ నామ సం॥ శ్రావణ బ॥ 8 శనివారము నుండి బ॥ 11 అనగా 2-9-1961 మొదలుకొని 5-9-1961 వరకు, చంచలగూడెం శ్రీచెన్నకేశవస్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జనన మహోత్సవము జరుపబడును.

బర్మా సైనికులచే తిరుగు బాటుదారుల ముట్టడి

28 గురుతిరుగుబాటుదారులూ, ఒక సైనికుడూ మరణించినవైన రంగూన్, ఆగస్టు 29

ప్రభుత్వ సైనిక దళాలు గత మంగళవారం 100 మంది కారెన్ తిరుగుబాటుదారులను కమ్యూనిస్టు తిరుగుబాటుదారులతోసహా న్యావుంగ్లేబ్మి (దక్షిణ బర్మా)లో చుట్టుముట్టిన ఫలితంగా 28గురు తిరుగుబాటుదారులు మరణించారని నేడిచట అధికారిత్యా తెలిసింది. మూడు గంటలపాటు జరిగిన యీయుద్ధంలో ఒకప్రభుత్వ సైనికుడు కూడా మరణించాడట.

—...—

సాహిత్యంలో వాస్తవికతకు అధిక ప్రాధాన్యం కూడదు

శ్రీ మొక్కపాటి శివాజీ అభిప్రాయం

హైదరాబాద్, ఆగస్టు 29

శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో యీనెల 20 న "చర్చా వేదిక" (పాఠకులగోష్ఠి) జరిగింది సమావేశానికి శ్రీ మొక్కపాటి శివాజీ అధ్యక్షత వహించారు. గోష్ఠిలో శ్రీ బందా చంద్రమౌళి, శ్రీ జి. శంకరరావు, శ్రీ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

గోష్ఠి సమావేశ కర్త శ్రీ టి. పి. విఠల్ సభికుల నాహ్వానిస్తూ ఈచర్చా వేదిక ఆశయాన్ని వివరించారు. "ఈ నాడు అనేక కొత్త గ్రంథాలు వెలువడుతున్నాయి. అవన్నీ పాఠకుల దృష్టికి రాకపోవచ్చు. పాతగ్రంథాలలో కూడా అనేకం పాఠకుల దృష్టిలో లేకపోవచ్చు. ఈ చర్చావేదికద్వారా ఇటువంటి గ్రంథాలనేకం పాఠకులకు పరిచయం చేయటమే ఈగోష్ఠి యొక్క ఆశయం" అని ఆయనచెప్పారు.

శ్రీ బందా చంద్రమౌళి "తెలుగు సాహిత్యం" మొదటినుండి సమీక్షిస్తూ మన సాహిత్య చరిత్రలోని వివిధ ఘట్టాల్ని వివరించారు ఛందోబద్ధమైన కవిత్వానికి రాను రాను ప్రాధాన్యం తగ్గిపోతోందనీ గేయ సాహిత్యము ఈనాడు బాగా ప్రచారంలోకి వచ్చిందనీ చెప్పారు. సాహిత్యం ద్వారా వాస్తవాన్ని ప్రదర్శించటంలో అనాదినుండి వస్తున్న సాంప్రదాయాలను ఈనాడు పాటించటం లేదన్నారు.

శ్రీ జి. శంకరరావు "దేవుని పేరట" అనే గ్రంథాన్ని సమీక్షించారు. మానవుడు ధర్మంగా ప్రవర్తించినవుడు అతడికి అన్నంకూడా పుట్టదనీ లోకుల్ని మోసగించటం మొదలు పెట్టిన తర్వాత సంఘంలో అతడు పెద్దమనిషిగా చెలామణి అవుతాడనీ ఈసిద్ధాంతమే ఈనవలలో నిరూపించబడిందనీ చెప్పారు.

శ్రీ సత్యప్రసాద్ నోరి నరసింహశాస్త్రి గారి "మల్లారెడ్డి" అనే నవలను సమీక్షించారు. ఈనవల ఒక పాటిక దృక్పథంతో వ్రాయబడిందనీ, మల్లారెడ్డి కాలంలో యవనులు చేసిన దురాగతాల్ని అతిశయోక్తులుగా చేసి వర్ణించారనీ చెప్పారు. ఈ నవలలో వ్రాసిన విషయాలు చరిత్రకు విరుద్ధంగా ఉన్నాయన్నారు.

అధ్యక్షులు శ్రీ మొక్కపాటి శివాజీ మాట్లాడుతూ సాహిత్యంలో "వాస్తవికత"కు అధిక ప్రాధాన్యం ఇవ్వరాదన్నారు. అన్నింటికీ "వాస్తవ దృక్పథం" అంటూ కూర్చుంటే సాహిత్యంలో పురోగమనం ఉండదన్నారు. "మన ప్రాచీన సాహిత్యంలో వాస్తవ దృక్పథం లోపించిందనీ, అదంతా పాతబడిన భావాలతో నిండి ఉంటుందనీ పలువురు విమర్శిస్తారు. అట్లా విమర్శించే వారికి వాస్తవ దృక్పథం లేదని చెప్పాలి. సాహిత్యంయొక్క విలువ పాత, కొత్త మొదలగు వాటిమీద ఆధారపడి ఉండదు. అసలు వర్తమాన సాహిత్యానికి భూతకాల సాహిత్యం ఆధారం" అని చెప్పారు.

శ్రీ టి.పి.విఠల్ వందన సమర్పణ చేశారు. (ప్ర.వి.)

—...—

బండారి రాములు హింసా నేరము తీర్పు

ముద్దాయికి జైలుశిక్ష, జరిమానా

మానుకోట, ఆగస్టు 29

స్థానిక మున్సిఫ్ మేజస్ట్రేటు శ్రీ రాంకిషన్ రావు యాకూబ్‌ఖాన్ అనే వానికి ఒకసంవత్సరం కఠినశిక్ష, నూరు రూపాయలు జరిమానా విధిస్తూ నిన్న తీర్పు చెప్పారు.

గత మే 22 న యాకూబ్‌ఖాన్ మరో 6 గురితో కలసి బండారి రాములు అనే వానిని కత్తితో పొడిచి అతనిని తీవ్రంగా గాయపర్చాడని ఆరోపించబడింది. ఈ ఆరోపణను మున్సిఫ్ మేజస్ట్రేట్ విచారించి యాకూబ్‌కు శిక్షవేసి మిగిలిన నిందితులను నిర్దోషులుగా భావిస్తూ వారిని విడుదల చేయాలని యీ ఆసుగురు తలా రూ. 50లు హింసకు గురిఅయిన వానికి చెల్లించాలని తీర్పులో ఆదేశించారు.

ప్రచురణల ముద్రణ, డిజైన్లు

ప్రభుత్వ బహుమతులకు పోటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 29

పుస్తకాలు, ఇతర ప్రచురణల ముద్రణ, డిజైనులకు ప్రశస్తంగా ఉన్నవాటికి బహుమతులు ఇవ్వగలందులకై ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 7 వ పోటీకి పుస్తకాలను ఇతర ప్రచురణలను పంపవలసిందిగా భారత ప్రభుత్వం కోరుతున్నది. బహుమతులకు సంబంధించిన ప్రదర్శనం, పోటీ ఈ ఏడు నవంబరులో ఏర్పాటు చేయబడతాయి. ప్రచురణకర్తలు, ముద్రాలుపకు, వ్యాపార సంస్థలు, అడ్వర్టయిజర్లు, అడ్వర్టయిజింగు సంస్థలు వ్యాపార కళకు సంబంధించిన స్టూడియోలు, తదితరులు 1961 అక్టోబరు 5 వ తేదీలోగా తమ పుస్తకాలు, ప్రచురణల కాలూకు రెండు ప్రతులను పోటీకి పంపవలసి ఉంటుంది.

1960 ఆగస్టు 15, 1961 ఆగస్టు 14 వ తేదీలోగా భారత యూనియన్‌లో వీటి డిజైను ముద్రణ జరిగి ఉండాలి. లోహంపై ముద్రణలు కూడా ఈ పోటీలో పరిశీలింపబడతాయి.

ఈ క్రింది తరహాల ప్రచురణలు పుస్తకాలు పోటీకి అర్హమైనవిగా పరిగణింపబడతాయి:- బాలసాహిత్యం. సెకండరీ స్కూలు దశవరకు పిల్లలకు పాఠ్యపుస్తకాలు; బొమ్మలపుస్తకాలు; ఆర్టు పుస్తకాలు; పుస్తకాల ఉత్పత్తి (ఇంగ్లీషు); పుస్తకాల ఉత్పత్తి (భారతీయ భాషలు); రోజువారీగా వెలువడే వార్తా పత్రికలు (ఇంగ్లీషు); రోజువారీగా వెలువడే వార్తా పత్రికలు (భారతీయ భాషలు); డిస్‌ప్లే అడ్వర్టయిజ్మెంటు లేఔట్లు; ఆర్టు మాగజేన్లు, వార్షిక పత్రికలు; గృహ పత్రికలు; ఇంగ్లీషు పీరియాడికల్ పత్రికలు (వార్షిక పత్రికలు మినహా); భారతీయ భాషలలో పీరియాడికల్ పత్రికలు (వార్షిక పత్రికలు మినహా); పోస్టర్లు, ఫోల్డర్లు- ఆఫ్‌సెట్/ఫొటోగ్రావ్యూర్, ఫోల్డర్లు - లెటర్ ప్రెస్ కాలెండర్లు- ఆఫ్‌సెట్ ఫొటోగ్రావ్యూర్, క్యాలెండర్లు - లెటర్ ప్రెస్, డయరీలు, దేవనాగరి టైపు ఫేస్‌లు; పబ్లిసిటీ పుస్తకాలు, లేబెల్సు, బెస్టు బౌండ్ బుక్, ప్యాకేజింగు పాయింట్ ఆఫ్ సేల్సు - కౌంటరు, డిస్‌ప్లే సామగ్రి.

ప్రతి తరహా ప్రచురణకు సామాన్యంగా 3 బహుమతులు ఉంటాయి:- ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి, ప్రశంసాపత్రం.

వార్తాపత్రికల విషయంలో వరుసగా 10 సంచికలు 1961 జులై 10, జులై 20 వ తేదీల మధ్యవి (అటు జులై 10, ఇటు జులై 20 కూడా ఈలెక్కలోకి వస్తాయి) పంపాలి. ఇతర కాలానికి లేదా తేదీలకు చెందిన సంచికలు పరిగణింపబడవు.

సమితి చర్యకు కటాంగా అధ్యక్షుడు షోంబే అంగీకారం

ఎలిజబెత్‌విల్, ఆగస్టు 29

కటాంగా సైన్యంలోని ఐరోపీయ అధికారుల్ని బహిష్కరించి వారి వారి దేశాలకు పంపించి వేయడానికి సమితి పూనుకొన్నందుకు కటాంగా అధ్యక్షుడు షోంబే తన ఆమోదము తెలిపాడు.

గత రాత్రి షోంబే ఒక విజ్ఞప్తి ప్రకటనను బ్రాడ్‌కాస్ట్‌చేస్తూ ప్రజలుప్రశాంతంగా హుందాగా ఉండవలసిందని తెలిపాడు.

సమితి సేనలు వచ్చినప్పుడు మొదట్లో కొందరు బ్రిటిష్ అధికారులు లొంగిపోవడానికి నిరాకరించారట. అవసరమైతే బలప్రయోగం జరుపాల్సి వస్తుందని భారత సేనలు అల్టిమేటం ఇస్తేగాని వారు వినలేదట.

మొత్తం 500 మంది వరకూ విదేశీ సైనికాధికారుల్ని సమితి దళాలు నిర్బంధించాయి. వీరిని కామినా సైనిక స్థావరానికి పంపించి అక్కడనుండి ఎవరి దేశాలకు వారిని పంపించి వేస్తారు, వీరిలో బెల్జియన్లు, ఫ్రెంచివారు బ్రిటిష్ వారు ఉన్నారు.

...—

రష్యా ప్రాంతంలోకి విదేశీజలాంతర్గాములు

రష్యా ప్రభుత్వ హెచ్చరిక

మాస్కో, ఆగస్టు29

రష్యా ప్రాంతీయ సముద్ర పరిధిలోనికి విదేశీ జలాంతర్గాములు ప్రవేశిస్తున్నాయనీ అవి గూఢచారి చర్యలకు ఉద్దేశించబడ్డాయనీ నిన్న రష్యా ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొన్నది.

ఇందువల్ల ఇటువంటి విదేశీ జలాంతర్గాముల్ని ధ్వంసం చేయాల్సిందిగా తమ రక్షణ శాఖకు ఆదేశాలిచ్చామని కూడా రష్యా ప్రభుత్వము తెలిపింది.

కేరళలో కొబ్బరి పీచు పరిశ్రమ

నిపుణులు కొబ్బరి నారను 27 డిగ్రీలుగా విడదీయగలుగుతున్నారు.



కొబ్బరి నారతో తయారయిన విభిన్న వస్తువులు

చిక్కడపల్లిలో తిరిగి దొంగతనాల ఉద్ధృతం

హైదరాబాద్, ఆగస్టు 29

చిక్కడపల్లిలో తిరిగి చోరీలఉద్ధృతము ప్రారంభమైనట్లు తోస్తున్నది.

గతరాత్రి 2 గంటలు 5 గంటల మధ్య చిక్కడపల్లి బస్తీలోని మూడు ఇండ్లలో దొంగతనాలు జరిగాయి. చిక్కడపల్లిలోని ఇండ్లన్నీ కలిసి ఇరుకుగా ఉండడముతో ఒక మేడనుండి మరో మేడమీదకు నడవడానికి అవకాశము ఉన్న పరిస్థితి యీదొంగతనాలకు మూలమవుతున్నదని భావించబడుతున్నది.

రాత్రి జరిగిన దొంగతనాల్లో 3 ఇళ్ళలోనూ నగదుకోసమే ప్రయత్నించడము జరిగింది. తెరిచిఉన్న ఇళ్ళలో ప్రవేశించి పాంట్లు, బుష్‌కోట్లు, హాండ్ బ్యాగ్‌లు సంగ్రహించుకొని మేడల మీదకిపోయి తిరుబడిగా పరిశీలించి పర్సులను, వెన్నులను, నగదును చేజిక్కించుకొని దుస్తులను ఇతర వస్తువులను వదిలివేసి పోవడం గతరాత్రి జరిగింది.

గజదొంగల ముఠాచే క్వారీ కంట్రాక్టర్ అపహరణ

గ్వాలియర్, ఆగస్టు 29

దేవీలాల్ షికారీ అను గజదొంగ ముఠా వారు గత 25 వ తేదీన శివపురి జిల్లా సతన్వారా గ్రామానికి చెందిన ఒక క్వారీ కంట్రాక్టర్ శ్రీ ధర్మవీర్ అను నాతనిని అపహరించుకొని వెళ్ళారు. అతనిని విడుదలచేయడానికి గాను 50 వేల రూపాయలు తమకు ఇవ్వాల్సి ఉంటుందని దొంగల ముఠా ప్రకటిస్తున్నదట.

గోలకొండ పత్రికలో పనిచేస్తున్న శ్రీ కె. రామకృష్ణమూర్తి, శాసన సభా కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీ ఎస్. లింగమూర్తి ఇండ్లలోను మరొకరి ఇంట్లోను గత రాత్రి జరిగిన ఈచోరీల్లో నగదు సొమ్ము పోయినట్లు తెలుస్తున్నది.

బస్తీ పౌరుల జాగ్రత్తా చర్యలు యీమధ్య సడలిపోవడంవల్లను, బస్తీలోపల పోలీసునిఘా నామమాత్రం కావడంతోను తిరిగి చోరులకు అవకాశము చిక్కుతున్నట్లు భావించవలసి వస్తున్నది. (మా.వి)

ప్రకటన (సంక్షిప్తం)

సివిల్ సప్లయిస్ శాఖకు చెందిన చెడిపోయిన ఫర్నిచర్ ఫిక్స్‌చర్ తదితర వస్తువుల అమ్మకానికై, హైదరాబాద్ నాంపల్లిలోని నగర గిడ్డంగులలో 1961 సెప్టెంబర్ 9వ తేదీన సాయంత్రం 3 గం. లకు వేలం-టెండరు ద్వారా బహిరంగ వేలం జరుగుతుంది.

సీలువేసిన టెండర్లను సివిల్ సప్లయిస్ శాఖ డైరెక్టర్ పర్సనల్ అసిస్టెంటు 1961 సెప్టెంబర్ 8వ తేదీన సాయంత్రం 3 గం.ల వరకు స్వీకరిస్తారు. టెండర్లలో ఎట్టి షరతులను పేర్కొనకూడదు. షరతు లేదా షరతులతో కూడిన టెండర్లు పరిశీలించబడవు. టెండర్‌లో ప్రతి అంశానికి విడివిడిగా రేట్లు పేర్కొనవలెను. అమ్మకాన్ని నిర్వహించే అధికారి తన సౌలభ్యాన్నిబట్టి వస్తువులను విడివిడిగా కానీ లేదా కొన్ని లాట్లలోగాని వేలం అమ్మకం చేస్తారు.

వేలం ఆరంభం కావడానికిముందు రూ. 50 (యాభై రూపాయలు) లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో కాని లేదా వేలం జరిపే అధికారికి కాని చెల్లించి చలాను లేక రశీదు పొందనిదే ఎవరికీ వేలంలో పాల్గొనుటకు అనుమతి ఇవ్వబడదు. టెండర్లు పంపేవారు పైన పేర్కొన్న చలాను లేక రశీదును తమ టెండరుతో జతపరచవలెను. లేని యెడల టెండర్లు పరిశీలించబడవు.

కొనుగోలు దారు/ కొనుగోలుదార్లుగా ప్రకటించబడిన వ్యక్తి/వ్యక్తులు ఆ విధంగా ప్రకటించబడిన వెంటనే ఆఖరుపాట మొత్తంలో 1/4 వంతును చెల్లించి, మిగతా 3/4 వంతుల మొత్తాన్ని అమ్మకం ధ్రువపరచబడిన తేది లగాయతు వారం రోజుల లోపుగా చెల్లించవలెను.

అమ్మకం వస్తువులను ఆఫీసులు పనిచేసే ఏదైనా రోజున ఉదయం 10-30 గం. లు, సా॥ 5 గం. ల మధ్య ఎప్పుడైనా నాంపల్లిలోని నగర గిడ్డంగులలో తనిఖీ చేసుకొన వచ్చును. గిడ్డంగి సూపరింటెండెంటు తనిఖీకి నడుపాయాలు చేస్తారు.

అమ్మకానికి సంబంధించిన పూర్తి షరతులను హైదరాబాదు, ఖైరతాబాదు యూనర్ మంజిల్‌లోని సివిల్ సప్లయిస్ శాఖ డైరెక్టరు కార్యాలయంనుంచి పొందవచ్చును.

(సం) సివిల్ సప్లయిస్ శాఖ
డైరెక్టర్ తరపున.

తామర, గజ్జి, తదితర చర్మవ్యాధులకు శక్తివంతముగా పనిచేయు

రింగోజోన్

ఆయింట్‌మెంట్ లేక లోషను

RINGOZONE

RINGWORM OINTMENT... LOTION

జోన్ కెమికల్ కంపెనీ, బొంబాయి-13

పోలీసు శకటాలు, ఇతర కొత్త, పాత వస్తువుల

వేలం అమ్మకం

హైదరాబాద్-దక్కన్ పేట్లబ్రుజ్‌లోని పోలీసు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంవద్ద 1961 సెప్టెంబర్ 4వ తేది సోమవారం ఉదయం 10-30 గం. లకు వేలం ప్రారంభమవుతుంది.

24 లారీలు- 1942, 1946, 1948 నుంచి 1950 మోడలువి; 5 (15 సి. డబ్ల్యు. టి.) ట్రక్కులు- 1946 నుంచి 1948 మోడలువి; 3 జీపులు- 1948 మోడలువి; 2 లాండ్‌రోవర్ జీపులు- 1942, 1948 మోడలువి; 2 మోటారు సైకిళ్ళు- 1948, 1950 మోడలువి; కొత్త, పి. డబ

30 సంవత్సరాలుగా పోలీసు పర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పనిచేసి రిటైరైన శ్రీఎం. పి. వేణుగోపాలనాయుడు ఆగస్టు 20 వ తేదీన ఉస్మానియా ఆసుపత్రిలో మరణించారు. వీరి అంత్యక్రియలు 30 వ తేదీన సికింద్రాబాద్ మైలారుగడ్డలోని దర్గీ బాగ్‌లో జరుగుతుంది.

నవంబర్‌లో బార్ కౌన్సిల్ పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 29

ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ పరీక్షలు 1961 నవంబరులో నిర్వహింపబడతాయి. పరీక్షకు కూర్చునేందుకై దరఖాస్తు ఫారాలను బార్ కౌన్సిల్ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు హైదరాబాదునుండి పొందవచ్చును. రు. 25 పరీక్ష ఫీజును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాదులో బార్ కౌన్సిల్ మద్దుక్రింద జమకట్టి చాలాన్‌ను దరఖాస్తుతో జతపరచి 1961 సెప్టెంబర్ 15 లోగా బార్ కౌన్సిల్ కార్యాలయములో అందజేయాలి. ఆతర్వాత 1961 నవంబర్ 25 వరకు దరఖాస్తుల నిచ్చిన రు. 5 అదనముగా చెల్లించాల్సి యుంటుంది. బార్ కౌన్సిల్ లెక్చర్లు, పరీక్ష తేది, సమయము, స్థలము తర్వాత తెలియజేయబడును.

1-9-61 శుక్రవారం గొప్ప విడుదల!

విభక్త కుటుంబము యొక్క గాథ.

దీప్ అండ్ సన్‌దీప్ ప్రొడక్షన్స్

బటోవారా



తా: ప్రదీప్ కుమార్, నిరూపరాయ్, రెహమాన్, శశికళ, జవహర్ కౌల్ జీవన్, లీలాచట్నీస్, జగ్‌దీష్ సేథి, వాస్తి,
మాతన నటుడు: వి. గోపాల్.

నిర్మాత: దీప్ ఖోస్లా — దర్శకత్వం: కరుణేశ్ ఠాకూర్ — సంగీతం: ఎస్. మదన్

లిబర్టీ హైదరాబాద్. & ప్రకాష్ మంగల్ హాట్

—శ్రీ సినీ కార్పొరేషన్ విడుదల.

1-9-61 శుక్రవారం మ్యాట్నీతో ప్రారంభం

"జయ విజయ", "కనకదుర్గ పూజామహిమ" చిత్ర నిర్మాతలు సమర్పించుచున్న మరొక మహత్తర పౌరాణిక చిత్రం

వెరల్ ప్రొడక్షన్స్

వరలక్ష్మీ వ్రతం

(తెలుగు)

నిర్మాత, దర్శకుడు: బి. విఠలాచార్య.

-: తారాగణం :-

కాంతారావు, రాజనాల, బాలకృష్ణ, ముక్కామల, సత్యనారాయణ, కృష్ణకుమారి, మీనాకుమారి, ఆదోనిలక్ష్మి, అన్నపూర్ణ.

దీపక్ మహల్ హైదరాబాద్. — చిత్రా సికింద్రాబాద్.

ప్రతిరోజు 3 ఆటలు: 2-30, 6-00 మరియు 9-30 గం॥ — శుక్ర, శని, ఆది 3 ఆటలు: 2-30, 6-00 మరియు 9-30 గం॥

మార్కండేయ- వరంగల్.

—పూర్ణా పిక్చర్స్ విడుదల.

నిర్బంధ విద్యావిధానం: ప్రయివేటు టీచర్ల అగచాట్లు

హైదరాబాద్, ఆగస్టు 29

ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు ఉపాధ్యాయుల సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీయద్దనపూడి లక్ష్మీనరసింహారావు, సహాయ కార్యదర్శి శ్రీ జె. శంకరదేవు ఇలా వ్రాస్తున్నారు:

"రాష్ట్ర, కేంద్ర విద్యామంత్రులకు, తదితర మంత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఉపాధ్యాయ సంఘంవారు అనేకమార్లు తమ సాధక బాధకములను తెలుపుకున్నారు. తమ గోడును వినతి పత్రములద్వారా మనవి చేసుకొన్నారు. పత్రికలద్వారా తెలుపుకొన్నారు. తత్ఫలితముగా ప్రైవేటు పాఠశాలలకు ఎట్టికష్టనష్టములు కలుగజేయమని ప్రభుత్వం తెలిపింది. ఈ విషయమై అధికార ప్రకటన చేయుమని కోరినాము, చేస్తామని కూడా ప్రభుత్వం వాగ్దానం చేసింది, కాని ఇంతవరకు ప్రకటన జరుగలేదు. అధికార ప్రకటన చేయకపోవుటమున అనేక ప్రైవేటు పాఠశాలలు ఎత్తివేయటం, అనేకమంది ఉపాధ్యాయుల జీవనోపాధి దెబ్బతినటం జరిగింది.

ఉదాహరణకు ఉపాధ్యాయులు వ్రాసిన కొన్ని కష్టనష్టాలను ఈ క్రింద విశదపరుస్తున్నాము:

(1) శ్రీ ప్రక్కి సూర్యనారాయణమూర్తి పశ్చిమ గోదావరిజిల్లా నిడదవోలు నుంచి ఇలా వ్రాస్తున్నారు:

ఇచ్చటనున్న బి.డి.ఓ. ఇన్‌స్పెక్టరు ఇద్దరువచ్చి నిర్బంధ విద్యావిధానము అమలులోనికి వచ్చినది ఇక నుంచి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలలోనికి రావలయును గాన మీ పాఠశాలను ఎత్తివేయవలెనని బాధపెట్టి పాఠశాల ఎత్తివేయించినారు. ఎలిమెంటరీ పాఠశాల హెడ్మాష్టరుగారు మా పాఠశాలలోనికి మీ పిల్లలను పంపనియెడల హైస్కూలు పరీక్షలకు వెళ్ళుటకు వీలులేదని పిల్లలతల్లిదండ్రులను భయపెట్టినారట. ఈ కారణములవలన 16 సంవత్సరములనుండి ఈ వృత్తిపై ఆధారపడి జీవించుచున్న నేను, నా భార్యాబిడ్డలు బాధపడుచున్నాము.

(2) శ్రీ చుక్కా రామలింగయ్య తెనాలి తాలూకా పల్లభాపురంనుంచి ఇలా వ్రాస్తున్నారు:

ప్రభుత్వ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను జరిమానా శిక్ష అని బెదిరించి పిల్లలను తమ పాఠశాలలో చేర్చుకుంటున్నారు. వచ్చే సంవత్సరం ప్రైవేటు చదువు పిల్లలకు అడ్మిషన్స్ ఉండవని కూడా ప్రచారము చేశారు. ఈవిధముగా జరుగుటవలన ఇచట నా పాఠశాలలో పిల్లలు తగ్గినారు.

(3) శ్రీ యన్. జనార్దనాచారి కరీంనగర్ ధూలికట్టనుంచి ఇలా వ్రాస్తున్నారు:

పిల్లలను ఎలిమెంటరీ స్కూల్ టీచర్సు వారి పాఠశాలకు దౌర్జన్యముగా తీసికొనిపోవుచున్నారు. ఈ విధముగా జరుగుచున్నందువల్ల బీదస్థితిలోనున్న ఈ దీనుడు వట్టిగా ఉండే సూచనలు కనబడుతున్నవి.

(4) శ్రీమతి కాళేపల్లి సావిత్రమ్మ తాడేపల్లిగూడెం నుంచి ఇలా వ్రాస్తున్నారు;

ఇచట బోర్డు ఎలిమెంటరీ మాస్టర్ల అల్లర్లు ఎక్కువగా ఉన్నవి. నా ప్రయివేటు పాఠశాలలను ఎత్తివేయమని దౌర్జన్యము చేయుచున్నారు. తల్లిదండ్రులను జరిమానా మున్నగునవి చెప్పి బెదరించుచున్నారు. 10 సంవత్సరముల నుండి ఈ వృత్తిగా నమ్ముకున్న నా బీద దాని జీవితము ఇకముందు ఎలాగడవాలో అర్థముకావటములేదు.

(5) శ్రీ పెద్దూరు కృష్ణయ్య మహబూబునగర్ జిల్లా కొల్లాపురంనుంచి ఇలా వ్రాస్తున్నారు:

మేము చాలా చివరప్రాంతములో యున్నాము. ఇచట బి.డి.ఓ. ప్రయివేటు పాఠశాలలను మూసివేయమని బెదిరించుచున్నారు. మా మాట విను వారు ఎవ్వరు లేరు. మా మొరఎవ్వరు ఆలకించరు. మేము గ్రుడ్డివారమై, పశువులవలె తయారైతిమి. ఏదో విధముగా జీవించుచుంటిమి గదా అను తృప్తితో యుండగా ఈ నిర్బంధ విద్యావిధానము వలన మా జీవనోపాధులు దెబ్బతిన్నాయి. కాన మాకు సరియైన త్రోవ ప్రభుత్వమునకు చెప్పి చేయించగోర్తాను.(6) శ్రీ లంకా క్రిమన్నారాయణమూర్తి -గుంటూరు జిల్లా-పొన్నూరు నుంచి ఇలా వ్రాస్తున్నారు.

సుమారు 15 సంవత్సరముల నుండి ఈవృత్తిమీదనే ఆధారపడి ఎట్టి శిక్షణ పొందక చాలీచాలని జీతములతో జీవిస్తూ బాధపడుతూ జీవనోపాధి గడుపుకొనుచుండ ఈ నిర్బంధ విద్యావిధానము ఒక పెద్ద గొడ్డలిపెట్టుగా తయారైంది. సాధారణముగా ప్రైవేటు ఉపాధ్యాయులందరు ఎట్టి ట్రైనింగ్ లేకపోయినను, విద్య గరపుటలో శక్తివంచన లేకుండా కృషి చేస్తూయుంటారు. ఇట్టిస్థితిలో ప్రైవేటు ఉపాధ్యాయులు ఎలా జీవించాలో అర్థము గావడములేదు.

(7) శ్రీ భాగవతుల సత్యనారాయణ- కొవ్వూరు తాలూకా సమిశ్రగూడెం నుంచి ఇలా వ్రాస్తున్నారు:

ఇచట డిప్యూటీ ఇన్‌స్పెక్టరుగారు ప్రైవేటు పాఠశాల ఉంచరాదు అన్నారు. ఈనిర్బంధవిద్యవల్ల నావద్ది పిల్లలు తగ్గుచున్నారు. 20 సంవత్సరములనుండి ఏజీవనోపాధిలేక ఈ వృత్తిమీదనే ఆధారపడి జీవించుచున్న నా బ్రతుకు ఏమవాలో అర్థముకాకుండా యున్నది చాలా బీదవాడను

(8) శ్రీ బత్తలవల్లం విజయరాఘవ పిళ్ళై-నెల్లూరుజిల్లా-తడగ్రామంనుంచి ఇలా వ్రాస్తున్నారు.

పిల్లల తల్లిదండ్రులు నిర్బంధవిద్యా చట్టములు చూచి భయపడి పిల్లలను పరిషత్తు స్కూళ్ళకే పంపుచున్నారు. పైపెచ్చు ప్రాథమిక ఉపాధ్యాయులు బలవంతముగా పిల్లలను లాగుకొని పోవుచున్నారు. ఇదేవృత్తిని 20 సంవత్సరముల నుండి నమ్ముకొని వేరు వృత్తి లేకజీవించుచున్న నేను, నాభార్య బిడ్డలు ఆకలిబాధకు అలమటించవలసినదేనా.

(9) శ్రీ పోలవరపు సత్యనారాయణ తెనాలి నుండి ఇలా వ్రాస్తున్నారు:

ఈనిర్బంధ విద్యా విధానమువలన కొన్ని ప్రైవేటు పాఠశాలలు తెనాలి పరిసర ప్రాంతాలలో ఎత్తివేసినారు. ప్రైవేటు ఉపాధ్యాయులు నిరుద్యోగులై బాధపడుచున్నారు. ప్రభుత్వ జి.ఓ.లో ఉన్న అంశములే కాక, ఇంకా కొన్ని కల్పించి, అమాయకులైన పిల్లల పెద్దలనుభయపెట్టి వారిపాఠశాలలో పిల్లలను తెర్చుకొని ప్రైవేటు పాఠశాలలను ఎత్తివేయుటకు ప్రభుత్వ ఉపాధ్యాయులు కారకులైనారు.

(10) శ్రీ చదువుల కంబగిరిస్వామి-కర్నూలు జిల్లా-నందికొట్కూరుండి ఇలా వ్రాస్తున్నారు.

ఇచట ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలు వెళ్ళరాదనియు, ప్రైవేటు పిల్లలకు అడ్మిషన్స్ ఉండవని ప్రచారముచేసినారు. పిల్లలుతగ్గినారులందోళనగాయున్నది.

(11) శ్రీ ఆర్. గంగరాజు, పశ్చిమ గోదావరి జిల్లా-కొవ్వూరునుంచిఇలా వ్రాస్తున్నారు.

ఈనిర్బంధ విద్యా విధానమువలన పిల్లలందరు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్ళుటవలన ఏఆదాయములేక క్లిష్ట స్థితిలో జీవితము గడుపుచున్నాను.

(12) శ్రీ శేఖుమదార్-నల్లగొండ ఇలా వ్రాస్తున్నారు.

ఇచట ప్రభుత్వ ఉపాధ్యాయులు మా ప్రైవేటు పాఠశాలలను మూసివేయవలసినదిగా ఒత్తిడి తెచ్చుచున్నారు. నేనేమిచేయాలో నాకేమీ తోచటములేదు.

గ్రామాలలో మారుమూలల ఉన్న పల్లెలలో ఈనిర్బంధ విద్యాప్రభావమువలన కొంతమంది సోదర ఉపాధ్యాయుల జీవనోపాధి దెబ్బతిన్నదని వారి ఉత్తరములవల్ల తెలుస్తోంది. ప్రభుత్వం వారు ఇప్పటికైనను దయయుంచి, మాకష్టనష్టములుగమనించి తక్షణంఅధికార ప్రకటనచేసి మా ప్రైవేటు ఉపాధ్యాయులందరి భయాందోళనలు తీరుస్తారని ఆశిస్తున్నాము."

హిందీ ప్రచారక్ శిక్షణ కోర్సులలో ప్రవేశం

హైదరాబాదు, ఆగస్టు 29

దక్షిణ భారత హిందీ ప్రచారసభ (మద్రాస్) రాష్ట్ర భాషాప్రవీణడిగ్రీ పరీక్ష మొదటిభాగంలో ఉత్తీర్ణులయిన వారు చంచల్‌గూడ (హైదరాబాద్) లోని హిందీ ప్రచారక్ విద్యాలయంలో 1961 సెప్టెంబర్ 9 వరకు శిక్షణార్థం చేర్చుకోబడుతారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రతించవచ్చును

హైదరాబాదు, ఆగస్టు 2 ।

కరీంనగర్‌కు 15మైళ్ళ దూరంలో గల సుల్తానాబాద్‌లో 7వ లోక సహాయక సేన శిక్షణ శిబిరం సెప్టెంబర్ మొదటి తేదీ నుండి మాసాంతం వరకు నిర్వహింపబడుతుంది.

నేడే చూడండి!

యస్. డి. నారంగ్స్:

మోడర్న్ థియేటర్స్

తా: ప్రదీప్‌కుమార్, సయీదా ఖాన్, నళినీ ఛోంకర్, జానీవాకర్.

సంగీతం: రవి.

బసంత్-హైదరాబాద్.

3 ఆటలు: 3-30, 6-30, 9-30

అజంతా-సికింద్రాబాద్.

3 ఆటలు: 3-30, 6-30, 9-30.

మూవీస్ ప్రైవేట్ లి., విడుదల.

కీ॥ శే॥ రాజాబహద్దర్ జన్మదినోత్సవం

నారాయణగూడా బాలికాపాఠశాలలో నిర్వహణ

(స్వ. వి.)

హైదరాబాద్, ఆగస్టు 29

గత శనివారము ఉదయం 10-30 గంటలకు రాజాబహద్దర్ వెంకటరామారెడ్డిగారి మహిళా కళాశాల నారాయణగూడభవనములో, గరల్స్ మల్టిపర్పస్ హైస్కూలు మరియు మహిళాకళాశాల పక్షమున రాజాబహద్దర్ వెంకటరామారెడ్డిగారి జన్మదినోత్సవము జరుపబడింది. శ్రీమాడపాటి హనుమంతరావుగారి ప్రతిపాదనపై స్థానిక స్వపరిపాలనాశాఖా మాత్యులు శ్రీ ఎం. నరసింగరావుగారు సభకు అధ్యక్షత వహించారు.

శ్రీమతి సుమిత్రా రాగిణి హిందీలో ఉపన్యసించుచు, రాజాబహద్దరుగారి జీవితము యొక్క పూర్తి వివరములను తెలిపారు. వారి విశాల హృదయము సమానదృష్టి, దేశసేవా పరాయణత, స్త్రీ విద్యాభిమానమును ప్రశంసించారు. శ్రీమతి కుసుమ నాగేశ్వరి ఇంగ్లీషులో మాట్లాడుచూ వెంకటరామారెడ్డిగారు నిజాంచే రాజాబహద్దరు బిరుదును పొందుటయేగాక, బ్రిటిష్ ప్రభుత్వమునుండిగూడ ఒ. బి. ఇ. గౌరవమును పొందుట వారి ఉద్యోగ నిర్వహణ నిపుణత్వమునకు ఫలితమన్నారు. వారు ఉర్దూ, ఫారసీ భాషలలో పాండిత్యమును గడించుటయేగాక, 60వ యేట ఇంగ్లీషును అభ్యసించారంటే విజ్ఞానార్జనలో వారి పట్టుదల కనబడుతుందన్నారు. రెడ్డి బాలబాలిక వసతి గృహాలు, బాలికల ఉన్నత పాఠశాలను స్థాపించి అమరజీవులైరన్నారు. అస్పృశ్యతా నివారణ కులమత విచక్షణ లేకుండ అనాథల, బీదలకు వారుచేసిన సహాయ మపారమన్నారు. కుమారి కెయిటి ఇంగ్లీషులో మాట్లాడుచూ, విద్యార్థుల ఎడవారి ప్రేమ, ఉన్నత ఆదర్శభావాలనూ పేర్కొన్నారు. కుమారి యోగనాంచారి తెలుగులో మాట్లాడుచు, విద్యారంగములో రెడ్లు చేసిన కృషి తెలిసి కోవలెనంటే శ్రీ అడవిబాపిరాజుగారి గోనగన్నారెడ్డి నవలను చదువుమన్నారు. వెంకటరామారెడ్డిగారు జానిసల నిరోధక శాసనము మంజూరు చేయించి సాంఘిక సేవ చేశారన్నారు.

సభాధ్యక్షులు శ్రీ నరసింగరావుగారు మాట్లాడుచు, తాము గృహశాఖామంత్రిగా నున్నప్పుడు దేశశాంతి భద్రతలకై రెడ్డిగారు అవలంబించిన మార్గమును అనుసరించవలెనని పోలీసువారికి సలహా నిచ్చేవాడనని అన్నారు. వారితో తమకుగల వ్యక్తిగత పరిచయమును వివరించుచు, రెడ్డి హాస్టలు ఒకప్పుడు "దేశద్రోహ కేంద్రము"గా ప్రభుత్వముచే అనుమానించబడినపుడు, ఢిల్లీ వాస్తవ్యులు ఖ్వాజాహసన్ నిజామీకి దీనిని చూపి, తన దేశభక్తిని, పరోపకార పారీణతను ధ్రువపరిచారన్నారు. తెలుగులో గోలకొండ పత్రికను స్థాపించి ఉర్దూ రయ్యతు పత్రికకు తగునహాయముచేసి ప్రజాభిప్రాయ వేదికకు అవకాశము కల్పించారన్నారు.

తరువాత వినోద కార్యక్రమము అద్భుతముగా ప్రదర్శింపబడ్డది. రాజాబహద్దరు పేర బృందగానము, కుమారి సునంద నృత్యము. కుమారి అనసూయ సితార్ వాద్యము, అంతర్వాణ ప్రహసనము. కుమారి ఉషా బిందు పాటలు. ఛోటేనవాబు వివాహము, కుమారి సరోజ మోనోయాక్టింగు, దర్బార్ జహాంగీరు ప్రదర్శనము సభికుల నానందపరిచినవి.

శ్రీ మాదిరెడ్డి హనుమంతరావుగారి వందనములతో సభ ముగిసింది.

...—

కార్పొరేషన్ గత సమావేశంమినిట్స్

కొంత వాదోపవాదాల అనంతరం సభ్యుల ఆమోదం

హైదరాబాదు, ఆగస్టు 29

మేయర్ ఎన్నిక నిమిత్తం ఈనెల 28 న జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో జరిగిన కొన్ని సంఘటనలను మినిట్స్ పుస్తకంలో వ్రాయనందుకు నిన్నటిసమావేశంలో సభ్యులమధ్య వాగ్వివాదం జరిగింది.

కార్పొరేషన్ కొత్తమేయర్ శ్రీ రామమూర్తి నాయుడు అధ్యక్షతన నిన్న తొలిసమావేశం జరిగినది. దీనిలో మొన్న 28 న పాత మేయర్ శ్రీ వేద ప్రకాశ్ దుసాజ్ అధ్యక్షతన జరిగిన మేయర్ ఎన్నికల సమావేశములో ఆక్షాయ్ మోడల్ షెడ్యూల్ గురించి స్థాయీసంఘం తెలిపిన అభిప్రాయాన్ని వెల్లడించకోరుతూ సోషలిస్టు సభ్యుడు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అప్పుడే మరో సభ్యుడు లేచి గొడవసాగించ ప్రారంభించాడు. శ్రీ దుసాజ్ పూనుకొని ప్రేక్షకులను బయటికి పంపవలసి వస్తుందని హెచ్చరిక చేసిన కొంతసేపటికి సమావేశములో ప్రశాంత పరిస్థితి ఏర్పడింది. ఈఅంశాలన్నింటిని మినిట్సులో చేర్చలేదని యీవిధంగా చేర్చకపోవటం అక్రమం అవ్యాయము అని శ్రీ గోస్వామి చెప్పారు.

సర్వేరెడ్డిపాలెంలో హత్య

(మా విలేఖరి)

ఒంగోలు, ఆగస్టు 29

ఒంగోలు తాలూకాకు చెందిన సర్వేరెడ్డిపాలెంలో 35 సంవత్సరములు వయస్సుకల టి. తులశమ్మ అను వ్యక్తిని ఆ గ్రామముకు చెందిన చెంచయ్య, తాను సారాయికొరకు అడిగినడబ్బు యిచ్చుటకు నిరాకరించినందువలన, ఆమె తన పిల్లవానికి పాలు యిచ్చుచున్న సమయమున కత్తితో పొడిచి చంపివేసినట్లు యిక్కడకు అందిన సమాచారాన్నిబట్టి తెలుస్తోంది. ఈ ఘోరహత్య యీ నెల 22 వ తేదీరాత్రి జరిగింది.

టంగుటూరు సబ్ యిన్‌స్పెక్టరు శ్రీ కె. ఇ. శామ్యుయల్ నేరస్థుని అరెస్టు చేశారు.

ఒంగోలు పన్నుల రివిజన్‌పై సభ

ఒంగోలు పన్ను చెల్లింపుదారుల సంఘమువారు ఇటీవల జరుపబడిన పన్నుల రివిజను చెల్లదని, ఒంగోలు పురపాలక సంఘము వారిమీద వేసిన దానాను స్వీకరిస్తూ పన్నులు వసూలు జరుగకుండా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ చంద్రశేఖరరెడ్డి తాత్కాలిక నిలుపుదలనుచేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఈ ఉత్తర్వులు కేవలము పన్ను చెల్లింపుదార్ల సంఘములోని సభ్యులకు వర్తిస్తుందని పేర్కొనబడింది.

ఈ ఉత్తర్వుల ననుసరించి ఒంగోలు మునిసిపల్ కమీషనరు శ్రీ కె. శ్రీరామశాస్త్రులు నాయుడు డిమాండు నోటీసులు జారీ చేయకుండా తమ సిబ్బందిని ఆదేశించారు.

పన్ను చెల్లింపుదార్ల తరపున హైకోర్టు న్యాయవాది శ్రీ యం.వి. రామశర్మ ప్రాతినిధ్యం వహించారు.

కాంగ్రెసు సభ్యులలో కొందరు యిలాంటి విషయాలను మినిట్సులో వ్రాయరాదన్న వాదాన్ని సమర్థించారు. కార్పొరేషన్‌లోని న్యాయవాద సభ్యులు శ్రీగోస్వామివాదాన్ని బలపర్చారు.

గోస్వామి తనవాదాన్ని సమర్థించుకొనుటకు కార్పొరేషన్ చట్టంలో "మే"పార్లమెంటరీ విధానగ్రంథంలో పేర్కొనబడ్డ భాగాలను మేయర్‌కు నివేదించారు.

ఈ సంఘటనలకు చెందిన అంశాలను మినిట్సులో వ్రాయకపోవటం ఉద్దేశపూర్వకంగా కాదని పొరపాటువల్ల యీవిధంగా జరిగిందని కార్పొరేషన్ కార్యదర్శి తనకు వివరించాడని కొత్తమేయర్ శ్రీరామమూర్తి నాయుడు తెలియచేశారు. మేయర్ చెప్పిన జవాబు దృష్ట్యా తన అభ్యర్థనను ఉపసంహరించుకొన్నట్లు శ్రీగోస్వామి ప్రకటించారు. తర్వాత లోగడ సమావేశానికి సంబంధించిన మినిట్సు ఆమోదించబడినవి.

తేలిక వాయిదాలు అదనపు భారం లేకుండా..

- ఈ అవకాశము కొద్ది కాలము వరకే.
- సీజన్‌లో అదనపు పైకము చెల్లించకుండా తక్కువ రేటుకు ఇప్పుడే కొనండి.
- పరతులకు సమీపములో నున్న ఉషా డీలరును కలవండి.



ఉషా

ఇప్పుడే కొనండి — నేడన్నబడు అత్యధిక ఆదరణీయమైన పంపా

జే ఇంజనీరింగ్ వర్క్స్ లిమిటెడ్, కలకత్తా

JE-47 TEL

ఏజంట్లు:

(1) ఏజంట్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ (ప్రయివేట్) లిమిటెడ్., సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాద్.

(2) మెసర్స్: నథూలాల్ జి, 67-ఎ. రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్.

హైద్రాబాదు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

సికింద్రాబాద్ డివిజన్.

నెం: 4999/EAC. — తేది: 29-8-61.

చిట్ టెండరు నోటీసు

దిగువ పేర్కొనిన పనులకై హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యొక్క రిజిస్టర్డు కాంట్రాక్టర్లనుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

క్రమ సంఖ్య	పని పేరు	కంట్రాక్టు విలువ	కంట్రాక్టు స్థాయి	ఎమ్. సి. హైస్కూల్ సికింద్రాబాద్ మున్సిపల్ లైబ్రరీలో డిపాజిట్ చేయవలసిన సొమ్ము	టెండర్ డాక్యుమెంటు విలువ	పూర్తి చేయవలసిన కాలం
1.	2.	3.	4.	5.	6.	7.
1.	సికింద్రాబాద్‌లోని తుకారాం గేట్, లాలాగూడా వద్ద రెండు గదుల ఇండ్ల నిర్మాణం (తక్కువ ఆదాయ గృహ వసతి స్కీమును అనుసరించి) గ్రూప్ "ఎ" (ఆరు యూనిట్‌లు)	రు. 42,800 - 00	కె-2	1058 - 00	12 - 00	4 నెలలు
2.	సికింద్రాబాద్, లాలాగూడా, తుకారామ్ గేటువద్ద రెండు గదుల ఇండ్ల నిర్మాణం (తక్కువ ఆదాయ గృహ వసతి స్కీము క్రింద) గ్రూప్ "బి" (ఆరు యూనిట్‌లు)	రు. 42,800 - 00	కె 2	1058 - 00	12 - 00	4 నెలలు
3.	సికింద్రాబాద్‌లోని తుకారామ్ గేట్, లాలాగూడావద్ద రెండు గదుల ఇండ్ల నిర్మాణం (తక్కువ ఆదాయ గృహ వసతి స్కీమును అనుసరించి) గ్రూపు "సి" (ఆరుయూనిట్‌లు)	రు. 42,800 - 00	కె 2	1058 - 00	12 - 00	4 నెలలు
4.	సికింద్రాబాద్‌లో లాలాగూడా, తుకారామ్ గేటువద్ద రెండు గదుల ఇండ్ల నిర్మాణం (తక్కువ ఆదాయ గృహ వసతి స్కీము క్రింద) గ్రూపు "డి" (ఐదు యూనిట్లు)	రు. 35,250 - 00	కె 2	881 - 00	12 - 00	3 నెలలు
5.	సికింద్రాబాద్‌లోని తుకారామ్ గేట్, లాలాగూడాలో రెండు గదుల ఇండ్ల నిర్మాణం (తక్కువ ఆదాయ గృహ వసతి స్కీము క్రింద) గ్రూపు "ఇ" (నాల్గు యూనిట్లు)	రు. 28,200 - 00	కె 2	705 - 00	12 - 00	3 నెలలు

1. 1961 సెప్టెంబర్ 20వ తేదీ పగలు ఒంటిగంట వరకు అడిషనల్ కమిషనర్ పక్షాన అడిషనల్ సిటీ ఇంజనీర్ టెండర్ల స్వీకరిస్తారు. అవి అదేరోజు పగలు 2-00 గంటలకు విప్పబడును.
2. 6 వ కాలములో చూపబడిన ధరకు 15-9-61 నుండి 18-9-61 వరకు (రెండు రోజులు కలుపుకొని) కార్యాలయము పనిచేయు రోజులలో షెడ్యూల్డురేట్లతోసహా టెండరు ఫారములు విక్రయింపబడుతవి. ఏ పరిస్థితులలోను వీని ఖరీదు మొత్తం వాపస్ ఇవ్వబడదు. మున్సిపల్ ట్రెజరీలో నగదు చెల్లించి వీనిని పొందవలెను.
3. ఈవరకే అందజేయబడకపోయినచో టెండర్ల వెంట ఇన్‌కమ్‌టాక్స్, సేల్స్‌టాక్స్, క్లియరెన్సు సర్టిఫికెట్లు జతపరచాలి.
4. మద్రాస్ డిటెయిల్డ్ స్టాండర్డు స్పెసిఫికేషన్‌ను అనుసరించి నిర్మాణపనుల చేయవలెను.

అడిషనల్ ఇంజనీర్,
మున్సిపల్ కార్పొరేషన్ హైద్రాబాద్, సికింద్రాబాద్ డివిజన్.

Edited Printed and Published by N. Narotham Reddy M. A. for the Golkonda Publication Ltd at the Golkonda Printing Press Hyderabad A. P.